అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 29-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 188 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50



'ఆఖరి యోధులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బివి రాఘవులు, పాలగుమ్మి సాయినాథ్, మల్లు లక్ష్మి, ఆనందాచారి, ఎస్ వినయకుమార్, వాసు

స్వాతంత్ర్య సమరయోధులపైనా వివక్షే

- 'ఆఖరి యోధులు' పుస్తకావిష్కరణలో పాలగుమ్మి సాయినాథ్ 9లో..



విద్యుత్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బి.వి. రాఘవులు ఇతర వామపక్ష పార్టీల నాయకులు

నాటి విద్యుత్ పోరాటం
చారిత్రాత్మకం..

దాని ఫలితమే ప్రయివేటీకరణకు పాలకుల వెనకడుగు

- కేంద్రంలో బీజేపీ దుర్మార్గ పాలన
- దానికి బీఆర్ఎస్, వైసీపీ వంతపాడితే ప్రజలకు ద్రోహమే
- విద్యుత్ సవరణ బిల్లుతో ప్రజలపై భారాలు
- విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో వామపక్ష నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నాటి విద్యుత్ పోరాటం చారిత్రాత్మకమైంది. ఆ ఉద్యమం ఫలితంగానే ఇన్నాళ్లు కరెంటు చార్జీలు పెంచేందుకు పాలకులు ధైర్యం చేయలేక పోతున్నారు. సంస్కరణల పేరుతో విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తే నాటి పోరాట స్ఫూర్తితో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతాం' అని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో విద్యుత్ అమరుల స్థూపం వద్ద సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం హన్మేష్, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు కె మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి ప్రసాద్,ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జానకిరాములు తదితరులు విద్యుత్ పోరాట యోధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ "సరళీకరణ విధానాల్లో భాగంగా, నాటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు భారీగా పెంచింది. ప్రయివేట్ శక్తులకు లాభం చేకూర్చే ...2లో

ఉపాధ్యాయ పోస్టులు
మాయం?

22 వేల ఖాళీలు ఉన్నాయంటున్న టీచర్ల సంఘాలు

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉపాధ్యాయ ఖాళీలు ఎన్ని ఉన్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 22 వేల ఉపాధ్యాయ ఖాళీలున్నాయని టీచర్ల సంఘాలు చెప్తున్నాయి. తెలంగాణలోని పాఠశాలల్లో 18,588 ఖాళీలున్నాయంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంటులో ప్రకటించారు. ఇంకోవైపు ప్రాథమిక విద్యలో 11,348, మాధ్యమిక విద్యలో 4,774 కలిపి మొత్తం 16,122 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటూ కేంద్ర ప్రభుత్వానికి పాఠశాల విద్యాశాఖ నివేదికను సమర్పించింది.

80 వేల కొలువుల భర్తీలో భాగంగా 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. అవన్నీ అలా ఉంటే 9,370 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ గుర్తించింది. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా 6,612 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఇందులో 5,089 ఉపాధ్యాయ పోస్టులు, 1,523 ప్రత్యేక (డిజెబుల్డ్) టీచర్లకు సంబంధించినవి ఉన్నాయి. దీనిపై ఉపాధ్యాయ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రాతిపదికన 6,612 ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారంటూ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

- 9,370 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ గుర్తింపు
- 13,086 భర్తీ చేస్తామన్న సీఎం కేసీఆర్
- 6,612 పోస్టులతోనే డీఎస్సీ వేస్తామన్న మంత్రి సబిత
- పదోన్నతులిస్తే 9,979 పోస్టులు ఖాళీ
- వాటిని డీఎస్సీలో కలపని ప్రభుత్వం
- ఉపాధ్యాయ ఖాళీల్లో గందరగోళం
- ఆందోళనలో లక్షలాది మంది అభ్యర్థులు





డీయస్సీ అభ్యర్థుల ఆందోళన (ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖలో 1,22,386 ఉపాధ్యాయ పోస్టులుంటే, ప్రస్తుతం 1,03,343 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అంటే 19,043 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తేలింది. ఇందులో 1,947 గెజిటెడ్ హెడ్మాస్టర్, 2,162 పీఎస్‌హెచ్ఎం, 5,870 స్కూల్ ...2లో

22 వేల ఉపాధ్యాయ పోస్టులను

భర్తీ చేయాలి

- చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి



రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వెంటనే భర్తీ చేయాలి. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ వేస్తామని ప్రకటించడం సరైంది కాదు. 9,979 పోస్టులకు పదోన్నతులిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి. తరగతికి ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చూడాలి. ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశపెట్టినా అందుకోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించలేదు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతోపాటు వారికి నాణ్యమైన విద్య అందుతుంది.

దళితులు, గిరిజనుల్లో
వెలుగులు నింపేందుకే చేవెళ్ల డిక్లరేషన్

పాలమూరు ప్రజలు జెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలి

- అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ
- నెలకు రూ. 4 వేల పెన్షన్
- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తాం : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన నాగర్‌కర్నూల్, అచ్చంపేట బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేవెళ్ల దళిత-గిరిజన డిక్లరేషన్ అమలు చేసి దళితులు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతామని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనుల జీవితాలలో గుణాత్మక మార్పే లక్ష్యంగా దళిత-గిరిజన డిక్లరేషన్ ప్రకటించినట్టు తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూలు, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాలమూరు ప్రజలు జెండాలను, ఎజెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. పాలమూరు జిల్లాలో ...2లో



(ఫైల్)

ఇండియా కుటమిలోకి మరికొన్ని పార్టీలు..!

గురు, శుక్రవారాల్లో ముంబయిలో భేటీ

న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా 26 ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి మూడో భేటీ ఈ నెల 31, సెప్టెంబర్ 1న (గురు, శుక్రవారం)ముంబాయిలో సమావేశం కానుంది. ఈ సమావేశంలో మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు కూటమిలో చేరబోతున్నాయంటూ అటు జేడీయూ, ఇటు కాంగ్రెస్ బహిరంగంగానే ప్రకటించడంతో ఏయే పార్టీలు ముంబయి భేటీలో పాల్గొనే అవకాశాలున్నాయి, ఎవరెవరితో కూటమి నేతలు సంప్రదింపులు సాగిస్తున్నారన్న చర్చ జరుగుతున్నది. పంజాబ్‌లోని శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) సహా మరో ఎనిమిది ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమితో సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. నితీష్ కుమార్ సారథ్యంలోని జేడీయూతో శిరోమణి అకాలీదళ్ (సాద్) సంప్రదింపులు సాగిస్తున్నదని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ...9లో

రాష్ట్రపతి చేతుల మీదుగా
ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల

సామాజిక న్యాయం, సమానత్వమనే సందేశాన్నిచ్చిన గొప్పనటుడు : ద్రౌపది ముర్ము



స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో ద్రౌపది ముర్ము, ఎన్టీఆర్ కుమార్తెలు, కుమారులు

న్యూఢిల్లీ : మాజీ ముఖ్యమంత్రి, సినీనటుడు దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) స్మారక నాణాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేశారు. సోమవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్ (ఆర్‌బీసీసీ)లో స్వర్గీయ ఎన్‌టి రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కుమార్తెలు లోకేశ్వరి, పురందేశ్వరి, భువనేశ్వరి, కుమారులు మోహన్ కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ తదితరులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన స్మారక నాణెన్ని(రూ.100) విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ స్వర్గీయ ఎన్‌టి రామారావు తన నటనతో సామాన్యుల బాధనూ ...9లో



కాశ్మీర్ అధ్యాపకుడిని ఎందుకు సస్పెండ్ చేశారు?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా వాదనలు వినిపిస్తే తప్పేంటని నిలదీత

వివరాలు 9లో

మణిపూర్‌లో ఆగని హింస

- గృహ దహనాలు... సెక్యూరిటీ గార్డు నుండి ఆయుధాల అపహరణ



వివరాలు 9లో



ఎటూ తేల్చుకోలేక..!

ఊగిసలాటలో మాజీ మంత్రి తుమ్మల


- 6వ తేదీ నాటికి తుది నిర్ణయం?
- లాభనష్టాలపై బేరీజు వేస్తున్న కేసీఆర్
- తుమ్మల విషయమై బీఆర్ఎస్ అభ్యర్థులతో భేటీ
- చర్చనీయాంశంగా మారిన వనమా బీఫామ్



ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ ముఖచిత్రంలో రోజుకో రీతిన మార్పు చోటు చేసుకుంటున్నది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కారు దిగడం.. చేయందుకోవడం లాంఛనమేననే చర్చ సాగుతోంది. అయితే ఆయన పోటీ చేసే స్థానం విషయంలోనే సందిగ్ధత నెలకొంది. తుమ్మల పాలేరు నుంచి టిక్కెట్ ఆశిస్తుండగా కాంగ్రెస్ అధిష్టానం మాత్రం ఖమ్మం నుంచి పోటీ చేయాలని కోరినట్టు తెలుస్తోంది. ఈ విషయంలో స్పష్టత వస్తే ఆయన వచ్చేనెల 6న కాంగ్రెస్ గూటికి చేరతారనే చర్చ సాగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలతో కేసీఆర్ ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు సమాచారం లేదని తెలుసింది. వనమాను అభ్యర్థిగా ప్రకటించినా బీఫామ్ ఇవ్వకపోవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. దీన్ని వనమా అనుచరులు కొట్టిపారేస్తున్నారు.

నవతెలంగాణ-
ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఎటూతేల్చుకోలేని సందిగ్ధావస్థలో 'గులాబీ'బాస్ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అభ్యర్థులు బాణోత్ హరిప్రియ(ఇల్లెందు), రేగా కాంతారావు (పినపాక), మెచ్చా నాగేశ్వరరావు (అశ్వారావుపేట), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)తో ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్ భేటీ అయ్యారు. తుమ్మల ప్రభావం ఉమ్మడి జిల్లాపై ఏమేరకు ఉంటుందనే అంశంపై చర్చించినట్టు సమాచారం. తుమ్మల స్వస్థలం దమ్మపేట మండలం గండుగులపల్లి కాబట్టి అశ్వారావుపేట నియోజకవర్గం, అలాగే టీడీపీ హయాంలో మంత్రిగా భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అధికంగా ఉండటంతో ఆ నియోజకవర్గంపై అధికంగా, కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాలపై పాక్షికంగా ప్రభావం ఉంటుందని విశ్లేషించినట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రభావం బాగానే ఉంటుందని కొంతమంది చెప్పినట్టు సమాచారం. తుమ్మలను వదులుకోవడంతో చోటుచేసుకునే పరిణామాలు, ప్రత్యర్థికి ఒనగూరే లాభనష్టాలపైనా చర్చించి ఉంటారని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి బలమైన నేత పార్టీని వీడిన దృష్ట్యా తుమ్మల విషయంలో నిర్ణయ పర్యవసానాలపై ఒకింత లోతైన చర్చే జరిగి ఉండొచ్చని బీఆర్ఎస్ ...2లో



ప్రమాదాన్ని తప్పించుకున్న ప్రజ్ఞాన్

- బిలాన్ని తప్పించుకొని వేరే మార్గంలో ప్రయాణం

బెంగళూరు : చందమామపై పరిశోధనలు చేస్తున్న ప్రజ్ఞాన్ రోవర్‌కు పెను ప్రమాదం తప్పింది. రోవర్ ప్రయాణిస్తున్న మార్గంలో నాలుగు మీటర్ల వ్యాసం కలిగిన బిలం ఎదురైంది. అయితే అందులో పడే ముప్పు నుంచి రోవర్ తప్పించుకోగలిగింది. కృత్రిమ మేథ (ఏఐ) సాయంతో ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి బిలాన్ని తప్పించుకొని సరైన మార్గంలో పయనిస్తోంది. దీనికి సంబంధించిన చిత్రాలను ఇస్రో 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

మూడు మీటర్ల దూరంలో బిలం ఉన్నదని గమనించిన ప్రజ్ఞాన్ వెంటనే తన మార్గాన్ని మార్చుకుంది. రోవర్‌లోని నావిగేషన్ కెమారా దీనికి సంబంధించి రెండు ఫొటోలు తీసింది. మొదటి ఫొటోలో బిలం కన్పించగా, ...9లో

ఉపాధ్యాయ పోస్టులు మాయం?

(మొదటిపేజీ తరువాయి)

అసిస్టెంట్ కలిపి 9,979 పోస్టులకు త్వరలో పదోన్నతులు కల్పిస్తారు. ఆ లెక్కన చూసినా మిగిలిన 9,064 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. కానీ 6,612 పోస్టులతోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న ప్రకటనపై లక్షలాది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయ పోస్టులు మాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

పదోన్నతులకు అడ్డంకి ఏంటీ?

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఒకేసారి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు విద్యాశాఖ షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే బదిలీలకు సంబంధించిన అంశం హైకోర్టు విచారణలో ఉన్నది. అది వాయిదా పడుతూ వస్తున్నది. కానీ ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టేందుకు ఎలాంటి అడ్డంకుల్లేవు. అయినా విద్యాశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదంటూ విమర్శలు వస్తున్నాయి. 9,979 పోస్టులకు పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. అందులో 5,870 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, 2,162 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు ఎస్జీటీలకు పదోన్నతులు లభిస్తాయి. అంటే 8,032 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉంటాయి. ఇంకోవైపు 1,947 గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తారు.

అయితే 1,947 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అవుతాయి. కానీ అందులో 70 శాతం అంటే 1,363 ఉపాధ్యాయ పోస్టులకు ఎస్జీటీలకు పదోన్నతులివ్వాలి. మిగిలిన 30 శాతం అంటే 584 పోస్టులనే నేరుగా భర్తీ చేయాలి. అంటే పదోన్నతుల ద్వారా 8,616 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అవుతాయి. ప్రస్తుతం భర్తీ చేసే 6,612 పోస్టులకు అదనంగా 8,616 పోస్టులు కలుస్తాయి. దీంతో 15,228 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించాలి. కానీ 5,089 ఉపాధ్యాయ, 1,523 ప్రత్యేక టీచర్ పోస్టుల భర్తీకి మాత్రమే ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. దీన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు, అభ్యర్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అటకెక్కిన 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 18,240 ప్రాథమిక, 3,164 ప్రాథమికోన్నత, 4,661 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే 10 వేల ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేస్తామంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ అది అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం 4,429 లో ఫీమేల్ లిటరసీ (ఎల్‌ఎఫ్‌ఎల్) హెచ్‌ఎం పోస్టులున్నాయి.

ఇంకా 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉన్నా అది అటకెక్కిందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇంకోవైపు 8,630 భాషా పండితులు, 1,849 పీఈటీలు కలిపి 10,479 మందికి స్కూల్ అసిసెంట్లుగా పదోన్నతులు లభించే అంశం కూడా కోర్టు పరిధిలోనే ఉన్నది. ఏకీకృత సర్వీసు నిబంధనల అంశం సైతం కోర్టులో ఉన్నందున ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్, బీఈడీ లెక్చరర్ వంటి పోస్టులకు పదోన్నతులు లభించడం లేదు.

సీఎం ప్రకటించిన 13 వేల పోస్టులైనా భర్తీ చేయాలి : రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు

ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విధంగా 13,086 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను వేయాల్సిందే. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నాం. ఆరేండ్లుగా నాలుగు లక్షల మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కేవలం 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామనడం సరైంది కాదు. దీంతో అభ్యర్థులంతా ఆందోళనలో ఉన్నారు.

దళితులు, గిరిజనుల్లో వెలుగులు నింపేందుకే చేవెళ్ల డిక్లరేషన్

(మొదటిపేజీ తరువాయి)

14కు 14 సీట్లు గెలిపిస్తే రాష్ట్రంలో 100 సీట్లు గెలిపించే బాధ్యత తమదేనన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, ఫైలేరియా డయాలిసిస్ పేషంట్లకు నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని తెలిపారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మరోసారి హామీనిచ్చారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5 లక్షల సాయం అందిస్తామని వెల్లడించారు.

కేసీఆర్ ఖేల్ ఖతం - బీఆర్ఎస్ దుఖాన్ బంద్ : రేవంత్ ట్వీట్

యావత్ తెలంగాణ గుండె చప్పుడు ఒక్కటేనని, "కేసీఆర్ ఖేల్ ఖతం - బీఆర్ఎస్ దుఖాన్ బంద్" అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మంత్రి కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌పై కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలోనే మంత్రిని ట్యాగ్ చేస్తూ రేవంత్‌రెడ్డి కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశారు. తమ డిక్లరేషన్ దళిత - గిరిజన జీవితాలలో గుణాత్మక మార్పునకు కన్ఫర్మేషన్ అని తెలిపారు. దళితుడ్ని సీఎం చేస్తాననీ. దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తామని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచుతామని మోసం చేయడం లాంటిది కాదంటూ పరోక్షంగా బీఆర్ఎస్ మోసం చేసిందని గుర్తుచేశారు. మద్దతు ధర అడిగిన గిరిజన రైతులకు బేడీలు వేయడం, నేరెళ్ల ఇసుక దోపిడీని ప్రశ్నించిన దళిత, బీసీలపై థర్ డిగ్రీ ప్రయోగించడం, కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన అసైన్డ్ భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ మాఫియాకు అమ్ముకోవడం, దళిత మరియమ్మ లాకప్‌డెత్, ఒక్క మాదిగకు మంత్రి పదవి ఇవ్వకపోవడం, ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం. దళిత బంధు పథకంలో 30 శాతం కమీషన్లు తీసుకోవడం వంటి డిక్లరేషన్ కాదు మాదని స్పష్టం చేశారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.


అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





ఏమిటో ఈ అనుబంధం ?

- చెట్టపట్టాలు వేసుకుంటున్న ఉదారవాదం, హిందూత్వం
- మాయలో పడుతున్న మధ్య తరగతి ప్రజానీకం



న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం రాజకీయంగా, సాంస్కృతికంగా పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, హిందుత్వ భావనలు చెట్టపట్టాలు వేసుకొని దేశ గమనాన్నే మార్చేస్తున్నాయి. ఓ వైపు హిందుత్వ భావనలు ప్రజా జీవనంపై పెత్తనం చలాయిస్తుంటే మరోవైపు నయా ఉదారవాద విధానాలు ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్రను హరించి వేస్తున్నాయి. ఈ మార్పులన్నీ సంపన్నులు, సంపన్నులుగా మారుతున్న మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలిగిస్తుంటే కార్మిక వర్గానికి పెను ప్రమాదంగా పరిణమిస్తున్నాయి.

ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనుసరించిన 'గుజరాత్ తరహా అభివృద్ధి' విధానాలనే ఇప్పుడు దేశమంతటికీ వర్తింపజేయాలని భావిస్తున్నారు. 2001-2014 మధ్యకాలంలో తాను గుజరాత్ సీఎంగా పనిచేసిన సమయంలో రాష్ట్రం వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించిందని మోడీ చెబుతుంటారు. అయితే ఆయన చెప్పుకునే అభివృద్ధిలో సామాజిక బాధ్యతలు కన్పించవు. ఆ అభివృద్ధికి సంపన్నులు మాత్రమే జేజేలు పలుకుతారు.

లక్ష్యం నుండి దూరంగా...

స్వాతంత్ర్యానంతరం మన దేశం రాజ్యాంగబద్ధమైన లౌకిక దేశంగా ప్రయాణాన్ని ప్రారంభించింది. ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలన్నదే దాని లక్ష్యం. అయితే ఇప్పుడు దాని నుండి వేరుపడినట్లు కన్పిస్తోంది. దేశాన్ని నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ వైపు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన సంస్థలు మనుగడలో ఉన్నా సరే... ఈ ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.

మన దేశం 1990వ దశకంలోనే తన ఆర్థిక వ్యవస్థను నయా ఉదారవాద విధానాల దిశగా నడిపే యత్నాలకు శ్రీకారం చుట్టింది. దీనివల్ల భారతీయ సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల కారణంగా మన ఆర్థిక కార్యకలాపాలన్నీ మార్కెట్‌తో ముడిపడి పోయాయి. ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో శాశ్వత ఏర్పాట్ల స్థానంలో తాత్కాలిక, మార్కెట్ ఆధారిత కాంట్రాక్టులు చోటుచేసుకుంటున్నాయి.

నయా ఉదారవాద ఆర్థిక విధానాలు సంఘటిత రంగంలోని కార్మికులకు నష్టం కలిగిస్తున్నాయి. పారిశ్రామిక యూనిట్లు మూతపడుతున్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకునే విధానాలు జోరందుకున్నాయి. గతంలో బలంగా ఉన్న కార్మిక సంఘాలు ఇప్పుడు నామమాత్రంగా మిగిలిపోయాయి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమలలో కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడమే కష్టంగా మారింది. ఎక్కడ చూసినా కాంట్రాక్ట్, దినసరి కార్మికులే కన్పిస్తున్నారు. అయితే మధ్య తరగతి ప్రజలు మెట్రోపాలిటన్ నగరాలకు విస్తరించి, తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నారు. సేవల రంగంలో ఉద్యోగాలు లభించడం సులభమైంది.



వారి పైనే వల

ఇది ఒక పార్శ్వమైతే నయా ఉదారవాద విధానాలు హిందూత్వ రాజకీయాలకు మరింత చోటు ఇచ్చాయి. మోడీ సారధ్యంలోని బీజేపీ మధ్య తరగతి ప్రజలపై కన్నేసి, వారిని బుట్టలో వేసుకునేందుకు పథకాలు రూపొందిస్తోంది. వారు కూడా సహజంగానే ఆ మాయ లో పడిపోతున్నారు. ముఖ్యంగా ప్రైవేటీకరణ చర్యలు వారిని అమితంగా ఆకర్షిస్తున్నాయి. పెట్టుబడిదారులకు ప్రభుత్వా లు అందజేస్తున్న సబ్సిడీలకు మధ్య తరగతి ప్రజలు ఆమోదం తెలుపుతున్నారు. ఇదో కొత్త పోకడ. కొన్ని సంవత్సరాల క్రితం వరకూ విధాన పరమైన నిర్ణ యాలు తీసుకునే ముందు ప్రభుత్వాలు విస్తృత సంప్ర దింపులు జరిపేవి. ఇప్పుడు అలాంటివేమీ జరగడం లేదు. అంతా ఇష్టారాజ్యంగా నడుస్తోంది. అధికార యంత్రాంగమే అన్ని నిర్ణయాలూ తీసుకుంటోంది. ప్రతిపక్షాలతో చర్చలు జరిపే సంప్రదాయానికి ఏనాడో తిలోదకాలు ఇచ్చారు. ఉదాహరణకు ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్లలో మార్పులపై ఎవరినీ సంప్రది ంచకుండానే పార్లమెంట్ సమావేశాల చివరి రోజున బిల్లులు ప్రవేశపెట్టారు. సం ప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, ప్రభుత్వ సంస్థల లో హిందూత్వ భావాలను చొప్పించేందుకు చేస్తున్న ప్రయ త్నాలలో భాగంగానే ఈ తంతు జరుగుతోంది. ఇందు కోసం మతపరమైన, జాతిపరమైన మైనారిటీల ప్రాథమిక హక్కులను ఫణంగా పెట్టడమే ఆందోళన కలిగించే విషయం.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణను ఆపాలి

నూతన విద్యుత్ బిల్లును రద్దు చేయాలి

వామపక్షాల రాష్ట్ర సదస్సులో వక్తల డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



విద్యుత్ రంగ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని పలువురు వామపక్ష పార్టీల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ అమరవీరుల వర్థంతి సందర్భంగా ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఎస్‌యూసీఐ(సీ), ఆర్ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో "కేంద్ర ప్రభుత్వ 2020 విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిద్దాం- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను ఎండగడదాం" అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలపతిరావు మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో కార్పొరేట్ వర్గాలను చేర్చే లక్ష్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కరోనా సమయంలో విద్యుత్ సవరణల బిల్లును తీసుకొచ్చిందని చెప్పారు. రైతాంగ ఉద్యమ ప్రతిఘటనతో తాత్కాలికంగా వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం.. తిరిగి అమలు చేసేందుకు యత్నిస్తోందన్నారు. విద్యుత్ రంగాన్ని రాష్ట్రాల చేతిలో నుంచి లాగేసుకునేందుకు కుట్ర చేస్తోందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా జరుపుతున్న ఈ సదస్సు స్ఫూర్తితో భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు.

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలని, ప్రీపెయిడ్ మీటర్లు పెట్టె యోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. 100 యూనిట్స్ వరకు అందరికీ ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల త్యాగఫలం నాడు కాంగ్రెస్ ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత ముదిగొండలో జానెడు జాగా కోసం పోరాడితే ఆరుగురిని పొట్టనపెట్టుకుందని విమర్శించారు. ఈ దోపిడీ పాలక వర్గాలు తమ అధికారం, అవకాశం కోసం ఎదురు చూస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాల నిర్మాణం చేయడమే ఏకైక మార్గం అన్నారు.

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్ యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురహరి, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అధ్యక్షులు ప్రసాద్, విష్ణువర్దన్, బాలస్వామి, రామకృష్ణ తదితరులు మాట్లాడారు. విద్యుత్‌ను ఒక నిత్యావసర వస్తువుగా కాకుండా అత్యవసర ఉపయోగకారిగా పరిగణించాలని, ప్రజావ్యతిరేక విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ మీటర్లు పెట్టే యోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. అలాగే 100 యూనిట్ల లోపు గృహ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ అందించాలని, ప్రస్తుతం ఉనికిలో ఉన్న రాయితీలను కొనసాగించాలని, విద్యుత్ రంగంలో అవినీతిని నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు కుంభం సుకన్య, తేజ, భరత్, హేమలత, ఆఫీఫ్, వల్లబ్ దాస్ కుమార్, వి.తుకారం నాయక్, బి.పురుషోత్తం, ఎర్ర రాజేష్, గాదే మల్లేష్, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

నాటి విద్యుత్ పోరాటం చారిత్రాత్మకం..

(మొదటిపేజీ తరువాయి)

విధంగా తమ విధానాలను రూపొందించిం ది. అవి అన్ని తరగతుల ప్రజలకు తీవ్ర నష్టం తీసుకొస్తాయని ప్రజలు గ్రహించారు. తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ పోరాటంపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. 2000 సంవత్సరం ఆగష్టు 28న నిర్వహించిన ప్రజా ప్రదర్శనపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరి పారు. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సంస్కర ణల పేరుతో ప్రజలపై భారాలు మోపితే ఖబడ్దార్ అంటూ సాగిన ఆ పోరాటం అంతర్జాతీయంగానే ప్రఖ్యాతిగాంచింది" అని రాఘవులు చెప్పారు. ఆ పోరాటం ఫలితంగానే పాతికేండ్లుగా విద్యుత్ చార్జీలు పెంచటంగానీ, ఆ సంస్థల ప్రయివేటీకర ణకు పాలకులు ధైర్యం చేయలేక పోతున్నారని తెలిపారు. ఇది కమ్యూనిస్టు పార్టీల పోరాట విజయ మని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెస్తున్న విద్యుత్ సవరణ బిల్లుతో తిరిగి ప్రమాదం ముంచుకొస్తోందని చెప్పారు. తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ కొన్నాళ్లు బీజేపీ విధానాలను వ్యతి రేకించారు, ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ.. బీజేపీ విధానాలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ వైఖరి తీసుకో వటానికి కారణమేంటో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీని అమిత్ షా ఘాటుగా విమర్శిస్తున్నా.. టూజీ, నాజీలంటూ ఒకరినొకరు ఎత్తిపొడుసుకుంటున్నా, బీజేపీ నిర్ణ యాలపై బీఆర్ఎస్ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని చెప్పారు. బీజేపీతో దోబూచలాడుతున్న బీఆర్ఎస్, వైసీపీల వల్ల ఆయా రాష్ట్రాల ప్రజలతో పాటు దేశానికి ఎంత మాత్రం మంచిది కాదని తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిలబడాల్సిన ప్రభుత్వాలు బీజేపీకి వంత పాడే పార్టీలుగా మారకూడదని హితవు పలికారు. బీజేపీ ని ఓడించడానికి ఇండియా కూటమితో వెళ్ళడం కేసీఆర్‌కు నచ్చడం లేదని చెప్పారు. అందుకే వామపక్షాలతో పొత్తు వద్దనుకున్నారా? వామపక్షా లతో సానుకూలంగా ఉంటే బీజేపీకి కోపం వస్తోందనీ తెగదెంపులు చేసుకున్నారా..? దీనికి కేసీఆరే సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు, సీపీఐ(ఎం)కు చాలా విషయాల్లో వైరుధ్యాలున్నా. బీజేపీని ఓడించడమే కర్తవ్యంగా పెట్టుకున్నామ న్నారు. బీజేపీ బలపడే విధంగా వామపక్షాల పొత్తులుండవని స్పష్టం చేశారు.

చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం మహత్తరమైందన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాల్లో భాగంగానే అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను అమలు చేసిందని గుర్తు చేశారు. వామపక్షాల నేతృత్వంలో ఆనాడు జరిగిన విద్యుత్ ఉద్యమానికి విస్తృత ప్రజా మద్దతు లభించిందన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకంటే ఉధృతంగా ప్రపంచ బ్యాంకు, పెట్టుబడిదారీ విధానాలను అమలు చేస్తూ, విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలతోపాటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్‌లను బిగించిందనీ, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ గ్రామ స్థాయి నుంచి ప్రజా ఉద్యమం మొదలైతే మోడీ ప్రభుత్వం తట్టుకోవడం కష్టమన్నారు. విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, ఆర్ శ్రీరాంనాయక్, బి ప్రసాద్, ఎంవీ రమణ, టి స్కైలాబ్‌బాబు, పి ఆశయ్య సీపీఐ సీనియర్ నాయకురాలు పి. ప్రేమపావని,ప్రజాపంథా నాయకులు ఎస్‌ఎల్ పద్మ, ఎన్డీ నాయకులు వి సంధ్య, ఎం శ్రీనివాస్, ఎంసీపీఐ(యూ) నాయకులు వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎటూ తేల్చుకోలేక..!

(మొదటిపేజీ తరువాయి)

శ్రేణులు సైతం అభిప్రాయపడుతున్నారు.

వనమాకు సమాచారం లేకపోవడంపై చర్చ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభ్యర్థులు ఐదుగురిలో నలుగురికి ప్రగతి భవన్ నుంచి శనివారం సమాచారం అందడంతో హైదరాబాద్ వెళ్లారు. ఆరోజు సీఎంకు వీలుకాకపోవడంతో ఆదివారం సాయంత్రం భేటీ అయ్యారు. అయితే కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు మాత్రం సమాచారం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగూడెం నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిగా భావించే వనమా వెంకటేశ్వరరావు పేరు ప్రకటించారని, ఆయనకు టిక్కెట్ రాని పక్షంలో పార్టీ వీడితే 'కారు' ఫలితం తారుమారు అవుతుందనే ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేగా అనర్హత కేసు ఎలాగూ ఉంది కాబట్టి ఒకవేళ కోర్టు వనమాకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే ఆ నెపంతో మరొకరికి టిక్కెట్ కేటాయించవచ్చనే ఎత్తుగడతోనే కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారనే చర్చ కూడా వైరల్ అవుతోంది. అదే జరిగితే తన చేతికి మట్టి అంటకుండా వనమాను తప్పించొచ్చనే వ్యూహంతో కేసీఆర్ ఉన్నారనే మాట వినిపిస్తోంది. కానీ వనమా అనుచరులు మాత్రం ఈ భేటీకి సమాచారం లేకపోవడానికి వేరే కారణాన్ని చూపుతున్నారు. నలుగురు అభ్యర్థుల మీటింగ్‌కు రెండురోజుల ముందుగానే వనమా ప్రత్యేకంగా సీఎంను కలిశారని, అందుకే ఈ సమావేశానికి సమాచారం అందలేదని చెబుతున్నారు.

నిజానిజాలు ఎలా ఉన్నా వనమా బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై బీఫామ్ వచ్చేంత వరకు నిర్ధారణకు రాలేమన్నది బీఆర్ఎస్‌లోనే కొందరు నేతల మాట. ఇదిలా ఉండగా.. ఏ క్షణానైనా వనమా అభ్యర్థిత్వం గల్లంతయ్యే ఛాన్స్ ఉందనే విశ్వాసంతో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ ఉన్నారు. అలాగే రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కూడా కొత్తగూడెం నుంచి పోటీపై ఆసక్తి చూపుతున్నారు. జలగం సైతం ఇదే దిశగా అచితూచి అడుగులు వేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో బురఖాలపై నిషేధం

- సెప్టెంబరు 4 నుంచి అమలు

పారిస్ : ముస్లిం మహిళలు బురఖాపై ఫ్రాన్స్‌లోని మాక్రాన్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఒకప్పటి ఫ్రెంచ్ వలసకాలనీ నైగర్‌లో తన తొత్తు ప్రభుత్వాన్ని కూలదోసి సైన్యం అధికారం చేజిక్కించుకోవడం, ఆర్థిక వ్యవస్థ అంతకంతకూ దిగజారుతుండడం, కార్మికులు పెద్దయెత్తున సమ్మెలకు దిగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మాక్రాన్ ప్రభుత్వం ఈ బురఖా అంశాన్ని తెరపైకి తెచ్చిందని పలువురు పరిశీలకులు భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నిషేధం వర్తింప చేయాలని భావిస్తున్నట్టు విద్యా శాఖ మంత్రి గాబ్రియెల్ అట్టల్ ప్రకటించారు. సెప్టెంబరు 4 నుంచి కొత్తగా విద్యా సంవత్సరం ఆరంభమవుతుండడంతో అప్పటి నుండే ఈ నిషేధం కూడా అమల్లోకి వస్తుందన్నారు. తరగతి గదిలో ఏ విధమైన మత చిహ్నాలు ఉండరాదన్న ఉద్దేశంతోనే దీనిని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. మితవాద పార్టీల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం మైనార్టీ ముస్లింలను టార్గెట్‌గా చేసుకుంటోందని వామపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు పూర్తిగా ముఖాన్ని కప్పేలా వేసుకునే ముసుగులపై 2010 ప్రారంభంలో నిషేధం విధించారు.

సమాన విద్యతోనే సమాజంలో సమానత్వం

అసమాన భావజాల పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్
ఆ పార్టీలను ఓడించాలి

'అభ్యసన సంక్షోభం' సదస్సులో ఎస్డీఎఫ్ కన్వీనర్ ఆకునూరి మురళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"అందరికి సమాన విద్య అందినప్పుడే సమాజంలో సమానత్వం వస్తుంది. ఆ సమాన విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అయితే కేంద్రం, రాష్ట్రంలో పాలిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసమాన భావజాలాన్ని విశ్వసించేవి. అందుకే ఆ ప్రభుత్వాలు అందరికి సమాన విద్యనందించడం లేదు. అందరూ సమానంగా ఉండొద్దని కోరుకునే ఆ రెండు పార్టీలు నేడు సమాజాన్ని శాసిస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రభుత్వ విద్యను ధ్వంసం చేయాలని కంకణం కట్టుకున్నారు. మన ఊరు మన బడి పథకంతో ప్రభుత్వ స్కూళ్లను మెరుగు పరిచేందుకు రూ.7,278 కోట్లను వెచ్చించనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. గతేడాది, ఈ ఏడాది బడ్జెట్లలో ఒక్క రూపాయి కేటాయించలేదు. దేశంలో 11 లక్షల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో ఐదేండ్ల కాలంలో కేవలం 14,600 మాత్రమే అభివృద్ధి చేస్తామని బీజేపీ సర్కార్ ప్రకటించింది. సమాజంలో అందరికి సమాన అవకాశాలు, సమాన విద్యనందించే సంకల్పం లేనీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలి...." అని సోషల్ డెమొక్రటిక్ ఫోరం (ఎస్డీఎఫ్) కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ ప్రజలను కోరారు.



ఎంవీ ఫౌండేషన్ (ఎంవీఎఫ్), చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్పీఎఫ్), తల్లుల సంఘం సంయుక్తాధ్వర్యంలో సోమవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని కోరుతూ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జి.వేణుగోపాల్, తల్లుల సంఘం కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, టీపీటీఎఫ్ నాయకులు ఇ.రఘునందన్, అధ్యక్షులు వై.అశోక్ కుమార్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఎస్.యాదగిరి, స్వచ్ఛంద సేవా సంస్థ సాధన డైరెక్టర్ సీహెచ్.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య కోసం రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకుంటేనే ఓటేస్తామని చెబితే పాలకులు దిగి వస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు టీచర్ల నియామకం చేపట్టడం లేదు. ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాలలు వదిలి పిల్లలు ప్రయివేటుకెళ్తున్నారు. దీంతో పిల్లలు లేని పాఠశాలలెందుకంటూ వాటిని మూసేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ విద్యపై కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. 2014 లో ప్రభుత్వ విద్యపై పెట్టిన ఖర్చును 2023 నాటికి సగానికి తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతాసిన్హా మాట్లాడుతూ , విద్యారంగం పూర్తిగా ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. విద్యలో రాష్ట్రం వెనుకబడిందనీ, దీంతో అంకెలను మార్చి ప్రగతిని చూపించేందుకు చేసే నేరపూరిత చర్యల్లో ఉపాధ్యాయులను కూడా భాగస్వాములు చేస్తారని ఆరోపించారు.

అత్యంత వెనుకబడిన తెలంగాణ

2021-22 సంవత్సరపు పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదికలో 36 రాష్ట్రాలకుగాను తెలంగాణ 31వ స్థానంలో నిలిచిందని వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యసన ఫలితాల్లో 35వ స్థానంతో అత్యంత వెనుకబడిందని తెలిపారు. ఎంవీఎఫ్, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో 17 జిల్లాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను పరిశీలించినట్టు తెలిపారు. తెలుగులో 37 శాతం మంది విద్యార్థులు, పరిసరాల విజ్ఞానంలో 41 శాతం మంది విద్యార్థులు ఏమి రాయలేకపోయారనీ, 39 శాతం మంది లెక్కల్లో ప్రయత్నం చేయకుండానే వదిలేశారని తెలిపారు. విద్యాసామర్థ్యాలు అందించడం ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతగా గుర్తించాలనీ, నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నింటిని రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, ఎమ్మెల్యేలు, అభ్యర్థుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

బీసీలు, మహిళా ఓటు బ్యాంకే లక్ష్యంగా.. త్వరలో రెండు కొత్త పథకాలు...

- ఆయా వర్గాల సాధికారతపై ఫోకస్
- ఎన్నికల ప్రణాళికలో చేర్చనున్న సీఎం కేసీఆర్
- ఇప్పటికే కసరత్తులు పూర్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా దళిత బంధు పథకాన్ని తెరపైకి తెచ్చిన సీఎం కేసీఆర్.. అదే తరహాలో ఇప్పుడు బీసీలు, మహిళా ఓటర్లే లక్ష్యంగా మరో రెండు కొత్త స్కీములకు రూపకల్పన చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయన పార్టీలోని సీనియర్లు, ఉన్నతాధికారులతో కలిసి కసరత్తులు పూర్తి చేసినట్టు తెలిసింది. దళిత బంధు తరహాలో వాటికి బీసీ బంధు, మహిళా బంధు తదితర పేర్లను పెట్టే అవకాశముంది. ఇటీవల బీఆర్ఎస్ ప్రకటించిన తొలి విడత అభ్యర్థుల జాబితాలో బీసీలకు అన్యాయం జరిగిందనే విమర్శలను ఆ పార్టీ ఎదుర్కొంటున్నది. మరోవైపు కాంగ్రెస్ గతంలో విడుదల చేసిన యూత్ డిక్లరేషన్, తాజాగా ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ కూడా గులాబీ పార్టీని ఆలోచనలో పడేశాయి. దీంతో బీసీల్లోని అసంతృప్తిని చల్లార్చేందుకు, హస్తం వైపు జనాల గాలి మళ్లకుండా చూసేందుకు బీసీ, మహిళా పథకాలను ముందుకు తెస్తున్నారని సమాచారం. ఇందులో భాగంగా ఈ రెండు సెక్షన్లలోని లబ్దిదారులకు రూ.10 లక్షల మేర ఆర్థిక సాయం ప్రకటించే అవకాశముంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం... ఇప్పుడు కొనసాగుతున్న 'బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి రాబోయే స్కీము అదనంగా ఉండబోతున్నది. మరోవైపు రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలు మినహా మహిళల ఆర్థిక స్వావలంబనకు సంబంధించిన పథకాలేవీ లేవని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. అందువల్ల వారిని ఆర్థికంగా పైకి తీసుకు రావాటానికి మరో పథకాన్ని సీఎం ప్రకటించనున్నారు. ఇలాంటి అంశాలన్నింటినీ క్రోడీకరించి బీఆర్ఎస్ తన ఎన్నికల ప్రణాళికను రూపొందించనుంది.

వీటితోపాటు నిరుద్యోగులకు కూడా ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కేసీఆర్ యోచిస్తున్నారు. 2018 ముందస్తు ఎన్నికల సమయంలో గులాబీ పార్టీ 'నిరుద్యోగ భృతి'ని ప్రకటించింది. ఆ అంశాన్ని మ్యానిఫెస్టోలో కూడా చేర్చారు. కానీ ఆ తర్వాత అధికార పార్టీ ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. ఇప్పుడు మళ్లీ నిరుద్యోగులు దూరం కాకుండా ఉండేందుకు వారి కోసం ఓ కొత్త స్కీమును ప్రకటించనున్నారని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... 'మా అమ్ముల పొదిలో అనేక అస్త్రాలున్నాయి.. వాటిని ఒక్కోటిగా విడుదల చేస్తాం...అప్పుడు ప్రతిపక్షాలకు దిమ్మ తిరగటం ఖాయం...' అంటూ వివిధ వేదికల మీద వ్యాఖ్యానించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కారు పార్టీ ప్రవేశపెట్టబోయే బీసీ, మహిళా పథకాలు, నిరుద్యోగులకు వరాలనేవి ఎప్పుడు, ఏ రూపంలో బయటకు వస్తాయనేది వేచి చూడాలి. అక్టోబరులో వరంగల్‌లో భారీ బహిరంగ సభకు ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో అక్కడ ఈ పథకాలను ప్రకటిస్తారా..? లేదంటే వేరే సందర్భంలో వెల్లడిస్తారా..? అనేది ఇప్పుడప్పుడే చెప్పలేమని ఓ సీనియర్ నేత ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.



ఆదిభట్ల సమీపంలోని రెస్టారెంట్‌లో షార్ట్ సర్క్యూట్

- దగ్ధమైన ఏసీలు, ఫర్నిచర్స్, విద్యుత్ పరికరాలు
- సుమారు రూ.20 లక్షల మేర నష్టం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి/ఆదిభట్ల

ఆదిభట్ల సమీపంలోని ద ఫుడ్ ట్రెన్ రెస్టారెంట్‌లో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకోవడంతో ఏసీలు, ఫర్నిచర్స్, విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు నిర్వాహకులు వాసుదేవన్, అఖిల్ తెలిపారు. పోలీసులు, నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల టీసీఎస్ సమీపంలో ఉన్న దా ఫుడ్ ట్రెన్ రెస్టారెంట్ లోపలి నుంచి ఉదయం 7 గంటల సమయంలో తీవ్రమైన పొగ బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు రెస్టారెంట్ యజమాని అఖిల్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దాంతో తన రెస్టారెంట్‌లో పని చేసే సిబ్బందిని అతను అప్రమత్తం చేశారు.

తాను వెంటనే రెస్టారెంట్‌కు చేరుకున్నారు. రెస్టారెంట్ తలుపులు తీసి చూడగా కౌంటర్ మంటలతో తగలబడుతోంది. రెస్టారెంట్ పూర్తిగా పొగతో నిండిపోవడంతో వారు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో వెంటనే ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం పరిశీలించగా.. రెస్టారెంట్ కౌంటర్ వద్ద ఉన్న ఫర్నిచర్, రెస్టారెంట్‌కు సంబంధించిన పత్రాలు, ఐదు ఏసీలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే కిచెన్‌కు మంటలు వ్యాపించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక పోలీసులు వివరాలు సేకరించారు. ఏసీల షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

1 నుంచి 10 వరకు నిరసన కార్యక్రమాలు

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడ్తామని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు జీవించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితంగా తెలంగాణ రాజ్యాన్ని దేశంలో విలీనం చేశారని, అందులో హిందువులు ముస్లింలు ప్రాణం కోల్పోయారని గుర్తు చేశారు.

దీనిని కొన్ని మతతత్వ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డా.మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పాల్వాయి రాంరెడ్డి, చిరుమళ్ల భిక్షం, రామారావు పాల్గొన్నారు.



ప్రజా సంస్కృతిపై మతోన్మాద దాడిని ఖండించండి

- పీఎన్ఎం సీనియర్ నాయకులు కె.శాంతారావు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ప్రజా సంస్కృతిపై మతోన్మాదం దాడులను నిలువరించాలని పీఎన్ఎం సీనియర్ నాయకులు కె.శాంతారావు అన్నారు. ప్రజానాట్యమండలి నాలుగు రోజుల శిక్షణా తరగతులు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రాకేష్ మాస్టర్ నిలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కె.శాంతారావు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై హత్యలు, లైంగికదాడులు పెరిగిపోతూ, మానవ సంబంధాలు నశించిపోయాయన్నారు. దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సంబంధాలు పూర్తిగా ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయన్నారు. పాలకులు పేద, దళిత మహిళలపై దాడులను ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తూ.. చట్టాలను తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ ప్రజా కళాకారులు ప్రత్యమ్నాయ ప్రజాసంస్కృతిని నిర్మించాలని పిలుపునిచ్చారు. పీడిత ప్రజలు సంఘటితమైన ప్రజాస్వామిక హక్కుల కోసం కళారూపాల ద్వారా పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, నాయకులు వేల్పుల వెంకన్న, వినోద్ కుమార్, గడ్డం గణేష్ , దుర్గయ్య లక్ష్మనారాయణ, అంజమ్మ హరిత తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం అవకాశం కల్పిస్తే బరిలో ఉంటా

మిర్యాలగూడలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం..: టీపీసీసీ కార్యదర్శి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న తనకు ఈసారి టికెట్ ఇచ్చి అవకాశం కల్పిస్తే బరిలో ఉంటానని టీపీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2009 నుంచి తాను ప్రజలతో మమేకమై ఉన్నానని, ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన తాను ఎమ్మెల్యే బరిలో నిలిచి 36 వేల ఓట్లు సాధించానన్నారు. ఆపై తెలంగాణ సాధనలో అవిశ్రాంత పోరాటం చేశానన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచానని తెలిపారు. ఆ పైన జరిగిన రాజకీయ మార్పుల్లో భాగంగా కాంగ్రెస్‌లో చేరి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని చెప్పారు. 2018లో టికెట్ ఆశించినప్పటికీ, అధిష్టానం బీసీ సంఘం జాతీయ నాయకుడు ఆర్.కృష్ణయ్యకు కేటాయించిందన్నారు. అయినా తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసి అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అధిష్టానం తనకు మిర్యాలగూడ టికెట్ కేటాయించాలని కోరారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉండటం సహజమేనన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం అందరం కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి చెందిందంటూ అధికార పార్టీ నాయకుడు గొప్పలు చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గాయం ఉపేందర్‌రెడ్డి, తమ్మన్న, డి.బాలాజీనాయక్, పెదమం వీరస్వామి, తలకోల వెంకటరెడ్డి, తలకొప్పుల సైదులు, కంచుగట్ల లింగయ్యయాదవ్, దండ ప్రభాకర్‌రెడ్డి, గజ్జల నర్సిరెడ్డి, షేక్ బిక్కన్, కస్తూరి భాస్కర్, ముజాహిద్, జావీద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



డెంగ్యూతో స్టాఫ్ నర్స్ మృతి

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



ములుగు జిల్లా ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలలో ఎంసీహెచ్ స్టాఫ్ నర్సు సాధనపెల్లి రజని డెంగ్యూ జ్వరంతో బాధ పడుతూ సోమవారం మృతి చెందారు. వాజేడు మండలానికి చెందిన రజని ఏటూర్‌నాగారం సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తోంది. మూడు రోజులుగా డెంగ్యూ పాజిటివ్‌తో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రజని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు తరలిస్తుండగా.. తాడ్వాయి-ములుగు మార్గమధ్యలో ఆమె మృతిచెందారు. రజని వాజేడులోని కొప్పూరులో భర్త, పిల్లతో కలిసి ఉంటూ సామాజిక ఆస్పత్రికి విధులపై వస్తుంటుంది. ఈ క్రమంలో అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన చికిత్స అందించే క్రమంలో మృతిచెందిందని భర్త తాజ్ తెలిపారు. స్టాఫ్ నర్స్ రజని మృతితో ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, వైద్యులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

ఎయిర్‌పోర్టులో 785 గ్రాముల బంగారం పట్టివేత

- దీని విలువ రూ.47.49 లక్షలు

నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అక్రమంగా తరలించిన బంగారాన్ని హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జేడ్డా నుంచి ఒక ప్రయాణికుడు తెల్లవారుజామున హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నాడు. అతనిపై అనుమానం రావడంతో అతనితోపాటు లగేజ్‌ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా తరిస్తున్న 785 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.47.49 లక్షలు ఉంటుందని అంచనా. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికురాలు మృతి

- రోడ్డు పక్కనచెత్త ఊడ్చుతుండగా ఘటన..



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రోడ్డు పక్కన చెత్త ఊడుస్తున్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలిని వేగంగా దూసుకొచ్చిన ఓ ప్రయివేటు కళాశాల బస్సు ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన హైదరాబాద్ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిందిజ నారాయణగూడ సీఐ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన తిప్పారపు సునీత(41) 10 ఏండ్ల నుంచి జీహెచ్ఎంసీ, ఎస్ఎఫ్ఏ అర్జున్ టీంలో (21 మంది టీం) అవుట్ సోర్సింగ్ విభాగంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. సోమవారం రాంకోఠి ప్రాంతంలో సునీత ఉదయం రోడ్డుపై చెత్త ఊడుస్తుండగా దుండిగల్ ప్రాంతానికి చెందిన అయాన్ ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్స్ కళాశాల బస్సు అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దాంతో బస్సు, అక్కడే ఉన్న చెట్టుకు మధ్యలో ఆమె నలిగిపోయి విలవిల్లాడి అక్కడికక్కడే ప్రాణం విడిచింది. స్థానికుల సమాచారం మేరకు నారాయణగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్ ఎండి.మహమ్మద్ మోమిన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

బస్సును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. సునీత మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మిగతా సమాచారం కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు ఈ కేసును బదిలీ చేసినట్టు నారాయణగూడ సీఐ తెలిపారు. కాగా.. సునీతకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె భర్త వికలాంగుడు అవడంతో ఇంటి బాధ్యతలు ఆమెనే మోసేది. నెలకు రూ.14 వేల వేతనంతో జీవనం కొనసాగించేది. సునీత తల్లి చంద్రకళ పారిశుధ్య కార్మికురాలుగా రిటైర్మెంట్ కావడంతో తల్లి ఉద్యోగం ఆమెకు వచ్చింది. ఇప్పుడు ఆ కుటుంబం ఉన్న ఒక్క ఆధారమైన పెద్దదిక్కును కోల్పోయింది.

పశు మిత్రలకు ఏఐ ట్రైనింగ్ ఇవ్వాలి

డైరెక్టర్ కు వినతిపత్రం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పశు మిత్రలకు ఏఐ ట్రెనింగ్ ఇవ్వాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శారద, కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ శాఖలో గత ఎనిమిదేండ్లుగా పనిచేస్తున్న పశు మిత్రులకు ఏఐ ట్రెనింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్ఎండి, ట్యాగ్ డబ్బులు నేరుగా వారి అకౌంట్లకే వచ్చేలా చూడాలని కోరారు. యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. యాప్ ద్వారా ఎఫ్ఎండి, ట్యాగ్ డబ్బులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేతన సమస్య ప్రభుత్వం చేతిలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పశుమిత్ర వర్కర్స్ యూనియన్ సభ్యులు కొంగరి మంగ, నజియా, కొత్త రజిని, అనూష, మండ్ల చైతన్య, సమ్రీన్, రవళిక, ఝాన్సీ, మనిషా, పూజ, లావణ్య, సునీత పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన అరీబ్ షాహెజాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్ధిపేటకు చెందిన అరీబ్ షాహెజాన్ తన కుమారుడు మహమ్మద్ ఇఫ్తేకార్‌తో కలిసి సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారికి పార్టీ కండువా కప్పి కష్టపడి పార్టీ కోసం పని చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మహమ్మద్ ఇఫ్తేకార్ కేసీఆర్‌తో సన్నిహితంగా ఉంటారన్న సంగతి తెలిసిందే. రానున్న రోజుల్లో తన కుమారునికి మంచి పదవీ బాధ్యత ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది. ఈ సందర్భంగా ఆయన సీఎం కేసీఆర్‌కు రక్షాబంధన్, ఉపాధ్యాయ దినోత్సవం, వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి

సీఎం కేసీఆర్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర శిక్ష ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో నియామకమై 19 ఏండ్లుగా పనిచేస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్లు (ఐఈఆర్పీ)ను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి సోమవారం వినతిపత్రం సమర్పించారు. నూతనంగా మంజూరు చేసిన 1,523 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వాటిని డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే 763 మంది ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వారికి అన్ని అర్హతలూ ఉన్నాయని వివరించారు. రాతపరీక్ష ఆధారంగా మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఎంపిక చేశారని తెలిపారు. మానవతా దృక్పథంతో వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులాలు..

- వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించాలి : పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి
- పెరటి కోళ్ల పంపిణీ



నవతెలంగాణ-షాబాద్

వెనుకబడిన షెడ్యూల్ కులాల వారు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని రేగడి దోస్వాడ గ్రామంలో ఎస్సీలకు వంద యూనిట్ల పెరటి కోళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులాల వారు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. అందులోనే భాగంగా ఎస్సీలకు పెరటి కోళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్టు చెప్పారు. రేగడి దోస్వాడ గ్రామాన్ని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్శిటీ దత్తత తీసుకుంటుందని తెలిపారు.

ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సహాయ, సహకారాలు అయినా ఇక్కడ అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. పెరటి కోళ్ల పెంపకంతో పాటు మేకలను ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, వీటిలో సైతం ఎస్సీలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రఘునందన్, అసోసియేట్ అధ్యాపకులు డాక్టర్ ఉదయ్ కుమార్, జంతు ప్రొఫెసర్ డాక్టర్ నర్సింహ, వెటర్నరీ కాలేజ్ న్యూట్రిషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు గోపాలకృష్ణ, డాక్టర్ సత్యనారాయణ రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ యానిమల్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కు మార్, రేగడి పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది శ్రీను, సాగర్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

'జీ-20' ఎవరికోసం?

సెప్టెంబర్ మొదటి వారంలో రాజధాని ఢిల్లీలో జరిగే జీ-20 దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో ప్రపంచ వ్యాప్త ప్రజల ఈతిబాధలపై చర్చించాలన్న పౌర సంస్థల 'విరు-20' పీపుల్స్ సమ్మిట్ డిమాండ్ సహేతుకమైనది. కేవలం మార్కెట్ శక్తుల ప్రయోజనాల కోసమే జీ-20 భేటీ అయితే నిష్ప్రయోజనమన్న 'విరు-20' అభిప్రాయం సమర్థనీయమైనది. మోడీ నేతృత్వంలోని రాజ్యం కల్పించిన పలు అవాంతరాలు, నిరంకుశ చర్యల మధ్య 'జీ-20' నెత్తికెత్తుకున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయాలపై చర్చించేందుకు దేశంలోని పలు పౌర, ప్రజాతంత్ర సంస్థలు, మేధావులు మూడు రోజుల పాటు ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో 'విరు-20' పేరిట సమావేశమయ్యారు. చివరిరోజు ఆదివారం డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఎక్కడోఅక్కడ జీ-20 దేశాల అధినేతలు కూర్చొని చర్చిస్తున్నదంతా ధనిక దేశాల మార్కెట్, ఆర్థిక వ్యవస్థల రాజకీయ ప్రయోజనాల ప్రాతిపదికనే. ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, ఎడిబి, డబ్ల్యుటిఓ ప్రతిపాదిస్తున్న ఆర్థిక విధానాలను ముందుకు తీసుకుపోవడమే లక్ష్యంగా చర్చలు, నిర్ణయాలు జరుగు తున్నాయి. ప్రజలను విస్మరిస్తున్నాయి. జీ-20 దేశాధినేతలు తమ గొంతు వినాలన్నదే ప్రజల కోరిక. వారి ఆకాంక్షను 'విరు-20' సెమినార్ ప్రపంచం ముందుంచింది.

> ప్రస్తుతం దేశం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. అసమానతలు పెరుగుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం, పారిశ్రామిక మందగమనం, అధిక ధరలూ రాజ్యమేలుతున్నాయి. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, రైతులు, కార్మికులు, మహిళలపై దాడులు, మతఘర్షణలు, ప్రజాతంత్ర, పౌరహక్కుల హననానికి అడ్డు అదుపు లేదు. పార్టీలకతీతంగా, మేధావులు, పౌరసంస్థలు ఏర్పాటు చేసుకున్న ఇండోర్ మీటింగ్ 'విరు-20' సమ్మిట్. జరగనీకుండా పోలీసులతో అడ్డుకోవడాన్ని బట్టి మోడీ ప్రభుత్వంలో అసమ్మతిపై అసహనం స్థాయిని, నిరంకుశాన్ని, అణచివేత ధోరణిని, ప్రజాస్వామ్య హననాన్ని తెలుపుతుంది.



ప్రజల ఎజెండా లేకుండా జీ-20 సదస్సులో చర్చించడమే పెద్ద దగా. పెట్టుబడిదారీ విధానమొక్కటే విశ్వమానవాళికి ఏకైక మార్గమన్న సూత్రాన్ని ఆ విధానంలో తరచు సంభవిస్తున్న సంక్షోభాలు పటాపంచలు చేస్తున్నాయి. 2008 నాటి ఆర్థిక మాంద్యం అప్పటికి తాత్కాలికంగా సమసిపోయిందనిపించినా ఆ ఛాయలు తొలగిపోలేదు సరికదా మరింత విస్తరిస్తున్నాయి. కోవిడ్ విలయంతో పరిస్థితులు తిరోగమనంలో పడ్డాయి. ప్రజల్లో ఆర్థిక, సామాజిక అసమానతలు మరింతగా పురివిప్పాయి. వ్యవసాయం, ఆహారం, జీవనోపాధి, వాతావరణ సమతుల్యత, పర్యావరణం, మానవ హక్కుల ఉల్లంఘనలు సంభవిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి హాని కలుగుతోంది. ఈ సమస్యలను, సంక్షోభాలను పరిష్కరించడంలో దేశాల ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రజా ఉద్యమాలు, పౌర సమాజ సంస్థలు, మానవ హక్కుల కార్యకర్తలు, అన్ని రకాల ప్రగతిశీల శక్తుల మధ్య పూర్తిస్థాయి ఐక్యత, సంఘీభావం సాధించినప్పుడే ప్రభుత్వాలు దిగొస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజానీకానికి సమ్మిళిత, పారదర్శక న్యాయంతో కూడిన సమానత్వ సాధన లక్ష్యాన్ని విరు-20 తన డిక్లరేషన్‌లో ఆవిష్కరించింది.

జీ-20 సదస్సుకు అధ్యక్షత వహించే భాగ్యం మన దేశానికి దక్కింది ప్రధాని మోడీని చూసేనని బీజేపీ మంత్రులు, ఇతర నాయకులు ఊరూవాడా టముకు వేసుకుంటున్నారు. నిజానికి జీ-20లోని అన్ని దేశాలకు మల్లే భారత్‌కూ అధ్యక్షత అవకాశం వచ్చింది తప్పితే ప్రత్యేకతేమీ లేదు. ప్రస్తుతం దేశం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. అసమానతలు పెరుగుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం, పారిశ్రామిక మందగమనం, అధిక ధరలూ రాజ్యమేలుతున్నాయి. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, రైతులు, కార్మికులు, మహిళలపై దాడులు, మతఘర్షణలు, ప్రజాతంత్ర, పౌరహక్కుల హననానికి అడ్డు అదుపు లేదు. పార్టీలకతీతంగా, మేధావులు, పౌరసంస్థలు ఏర్పాటు చేసుకున్న ఇండోర్ మీటింగ్ 'విరు-20' సమ్మిట్. జరగనీకుండా పోలీసులతో అడ్డుకోవడాన్ని బట్టి మోడీ ప్రభుత్వంలో అసమ్మతిపై అసహనం స్థాయిని, నిరంకుశాన్ని, అణచివేత ధోరణిని, ప్రజాస్వామ్య హననాన్ని తెలుపుతుంది. జీ-20 కోసం ఢిల్లీలో, ఏపీలోని విశాఖపట్నంలో పేదలను ఏ విధంగా దూరంగా తరిమేశారో, ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేశారో చూశాం. ఈ సదస్సు మణిపూర్‌లో జరిపితే మోడీ ప్రభుత్వ అసలు రంగు ప్రపంచానికి తెలిసొచ్చేది. జీ-20 అడ్వర్టయిజ్‌మెంట్ల కోసం మోడీ సర్కారు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోంది. మోడీ ప్రభుత్వమైనా, ఇతర జీ-20 దేశాధినేతలైనా ప్రజలు ఏం కోరుకుంటున్నారో, వారికేం కావాలో చర్చించి చర్యలు తీసుకున్నప్పుడే జనానికి ప్రయోజనం, లేదంటే ప్రజలకు ఒనగూరేదేమీ ఉండదు.



యూనివర్సిటీల విధ్వంసం

బీజేపీ పాలనకు ప్రజానీకం ముగింపు పలికిన అనంతరం భారతీయ సమాజానికి, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు అది కలిగించిన నష్టాన్ని పూడ్చుకునే పని జరుగుతుంది. అయితే రెండు అంశాలలో అది చేస్తున్న విధ్వంసాన్ని పూడ్చడం చాలా కష్టమవుతుంది. మొదటిది: బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్న పురాతన, చారిత్రిక కట్టడాలను తిరిగి నిర్మించుకోవడం. ఈ విధ్వంసం బాబ్రీ మసీద్ కూల్చివేతతో మొదలైంది, కేవలం రెండు మతాల ప్రజల నడుమ విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టించడం ఒక్కటే కాదది. 400 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉన్న ఆ పురాతన కట్టడాన్ని ఏమాత్రం నాగరికత ఉన్న వారైనా ఆ విధమైన వినాశనానికి పూనుకోరు. కనీసం ప్రజల పట్ల ఏ పాటి గౌరవ మర్యాదలున్నా ఆ విధమైన వినాశనానికి సిద్ధపడరు. ఈ విధ్వంస ధోరణి ఆ తర్వాత కూడా కొనసాగుతోంది. పార్లమెంటు భవనానికి పక్కనే మరొక నిర్మాణాన్ని ఈ ప్రభుత్వం చేపట్టింది. ఎంతో శ్రద్ధతో రూపొందించిన పాత లే-ఔట్‌కు లోబడి వ్యవహరించాలన్న కనీసమైన బాధ్యతకూ డా ఈ ప్రభుత్వానికి లేదు (ఆ లే-ఔట్‌ను పాత వలస పాలకులు రూపొందించారని, దానిని ఖాతరు చేయనవసరం లేదని చెప్పడం ఎంతమాత్రమూ సమర్థనీయం కాదు.)

> దేశంలో పేదరికం అంతకు ముందుకాలంలో కన్నా బీజేపీ పాలనా కాలంలో పెరిగిందంటూ ఎవరైనా ఒక పరిశోధనాపత్రం సమర్పిస్తే దానిని రాసిన వ్యక్తికీ ఇదే గతి పడుతుందన్నమాట. గణాంకాల ఆధారంగా ఒకానొక పత్రం గనుక వ్యవసాయ సంక్షోభం కొనసాగుతున్న ఫలితంగా గ్రామీణ తలసరి ఆదాయం అంతకు మునుపటి కన్నా బీజేపీ పాలనాకాలంలో తగ్గిపోయిందని నిర్ధారిస్తే, దానిని అధికారులు ఆదేశించిన విధంగా మార్పులు చేయవలసిందే అన్నమాట. ఇటువంటి నేపథ్యంలో పరిశోధన అంటే బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేసుకునే కరత్రాలను రూపొందించడమే అవుతుంది.

ఇక రెండవ అంశం: దేశంలోని యూనివర్సిటీలను బీజేపీ ప్రభుత్వం భారీ ఎత్తున ధ్వంసం చేస్తోంది. వాటి వ్యవస్థలను విధ్వంసం చేశాక కలిగే నష్టాన్ని పూడ్చడం అంత తేలికైన విషయం ఏమీ కాదు. యూనివర్సిటీలు అంటే కొన్ని భవనాల సముదాయం మాత్రమే కాదు. అక్కడ కేవలం పాఠాలను బోధించడం మాత్రమే జరుగుతుంది అనుకోరాదు. ఏ కోచింగ్ సెంటర్‌లోనైనా పాఠాలను బోధించవచ్చు. యూనివర్సిటీ అంటే అక్కడ ఆలోచనకు విలువ ఉండాలి. అలా ఆలోచనకు విలువనిచ్చే శీలవంతమైన వాతావరణాన్ని రూపొందించాలి. అలా చేయడానికి కొంత సమయం పడుతుంది. మూడవ ప్రపంచ దేశాలలో ఆ విధమైన వాతావరణాన్ని సృష్టించడం చాలా కష్టం. అయితే ఆ విధమైన వాతావరణం ఉన్న కొద్ది కేంద్రాలనైనా భారతదేశం రూపొందించుకోగలిగింది. ఇది గొప్ప విషయం. దీనికి దోహదం చేసిన అంశాలలో మన దేశం పెద్దదిగా ఉండడం ఒక కారణం. మన ఇరుగు పొరుగు దేశాల యూనివర్సిటీలలోని మేధావులు తమ తమ దేశాలలో విద్యావిషయికంగా ఒక సక్రమమైన వాతావరణాన్ని నిర్మించుకునేందుకు తగిన వనరులు లేవని వాపోతూంటారు. అదొక్కటే కాదు. మన భారతీయ సమాజంలో లోతైన, గంభీరమైన ఆలోచనల పట్ల అందరికీ గౌరవం ఉంది. ఆ విధమైన ఆలోచనలతో వారు ఏకీభవించకపోయినా, వాటిని గౌరవించే సాంప్రదాయం ఉంది.

ఫాసిస్టు స్వభావంతో ఉండే సంస్థలకు స్వయంగా అటువంటి గంభీరమైన ఆలోచనలు అంటూ ఏమీ ఉండవు. అంతేగాదు, అటువంటి ఆలోచనల పట్ల వాటికి ఏమాత్రమూ గౌరవం ఉండదు కూడా. దేశంలో ఉన్న కొద్దిపాటి గంభీరమైన మేధో కేంద్రాలను అన్నింటినీ ఎలాగైనా నాశనం చేయడానికి ఒక పద్ధతి ప్రకారం మొండిగా సాగుతోంది. యూనివర్సిటీలపై బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దాడి వలన దేశానికి ఎనలేని నష్టం కలుగుతుంది.

మొదట్లో ప్రభుత్వ యూనివర్సిటీలతో మొదలైన ఈ దాడి ఇప్పుడు ప్రయివేటు యూనివర్సిటీలకు సైతం పాకింది. ప్రపంచంలోని అత్యుత్తమ డిగ్రీ కోర్సులను బోధించే ఢిల్లీ యూనివర్సిటీ, సామాజిక శాస్త్రాలలో తమ వద్ద జరిగే చర్చలతో సామ్రాజ్యవాద దేశాలకు విద్యా రంగంలో గల ఆధిపత్యాన్ని సవాలు చేయగలిగిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, రవీంద్రనాథ్ టాగోర్ దృక్పథంతో రూపొందిన విశ్వభారతి యూనివర్సిటీ- ఇవన్నీ ఇప్పుడు తమ గత వైభవాన్ని కోల్పోయి శిథిలాలుగా మిగిలాయి. ఆర్‌ఎస్‌ఎస్‌కు సంపూర్ణ విధేయతను కలిగివుండడమే ప్రధాన అర్హతగా ఉన్న వ్యక్తులను వీటికి ఉప కులపతులుగా నియమించింది బీజేపీ ప్రభుత్వం. యూనివర్సిటీలను తమ "స్వాధీనంలోకి" తెచ్చుకునే లక్ష్యంతో తగిన విద్యార్హతలుగాని ప్రమాణాలుగాని లేనివారిని బోధనా సిబ్బందిగా అడ్డగోలు నియామకాల ద్వారా నింపివేసింది. విద్యార్థులను కూడా ఆ విధమైన కొలబద్దల ఆధారంగానే తీసుకుంది. యూనివర్సిటీలలో ఉండే వివిధ అకడమిక్ సంస్థలను, తనకు లొంగివుండే వారితో నింపివేసింది. డీన్‌లుగా, ఛైర్‌పర్సన్‌లుగా ఉండే తన బంటుల పదవీకాల పరిమితులు అయిపోయినా, వారినే కొనసాగిస్తోంది. ఈ చర్యలతో యూనిర్సిటీలలో ఉండే చైతన్యశీలమైన ప్రజాస్వామిక వాతావరణం, విలువలు నాశనమయ్యాయి. తనకు అనుయాయులుగా వ్యవహరించే గూండాలను దింపి తమను వ్యతిరేకించేవారిని భయభ్రాంతులకు గురిచేసింది. అంతేకాదు. ఒకప్పుడు ఉన్నత విద్యా, బోధనా ప్రమాణాలకు పేరుపొందిన ఈ ప్రతిష్టాత్మక విద్యాకేంద్రాలలోని విద్యా ప్రమాణాలను కూడా నీరుగార్చింది. ఇవన్నీ చాలవన్నట్టు ఈ యూనివర్సిటీలకు నిధుల కొరతను కూడా కలిగించింది.

ఇప్పుడు ఈ తరహా దాడి ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు కూడా వ్యాపించింది. ప్రభుత్వరంగ యూనివర్సిటీలు బలహీనపడుతున్న కాలంలో ఈ ప్రయివేటు యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. అశోకా యూనివర్సిటీలో జరిగింది చూస్తే అటువంటిది ఇంకెక్కడా జరిగివుండదని అనిపిస్తుంది. ఆ యూనివర్సిటీలోని ఒక అధ్యాపకుడు ఒక అకడమిక్ పేపర్‌ను రూపొందించాడు. సేకరించిన గణాంకాలను చాలా శ్రద్ధగా విశ్లేషించి, దాని ఆధారంగా రూపొందించిన పత్రం అది. 2019 పార్లమెంట్ ఎన్నికలలో కొన్ని నియోజకవర్గాలలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసినట్టు ఆ పత్రం నిర్ధారించింది. ఈ మాదిరి పరిశోధనా పత్రాలు యూనివర్సిటీలలోనే తయారు కావాలి. కాని బీజేపీకి చెందిన సోషల్ మీడియా మూకలు ఆ అధ్యాపకుడిపై ఒక్కపెట్టున విరుచుకుపడ్డాయి. అదే సమయంలో ఆ యూనివర్సిటీ యాజమాన్యం ఆ పరిశోధనా పత్రంతో తనకేమీ సంబంధం లేదంటూ ప్రకటించింది. యూనివర్సిటీకి విరాళాలు ఇచ్చే వారితో ప్రధానంగా ఏర్పడిన యూనివర్సిటీ గవర్నింగ్ బాడీ ఈ విద్యాపరమైన పరిశోధనా పత్రాన్ని చర్చించి దానిలో కొన్ని మార్పులను కూడా సూచించింది. నిజానికి గవర్నింగ్ బాడీ పని కాదది. ఈ పరిణామాల అనంతరం ఆ అధ్యాపకుడు తన రాజీనామాను సమర్పించాడు. అయితే యూనివర్సిటీ ఈ విషయంలో వ్యవహరించిన తీరు పట్ల అతను పని చేసిన విభాగం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతేగాక, అతడిని తిరిగి విధులలోకి తీసుకోకపోతే నిరసనలకు దిగవలసి వస్తుందంటూ హెచ్చరించింది.

> పరిశోధనలకు పడే కళ్లెం సామాజిక శాస్త్రాల దగ్గరే ఆగిపోతుందని అనుకోకూడదు. త్వరలోనే ప్రకృతి శాస్త్రాలలోని పరిశోధనలకూ ఇదే గతి పడుతుంది. హిందుత్వ శక్తులు ప్రచారం చేసే మూఢనమ్మకాలను ఈ రంగాలలో జరిగే శాస్త్ర పరిశోధనలు ప్రశ్నిస్తాయి. అప్పుడు హిందుత్వ శక్తులు జోక్యం చేసుకుని ఆ పరిశోధనలను తిరగరాయాలని ఒత్తిడులు తెస్తాయి. అప్పుడు యూనివర్సిటీల హేతుబద్ధతే అదృశ్యం అయిపోతుంది. ఇక ఆ యూనివర్సిటీలు కోచింగ్ సెంటర్ల స్థాయికి దిగజారుతాయి.


ప్రభాత్ పట్నాయక్

ప్రయివేటు యూనివర్సిటీల గవర్నింగ్ బాడీ అంటే దానిలో కొంతమంది వ్యాపారవేత్తలు దాతల పేరుతో ఉంటారు. అటువంటి గుంపు ఒక అకడెమిక్ పేపర్ మీద తీర్పు చెప్పడానికి తయారవడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ విషయం అశోకా యూనివర్సిటీ అధికారులకు గాని, ఆ గవర్నింగ్ బాడీ సభ్యులకు గాని తెలియనిదేమీ కాదు. కాని వాళ్ళకి బీజేపీ ప్రభుత్వం అంటే ఉన్న భయం వల్ల వారంతా ఆవిధంగా ప్రవర్తించారు. తనపై ఏ విమర్శ చేసినా అలా చేసినవారిపట్ల శత్రుపూరితంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. అది కేవలం ఒక విద్యా విషయిక పత్రం రూపంలో వచ్చినా సరే దానిని సహించదు. ఆ సంగతినే ఆ యూనివర్సిటీ అధికారుల ద్వారా, గవర్నింగ్ బాడీ ద్వారా యూనివర్సిటీ మొత్తానికి తెలియజెప్పింది బీజేపీ.

ఒక యూనివర్సిటీగా తనను పరిగణించాలనుకునే ఏ సంస్థా ఇటువంటి పరిస్థితులను సహించదు. దేశంలో పేదరికం అంతకు ముందుకాలంలో కన్నా బీజేపీ పాలనా కాలంలో పెరిగిందంటూ ఎవరైనా ఒక పరిశోధనాపత్రం సమర్పిస్తే దానిని రాసిన వ్యక్తికీ ఇదే గతి పడుతుందన్నమాట. గణాంకాల ఆధారంగా ఒకానొక పత్రం గనుక వ్యవసాయ సంక్షోభం కొనసాగుతున్న ఫలితంగా గ్రామీణ తలసరి ఆదాయం అంతకు మునుపటి కన్నా బీజేపీ పాలనాకాలంలో తగ్గిపోయిందని నిర్ధారిస్తే, దానిని అధికారులు ఆదేశించిన విధంగా మార్పులు చేయవలసిందే అన్నమాట. ఇటువంటి నేపథ్యంలో పరిశోధన అంటే బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేసుకునే కరత్రాలను రూపొందించడమే అవుతుంది. యూనివర్సిటీలలో బోధన అనేది ఎప్పటికప్పుడు అక్కడ జరిగే పరిశోధనల ప్రాతిపదికన తన ప్రమాణాలను పెంచుకుంటూ పోతుంది. మరి ఆ పరిశోధనే నిలిచిపోతే బోధన కూడా దారీ తెన్నూ లేకుండా అయిపోతుంది. అంటే ఆ యూనివర్సిటీ చచ్చిపోయినట్టే లెక్క.

ఈ నిర్ధారణ మరీ అతిగా ఉందని కొందరు అనుకోవచ్చు. ప్రతీ ప్రయివేటు యూనివర్సిటీలోనూ అధికారులు, విరాళాలిచ్చే దాతలు ఆ యూనివర్సిటీ విద్యా వాతావరణం మీద చాలా బలమైన ప్రభావాన్ని చూపించడం సహజమేనని వారు చెప్పవచ్చు. ఉత్తర అమెరికా ఖండంలోని యూనివర్సిటీలలో వాళ్ళు అటువంటి బలమైన ప్రభావాన్ని చూపించడం, అక్కడ నియామకాలను నియంత్రించడం పరిపాటి. పాతరోజుల్లో ఉత్తర అమెరికా యూనివర్సిటీలు విద్యావేత్తలైన యూదులపట్ల ప్రతికూల వైఖరిని, వివక్షతను పాటించారు. ఇప్పటికాలంలో పాలస్తీనా పోరాటం పట్ల సానుభూతి ప్రదర్శించేవారి పట్ల అటువంటి వైఖరినే అవలంబిస్తున్నారు. ఇక మార్క్సిస్టుల పట్ల ఆ యూనివర్సిటీలు ప్రదర్శించే వివక్షత సంగతి చెప్పనక్కరలేదు. పాల్ ఎం స్వీజీ (ప్రముఖ మార్క్సిస్టు రాజకీయ, ఆర్థికవేత్త) గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరించమని కోరుతూ చాలా యూనివర్సిటీల నుండి వచ్చే ఆహ్వానాలను తిరస్కరించవలసి వచ్చింది. ఆయా యూనివర్సిటీలలో బోధన నిమిత్తం తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన మార్క్సిస్టు పరిశోధకులను తొలగించేందుకు అతని పర్యటనలను ఒక సందర్భంగా ఆ యూనివర్సిటీల యాజమాన్యాలు ఉపయోగించుకోవడమే అతను ఆహ్వానాలను తిరస్కరించడానికి కారణం.

అయితే, విదేశీ ప్రయివేటు యూనివర్సిటీలలో అధికారులుగాని, విరాళాలిచ్చే పారిశ్రామికవేత్తలు గాని ప్రదర్శించే వివక్షత, కక్ష సాధింపులకు, ఇక్కడ ప్రస్తుతం భారతదేశంలో యూనివర్సిటీలలో సాగుతున్నదానికి రెండ మౌలికమైన తేడాలు ఉన్నాయి. మొదటిది: అక్కడ జరిగే అణచివేతల వెనుక ప్రభుత్వం జోక్యం కనిపించదు. అక్కడ దాతలకుండే పక్షపాత ధోరణి కాని, వారు పాలక ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరి తీసుకోవడం కాని వారి చర్యలకు దోహదం చేసివుండవచ్చు. కాని ప్రత్యక్ష రాజకీయ జోక్యం, బ్లాక్ మెయిలింగ్ వంటివి ఉండవు. ఇక రెండవది: విదేశీ ప్రయివేటు యూనివర్సిటీలలో గవర్నింగ్ బాడీలు గాని, అధికారులు గాని అక్కడ విద్యా విషయికంగా రూపొందిన పరిశోధనా పత్రాల విషయంలో జోక్యం కలిగించుకోవడం చాలా అరుదు. అన్ని పరిశోధనాపత్రాలనూ ఆ పరిశోధకులకు మార్గదర్శకులుగా వ్యవహరించే ప్రొఫెసర్లు స్వతంత్రంగా, ఎటువంటి ఒత్తిడులూ లేకుండా పరిశీలించి చూస్తారు. ఆ పత్రాలలో ఉండే విషయాన్ని మార్చివేయాలన్న వత్తిడ, జోక్యం బైటనుండి ఉండవు. కాని ఇక్కడ అశోకా యూనివర్సిటీలో జరిగింది మాత్రం చాలా అసాధారణమైన విషయం. ఒక ఫాసిస్టు రాజ్యం విమర్శను ఏమాత్రమూ సహించలేకపోవడం, ఆ విమర్శ పూర్తిగా విద్యావిషయికమైనదైనా, దానిని అణచివేయాలనుకోవడం, ఆ విమర్శలు వెలుగులోకి రాకుండా కప్పిపుచ్చడానికి పూనుకోవడం ఇక్కడ కనిపిస్తోంది.

కాని, అటువంటి ధోరణి ఫలితంగా సామాజిక శాస్త్రాలలో ఏ విధమైన పరిశోధనలూ జరిగేందుకు అవకాశమే లేకుండా పోతుంది. సామాజిక శాస్త్రాలు ప్రధానంగా సమాజంతో, అందులో జరిగే పరిణామాలతో ముడిపడి ఉంటాయి. ఆ పరిణామాలు ప్రధానంగా ప్రభుత్వ నిర్ణయాలతోను, ప్రభుత్వం చేపట్టే చర్యలతోను ముడిపడి ఉంటాయి. వాటన్నింటినీ అధ్యయనం చేయకుండా వాటి ఫలితాలను వాస్తవిక దృష్టితో చూడకుండా, ఒక పరిశోధకుడు తన శోధనను ఏవిధంగా సాగించగలుగుతాడు?

పరిశోధనలకు పడే కళ్లెం సామాజిక శాస్త్రాల దగ్గరే ఆగిపోతుందని అనుకోకూడదు. త్వరలోనే ప్రకృతి శాస్త్రాలలోని పరిశోధనలకూ ఇదే గతి పడుతుంది. హిందుత్వ శక్తులు ప్రచారం చేసే మూఢనమ్మకాలను ఈ రంగాలలో జరిగే శాస్త్ర పరిశోధనలు ప్రశ్నిస్తాయి. అప్పుడు హిందుత్వ శక్తులు జోక్యం చేసుకుని ఆ పరిశోధనలను తిరగరాయాలని ఒత్తిడులు తెస్తాయి. అప్పుడు యూనివర్సిటీల హేతుబద్ధతే అదృశ్యం అయిపోతుంది. ఇక ఆ యూనివర్సిటీలు కోచింగ్ సెంటర్ల స్థాయికి దిగజారుతాయి. మోడీ ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ గురించి గొప్పలు చెప్పుకుంటూ ఉంటుంది. ఆత్మనిర్భరత అంటే స్వావలంబన అని అర్థం. ఒక దేశంలోని యూనివర్సిటీలను ధ్వంసం చేసిన తర్వాత ఇక ఆ దేశం ఆత్మనిర్భరత ఏ విధంగా సాధించగలుగుతుంది?

(స్వేచ్ఛానుసరణ)

రిపోర్టర్స్ డైరీ

డిస్‌క్వాలిఫై...

'నీతిగా, నిజాయితీగా కష్టపడి పని చేసేటోడికి ఇప్పుడు విలువ లేదు. ఒంటికి మట్టిఅంటకుండా సుఖంగా కూర్చుని... సోషల్ మీడియాలో హల్‌చల్ చేసేవాడివే రోజులు...' టిక్కెట్ మీద గంపెడాశలు పెట్టుకుని, అది రాక పోవటంతో నిర్లిప్తతతో అధికార పార్టీకి చెందిన ఓ లీడరు ఇటీవల అన్న మాటలివి. నిజమే మరి... ఎమ్మెల్యే అంటే మందీ, మార్బలం, పెద్ద పెద్ద కార్లు, అంతకు మించిన హంగామా...వెనుకో పది కార్లు, ముందో పది కార్లు ఉండాల్సిందే. అలా ఉంటేనే... ఆయనకు ఎమ్మెల్యేగా గుర్తింపు దక్కుతున్న రోజులివి. గతంలో ఎలాంటి ఆర్భాటాల్లే కుండా సాదాసీదాగా సచివాలయానికి వచ్చిన సున్నం రాజయ్యను అక్కడి ప్రధాన ద్వారం వద్దే ఆపేసిన ఘటన మనకు ఇంకా గుర్తేఉంది. ఇదే రకంగా తనపని తాను చేసుకుపోతూ... అట్టహాసాలు, ఆర్భాటాలకు దూరంగా ఉన్న తనకు మాత్రం ఎన్నో ఏండ్ల నుంచి అన్యాయం జరుగుతున్న దంటూ వాపోయారు టిక్కెట్ దక్కని ఆ పెద్ద మనిషి. కర్ర ఉన్నోడిదే బర్రెన్నట్టు...డబ్బులు, ఆస్తులు, అంతస్తులు చూసి గానీ పార్టీలో పదవులివ్వటం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని గులాబీ పార్టీలోని కొందరు అగ్రనేతల వద్ద ప్రస్తావిస్తే... 'మీరు మంచోళ్ళు ...మచ్చలేనోళ్లు.. మీ గురించి అంతా మాకు తెలుసు. కానీ ఇప్పుడు మీలాంటి వారు ఎన్నికల్లో రాణించలేరు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు సృష్టించాలి. తిమ్మిని బొమ్మిని చేయాలి. దూకుడుగా వ్యవహరిస్తూ నోటి మాటలతో ఎదుటి పార్టీ వాడి నోర్మూయించాలి. అవన్నీ మీకు చేతగాదు సార్...అందుకే ప్రస్తుత రాజకీయాల్లో మీరు డిస్‌క్వాలిఫై అవుతారు...' అంటూ సర్ది చెప్పారని సదరు నేత నిరుత్సాహంతో కూడిన నిర్వేదాన్ని వ్యక్తం చేశారు. నిజమే మరి...గతంలో ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి రాజకీయాల్లోకి వచ్చేవారు. ఇప్పుడు వ్యాపారవేత్తలు, పరిశ్రమాధిపతులు ఆ రంగంలోకి చొరబడ్డ తర్వాత ఎన్నికలు, ఓట్లు సరుకు మాదిరిగా మారిపోయాయి.అదే అసలు సమస్య.

- బి.వి.యన్.పద్మరాజు

ఆహా..ఎంత చైతన్యం...

మన దేశంలో డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, మేధావులకు కొదవ లేదు. అనేక రంగాల్లో భారతీయులు మన జాతీయజెండాను ప్రపంచ వేదికల మీద రెపరెపలాడించారు. అయితే ఇటీవల దేశభక్తి ఒక్కోసారి వక్రీకరించబడుతూ మనల్ని ఆలోచనలో పడేస్తోంది. ఇండియాలో పుట్టి... ఇక్కడే పెరిగి, ఇక్కడి వనరుల ద్వారా ఉన్నత విద్యనభ్యసించి విదేశాల్లో సెటిలైన వారి మైండ్‌సెట్ కొన్ని సందర్భాల్లో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉండటం విడ్డూరంగా ఉండటం ఆందోళనకరం. ఇటీవల సీఎం కేసీఆర్... జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై కొన్ని కామెంట్లు చేశారు. తమ ప్రభుత్వానికి, పార్టీకి వ్యతిరేకంగా వార్తలు రాసే పత్రికలు, అందులో పని చేస్తున్న పాత్రికేయులకు ఇండ్లను ఇవ్వబోమంటూ ఆయన తేల్చి చెప్పారు. ఆ సందర్భంగా ఓ ఎన్‌ఆర్‌ఐ ఫోన్‌లో మాట్లాడుతూ...'ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులను, వనరులను సదరు ప్రభుత్వాధినేత ఏమైనా చేసుకోవచ్చు. అది ఆయనిష్టం. ఆ కోణంలోనే కేసీఆర్ మాట్లాడి ఉండొచ్చు...' అంటూ కామెంట్ చేశారు. దానికి ప్రతిగా... 'అయితే కేంద్రంలో ప్రధాని మోడీ కూడా ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్నారు. మీరు చెప్పిన కోణంలో అది కూడా కరెక్టేనా...?' అంటే... 'అవును... ప్రధాని కూడా దేశాన్ని ఏమైనా చేసుకోవచ్చు...' అనే రీతిలో మన వీర ఎన్‌ఆర్‌ఐ జవాబిచ్చారు. ఆహా...విదేశీ గడ్డపై డాలర్లకు డాలర్లు సంపాదిస్తూ, విలాసంగా గడుపుతున్నారంటే ఏమో అనుకున్నా... ఇదన్నమాట మీ చైతన్యం.. మీ అవగాహన... అనుకోవటం నా వంతైంది.


-కేఎన్ హరి

'మరణశయ్యపై అమ్మ భాష'

భాష మానవ సంస్కృతి, నాగరికతలకు ప్రతిరూపం. భాష మానవులకు ఉండే ప్రత్యేక లక్షణం. ఇది భావ వాహిక, దీనిని మనం ఆలోచించటానికి, సమస్యలు పరిష్కరించటానికి, ఆడుకోవడానికి, కలలు కనడానికి, వ్యాఖ్యానించ టానికి, ఉద్వేగాల వ్యక్తీకరణకు, సమాచారం పంచుకోవటానికి ఉపయోగించు కుంటాం. పిల్లలందరూ నాలుగేండ్ల వయస్సు నాటికే భాష విషయక పరిణతిపొంది ఉంటారు.పిల్లలు సహజంగా భాషా సామర్థ్యాలతో జనించినప్పటికీ, ఆయా భాషలకు వాటి సామాజిక నేపథ్యంలోనే సంపాదిస్తారు. సమాజం లేకుండా భాషలేదు, సమాజం మారితే భాష కూడా మారుతుంది. ఆంధ్రదేశం అపారమైన సహజ, మానవ వనరులు కలిగిన ప్రాంతం. దాదాపు మూడువేల సంవత్సరాల లిపి, భాష, శాసనాలు, చారిత్రిక, సాంస్కృతిక వికాసం. అందుకే దేశ భాషలందు తెలుగు లెస్స అని మన పండితులు ఆనాడే చెప్పారు. ఇంతటి గొప్ప బాష సంస్కృతి, సాహిత్యం మొత్తంగా తెలుగు సంస్కృతి నేడు మరణశయ్యపై ఉందంటే బాధగా ఉంది. ఈ పరిస్థితి దాపురించటానికి గల కారణాలు చారిత్రక దృక్పథంతో చూడాల్సి ఉంటుంది.


ఎల్. అపర్ణ
9705493054

పూర్వం ఆనాడు గురుకులాశ్రమాలు విలువైన విద్యనందించాయి. నలందా, తక్షశిలా లాంటి విశ్వ విద్యాల యాలు ఆ సమాజానికి అవసరమైన మంచి విద్యను అందించాయి. విదేశీ యాత్రకుడు (హ్యూయన్ త్సాంగ్) కొన్ని సంవత్సరాలు ఇక్కడే ఉండి, విజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. ఎంతోమంది విదేశీ విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించారు. ఆనాటి రాచరిక వ్యవస్థ అన్ని సౌకర్యాలు సమకూర్చింది. మహమ్మదీయుల పాలనలో కూడా కొద్ది మార్పులతో ఇదే విధానం కొనసాగింది. విద్య ఇంత ఉన్నత స్థానంలో ఉండటానికి కారణం మన దేశంలో విద్యను మాతృభాషలో బోధించటమే. బ్రిటిష్‌వారి రాకతో సామ్రాజ్యవాదం అడుగుపడింది. ఇది వలసపాలన, పాత వ్యవస్థను నాశనం చేసింది. విద్యా వ్యవస్థను ప్రక్షాళనం చేయటానికి, విద్యను విలువలేని సరుకుగా మార్చటానికి వారికి అవసరమైన గుమస్తాలు తయారు చేయటానికి, నూతన విద్యావ్యవస్థ మెకాలేను ప్రవేశపెట్టింది. మెకాలే ఇక్కడి విద్యావ్యవస్థను, అందులోని నైతికత విలువలు చూసి ఆశ్చర్యపోయి ఇక్కడి విద్యా వ్యవస్థను, సంస్కృతిని, భాషను ధ్వంసం చేయకుండా ఏమి సాధించలేమనే విషయాన్ని గ్రహించాడు. మెల్లగా ధన సంపాదనే మార్గంగా, ఏ నైతిక విలువలకు స్థానం లేకుండా, భారతీయ సంస్కృతీ, నాగరికతలను ఫణంగా పెట్టి ఆంగ్ల మాధ్య మాన్ని ప్రవేశపెట్టాడు. ఇందుకు సాక్ష్యం మెకాలే. 2 ఫిబ్రవరి 1835న బ్రిటిషు పార్లమెంటుకు రాసి పంపిన లేఖలోని సారాంశం ఇది... "భారతదేశంలో తూర్పు-పడమరల ప్రయాణించాను. నాకెక్కడ ఒక దొంగగాని, ఒక భిక్షువుగాని కనిపించలేదు. అపారమైన సంపద కలిగి ఉన్న భారతదేశం. వీరికున్న నైతిక విలువలే వారికున్న బలమైన శక్తి, దీన్ని బట్టి నేను ఏమనుకొంటున్నాను అంటే...ఈ దేశాన్ని మనం ఎన్నడూ జయించలేం. ఈ దేశానికి వెన్నెముకలా నిలిచినటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వ



సంపదను, ప్రాచీన విద్యావిధానాన్ని మరిపించే దాని స్థానంలో ఇంగ్లీషు ఎంత ఉన్నతమైనదని, భారతీయులు ఆలోచించేలా వారి ఆత్మస్థైర్యాన్ని కోల్పోయేలా, వారి సహజ సంస్కృతుల స్థానంలో మనమనుకొన్న వాటిని ప్రవేశపెట్టినప్పుడు మాత్రమే మనం ఈ దేశాన్ని పూర్తిగా జయించగలం" అని పైవిధంగా 1835లో సాక్ష్యాత్తు లార్డ్ మెకాలే బ్రిటిష్/పార్లమెంటుకు పంపిన లేఖ పేర్కొన్నాడు.

స్వాతంత్ర్యానంతరం ఇప్పటికి మెకాలే విద్యావిధానమే అమల్లో ఉంది. ఆంగ్ల మాధ్యమం, ఇంగ్లీషు భాష సునామీలా మనదేశంపై విరుచుకు పడ్డాయి. 1991లో నూతన ఆర్థిక విధానాలు దీనికి పూర్తిగా ఊతమిచ్చాయి. దీనికి కారణం సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ. ఇవ్వాళ మంచి ఇంగ్లీషు ఎవ్వరికి రాదంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. 1947కి ముందు మనం నేరుగా ఇంగ్లీషు వారినుంచి నేర్చుకొనేవారం. కాని ఇవ్వాళ ఇంగ్లీషు రాని వారి నుంచి ఇంగ్లీషు నేర్చుకుంటున్నాం. మాతృభాషలో విద్యాబోధన పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించి, వికాసానికి తోడ్పడుతుంది. మాతృభాషలో ప్రావీణ్యం లేకుండా, మాతృభాష రాకుండా ఏ విద్యార్థి అయినా సర్వముఖ వికాసం చెందటం కానిపని. మాతృభాషలకు దూరమై చదివే తరాలలోంచి తాత్వికులు, రచయితలు, మంచి నాయకులుగా వచ్చే అవకాశం లేదు. అభివృద్ధి చెందాయని చెప్పబడే దేశాలు తమ మాతృభాషలను వదులుకొని ఇంగ్లీషును కౌగిలించుకొన్నవి కాదు. మాతృభాషా, సంస్కృతులను వదులుకొన్న ఏ జాతికి మోక్షం లేదు. మాతృభాష రాకుండా ఎంత విద్యా వంతుడైనా సరే నిరక్షరాస్యుడే. ఇతర భాషలు బాగా రావాలంటే మాతృభాష బాగా రావటం శాస్త్రీయం. ఇంకా అమ్మభాష ప్రాధాన్యత చెప్పుకోవాలంటే మానవ సమాజ వికాసంలో మాతృభాష ఎడల శాస్త్రీయ వైఖరి, అవగాహన లేకపోయినట్లయితే మనం సుడిగుండంలో పడిపోతాం. అందుకే కార్పొరేట్ ఆంగ్లమాధ్యమాన్ని అర్థం చేసుకొని, హేతుబద్ధమైన చారిత్రక పునాదిపై నిలబడి ఆలోచించాలి. లేదంటే మంచి వ్యక్తిత్వం గల నాణ్యమైన భావితరం మనకు అందదు. ఇది భవిష్యత్ తరాలకు తీరని నష్టాన్ని మిగిలిస్తుంది.

పిల్లల్లో విషయ పరిజ్ఞానానికి ఇంటి భాష కీలకమైంది. పిల్లల్లో పుట్టుకతోనే సహజమైన మాతృభాష అభ్యాసన కలిగి ఉంటారు. వాస్తవం ఇది. కాగా విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుగుభాష పట్ల మొగ్గుచూపక పోవడానికి కారణాలేమిటో మనం పరిశీలించాలి. విదేశీ సామ్రాజ్యవాద సంస్థలకు చౌకగా కూలీలను సమకూర్చే ఇన్ఫోసిస్, సత్యం, విప్రో లాంటి సంస్థల్లో ఎక్కువైంది. ఈ సంస్థలు చేస్తున్న ఊడిగం అమెరికా, యూరప్ దేశాల సంస్థలకు కాబట్టి ఆంగ్లభాషలో ప్రావీణ్యం ఉన్నవారికే ఉద్యోగాలున్నాయి. తద్వారా జ్ఞాన సముపార్జన కన్నా కంప్యూటర్ విద్యా, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం ఏర్పడింది. భారతీయ యువత ఆంగ్లబాబులుగా, డాలర్ బాబులుగా మారి విదేశీ దేశాలకు ఊడిగం చేయటానికి తహతహలాడుతున్నారు. తద్వారా పరోక్షంగా మాతృదేశానికి ద్రోహం చేస్తు న్నారు. మరోవైపు యూరప్, అమెరికా దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా సాఫ్ట్‌వేర్‌రంగం కుప్ప కూలటంతో డాలర్స్ డ్రీమ్స్ చెదిరిపోయి తీవ్రమైన నిరాశా నిస్పృహలకు గురై ఆత్మహత్యలకు పాల్పడి జీవితాన్ని ముగిస్తున్నారు.

భాషా అభిమానులు ప్రజలు తల్లిభాషను అధికార భాషగా తన దేశభాషను జాతీయ భాషగా ఉండాలని కోరుకోవాలి. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం ఉన్న అన్ని దేశాల్లో, రాష్ట్రాల్లో ఇదే పద్ధతి అమల్లో ఉన్న విషయం గమనించాలి. మొత్తం విద్యా వ్యవస్థ వారి వారి మాతృభాషలలో జరగాలి. ఇందుకు మొత్తం సమస్త జ్ఞాన సంపదను, దేశీయ, ప్రాంతీయ భాషల్లో తర్జుమా కావాలి. ప్రాంతీయ భాషలలో చదువుకొన్నవారికి మెండుగా ఉపాధి అవకాశాలు లభించే వ్యవస్థ నిర్మాణం జరగాలి. తక్షణ కర్తవ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. అసలు ప్రభుత్వ, ప్రయివేటు అనే రెండు రకాల విద్యా వ్యవస్థలు, మీడియంలు లేకుండా ప్రజలందరికి ఒకే రకమైన విద్యను నెల కొల్పాలి. డాక్టర్ డి.ఎస్.కొఠారి చెప్పిన (కొఠారి కమిషన్ 1964-1966, సిఫార్సులు) "కామన్ స్కూల్" విధానంలో నైబర్ హుడ్ పాఠశాలల్లో దేశ ప్రధాని మొదలు ముఖ్యమంత్రి, టీచర్లు, రిక్షాకార్మికుల వరకు తమ పిల్లలందరినీ అవాస ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివించగలిగితే నెహ్రూజీ కలలు కన్నా నిజమైన దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మించబడుతుంది. అంతేకాక, మొత్తం దేశీయ భాషల మనుగడకై ఎసరుపెట్టి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలైన ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. దీనికి అన్ని వర్గాల ప్రజలకు వాస్తవాలను తెలియచెప్పి కదిలించి, సమర్థ వంతంగా ఎదుర్కొంటే తప్ప భిన్న సంస్కృతులు, భాషలు, మనుగడలో ఉండవు. ఇది ఒక దీర్ఘకాలిక లక్ష్యం. ఏ భాష ఇతర బాషల కన్నా గొప్పది కాదు. ప్రతీ భాషకు అది ఎంత తక్కువ మంది జనాభా మాట్లాడేది అయినా, దాని విశిష్టత, ప్రాముఖ్యత దానికి ఉంటాయి. విభిన్న జాతుల మేలు కలయిక మన దేశం ప్రతి జాతి స్వతంత్రంగా ఎదిగే అవకాశం కల్పించినప్పుడే ఆ జాతి, ఆ భాష వెల్లివిరుస్తాయి. దానికై ఆంగ్లభాషా గుత్తాధిపత్యాన్ని మనం తొలగించాల్సి ఉంటుంది. ఇదే తెలుగు భాషా అభిమానుల, ప్రజల తక్షణ కర్తవ్యం కావాలి.

(ఆగస్టు 29 తెలుగుభాషా దినోత్సవం)

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. లింగంపల్లి విలేజ్, బాపునగర్, గోపి నగర్ కాలనీలలో నిర్వహించిన బోనాల వేడుకలు, రేవంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బోనాల పండుగను ప్రభుత్వం నిధులు కేటాయించి ఘనంగా నిర్వహిస్తోందన్నారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజు, బీఆర్ఎస్ శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు మారబోయిన రాజుయాదవ్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పొడుగు రాంబాబు, పద్మారావు, కృష్ణయాదవ్, ప్రసాద్, మల్లేష్‌గౌడ్, మల్లేష్ యాద వ్, రామరాజు, వేణు గోపాల్ రెడ్డి, రమేష్, నటరాజు, పవన్, రవి యాదవ్, ప్రణయ్ ముదిరాజ్, నర్సింహరెడ్డి, జమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలి

- బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

నల్లపోచమ్మ అమ్మవారి దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలని బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) ఆకాంక్షించారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడా నవభారత్ కాలనీలో నల్లపోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, డైరెక్టర్ సామ సంజీవ్‌రెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, నారని శేఖర్‌గౌడ్, కళ్ళు నర్సిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

పోచమ్మ తల్లి ఫలహారం బండి ఊరేగింపు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాసాని వీరేష్



నవతెలంగాణ-చందానగర్

బోనాల పండగ సందర్భంగా లింగంపల్లిలో రేవంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి కట్ట వెంకటేష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఆరేపల్లి సాంబశివ గౌడ్, సయ్యద్ సిరాజుద్దీన్, ఏరువా సాంబశివగౌడ్, గొంది ఏమాద్రి నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు పాతూరి వెంకట్రావు, కంకణాల వెంకటసుబ్బయ్య కోటేశ్వరరావు, గౌతమ్, శ్రవణ్ ముదిరాజ్, అప్పలనాయుడు, రంగారెడ్డి, రియాజ్, తదితరులు పాల్గొన్నారు. తదనంతరం నూతనంగా నిర్మించిన శేరిలింగంపల్లి పార్టీ కార్యాలయానికి వచ్చి కార్యాలయాన్ని సందర్శించారు. అన్ని వసతులతో నిర్మించినందుకు వెంకటేష్‌గౌడ్‌ని కాసాని వీరేష్ అభినందించారు.

24/7 ఫిట్నెస్ యూనిసెక్స్ జిమ్

- ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 24/7 ఫిట్నెస్ యూనిసెక్స్ జిమ్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ ఛైర్ పర్సన్ కొలన్ సుష్మ మహేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్ జాంగీర్, కో-ఆప్షన్ మెంబర్ అస్లామ్ పాల్గొన్నారు.

శంషాబాద్‌లో ఇషా ఆస్పత్రి ప్రారంభం



నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇషా హాస్పిటల్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ కొలన్ సుష్మ మహేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్ అజయ్, బీఆర్ఎస్ నాయకులు ఆర్.గణేష్ గుప్త, నీరటి రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఘన విజయం ఖాయం

- బీఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లాల్‌సింగ్‌నాయక్



నవతెలంగాణ-శంషాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా టి.ప్రకాష్‌గౌడ్ నాలుగోసారి ఘన విజయం ఖాయమని బీఆర్ఎస్ శంషాబాద్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు నెనావత్ లాల్‌సింగ్ నాయక్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ టికెట్ వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఎస్టీలకు ప్రత్యేక గ్రామపంచాయితీ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన ప్రకాష్‌గౌడ్ శంషాబాద్ మండలంలోని గిరిజన తండాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేశారని అన్నారు. ఆయన వెంట శంషాబాద్ మండలం గిరిజనులంతా ఉన్నారని, ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రఘు, వి.రాందాస్, కే.శ్రీను, బి.గణేష్, పి.రవి, వి.ప్రసాద్, ఎం.మున్నా, ఆర్.సుధాకర్, బి.శ్రీను, ఎం.హనుమంత్, కె.విజయ్, కే.మోహన్, కే.లాలు, ఎన్ రాజు, వి.శశిధర్ ఎన్.రతన్, ఎన్.రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సీతారంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-చందానగర్



టీటీడీ నూతన కార్యవర్గ సభ్యులుగా నియమితులైన చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ హఫీజ్‌పేట డివిజన్ అధ్యక్షులు బాల్‌లింక్ గౌతమ్‌గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెరపైకి కుల రాజకీయం

- రాబోయే ఎన్నికల్లో కీలకం కానున్నా సామాజిక సమీకరణాలు
- జనరల్ అసెంబ్లీ స్థానాలలో ఉన్నత వర్గాలకు బీఆర్ఎస్ టికెట్
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బహుజన నాయకత్వం
- బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలకు దారి తీసిన సామాజిక అంశాలు



ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. ఇందులో ముఖ్యమైనది కులం. అవును.. ఆ నియోజకవర్గంలో అధిక శాతంగా ఉన్న వారు తమ అభ్యర్థే ప్రాతినిధ్యం వహించాలని భావిస్తున్నారు. ముఖ్యంగా నిమ్నకులాలకు చెందిన వారు పార్టీ ఏదైనా తమ కులాలకు చెందిన వారికే పార్టీలు టికెట్ ఇవ్వాలని కోరుకుంటున్నారు. 'ఓట్లు మావే-సీట్లు మావే' అన్న నినాదం క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తోంది. అయితే సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ అధిష్టానం సామాజిక న్యాయం పాటించలేదని బహుజన నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లు అయినా జనరల్ స్థానాల్లో సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ వర్గాలకు అవకాశం ఇస్తాయా అనే చర్చ ప్రస్తుతం జిల్లాలో ఉత్కంఠ రేపుతోంది.

నవతెలంగాణ -రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల హడావిడి కొనసాగుతోంది. బీఆర్ఎస్ టికెట్లు కేటాయించడంతో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో గ్రౌండ్‌వర్క్ మొదలు పెట్టారు. అయితే బీఆర్ఎస్ అధిష్టానం జనరల్ స్థానాల్లో టికెట్లు మొత్తం రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వడంతో బహుజనులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సామాజిక అంశాలను తెరపైకి తెచ్చారు. తమ సామాజిక ఓటు బ్యాంక్‌తో అల్ప సంఖ్యాక సామాజిక వర్గం అభ్యర్థిని గద్దెనెక్కించడం ఏంటీ అన్న వాదనాలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎంతో కాలంగా ఓసీ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బహుజనులకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్న వాదనాలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ మళ్లీ సిట్టింగ్ ఓసీ అభ్యర్థికే ఇవ్వడంతో బీసీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం, ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలు జనరల్ స్థానాలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓట్లే అత్యధికం. ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపోటములను ఈ రెండు సామాజిక తరగతులే నిర్ణయిస్తాయి. ఈ ప్రాంతం నుంచి బీసీ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఆలోచన చేసినప్పటికీ.. రాజకీయ సమీకరణాల దృష్ట్యా మళ్లీ సిట్టింగ్‌కే టికెట్ ఇచ్చింది. దీంతో బీసీలు పునరాలోచనలో పడ్డారు.

బీఆర్ఎస్‌కు తల నొప్పిగా సామాజిక అంశాలు

జనరల్ స్థానాల్లో బీసీలకు టికెట్ వచ్చే అవకాశం ఉందని ఆశపడ్డ బీఆర్ఎస్ నేతలకు భంగపాటు తప్పలేదు. నిరాశకు గురైన బీసీ, ఎస్సీలు తమ వర్గానికి చెందిన అభ్యర్థులు ఎవరైనా సరే గెలిపించుకోవాలని భావిస్తున్నారు. అభ్యర్థులు ఏ పార్టీ అయినే సరై తమ సామాజిక వర్గం అయితే చాలు గెలిపించుకోవాలన్న అంశాన్ని తెరపైకి తేస్తున్నారు. ఎన్నికల సమయానికి ఇదే అంశంతో బీసీ, ఎస్సీ నేతలు ఉంటే.. ఇప్పటికే బీఆర్ఎస్ జనరల్ స్థానాల్లో కేటాయించిన అభ్యర్థుల పరిస్థితి ఏంటీ అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్, బీజేపీ నుంచి బీసీ అభ్యర్థులకు టికెట్ వస్తే.. అంతర్గతంగా సపోర్టు చేయడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీసీ ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ గెలుపోటములు వారి చేతిలోనే ఉంటాయి. ఇక్కడ కూడా ఓసీ అభ్యర్థికి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంతో బీసీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలైన సామాజిక న్యాయం పాటించేనా..!

టికెట్ల కేటాయింపుల్లో కాంగ్రెస్, బీజేపీ అయినా జనరల్ స్థానాల్లో బీసీ, ఎస్సీ అభ్యర్థులకు అవకాశం ఇస్తుందా..? సామాజిక న్యాయం పాటిస్తుందా అని బహుజన నాయకత్వం ఆశతో ఎదురు చూస్తోంది. బీఆర్ఎస్‌కు భిన్నంగా జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశం ఇస్తే గెలుపు సునసాయం అంటున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు సామాజిక సమీకరణాల అంచనాలను క్యాచ్ చేసుకుని టికెట్ కేటాయింపు ఉంటే ఆ పార్టీల అభ్యర్థుల గెలుపునకు అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను వేగవంతం చేయాలి

- సెప్టెంబర్ 15లోగా హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి
- పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ హరీష్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందించి లబ్ది చేకూరేలా ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆసరా పెన్షన్లు, తెలంగాణకు హరిత హారం, బీసీలు, మైనార్టీలకు ఆర్థిక సహాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి సమీక్షా నిర్వహించారు. సెప్టెంబర్ 15లోగా జిల్లాలకు కేటాయించిన హరిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. దశాబ్ది సంపద వనాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఆసరా పెన్షన్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా తక్షణమే పరిశీలించి అర్హుల జాబితాను ఆమోదం కోసం పంపించాలని సీఎస్ సూచించారు. రెండవ విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తిచేసి అర్హుల జాబితాను అప్లోడ్ చేయాలని సీఎస్ సూచించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ కోటి వృక్షార్చనలో భాగంగా ఈ నెల 26న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మొక్కలు నాటినట్టు తెలిపారు. తెలంగాణకు హరిత హారంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా 80శాతం లక్ష్యం పూర్తి చేశామన్నారు. మిగిలిన 20శాతం లక్ష్యం పూర్తి చేయుటకు మున్సిపాలిటీల పరిధిలో మొక్కలు నాటేందుకు స్థలం లేనందున అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన 3766 లక్ష్యానికి గాను 555 యూనిట్లు అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన యూనిట్లు త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. దళితబంధు, గృహలక్ష్మిపథకం, బీసీ కుల వృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రంగారెడ్డి జిల్లాలో తొలి విడుతలో ఎంపిక చేసిన 584 మంది మైనార్టీ లబ్దిదారులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెక్కులను అందజేశారని తెలిపారు. జీఓ 59 కింద రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా యువత కృషి చేయాలి



- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్
- పార్టీ యువజన విభాగం సమావేశంలో దిశానిర్దేశం



నవతెలంగాణ-శంషాబాద్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించేందుకు పార్టీ యువజన విభాగం అధ్యక్షులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం బీఆర్ఎస్ శంషాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు ఎన్. రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు ఎమ్మెల్యేనుఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మరోసారి రాజేంద్రనగర్ టికెట్ ఇచ్చినందుకు యువజన విభాగం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజేంద్రన గర్ నియోజకవర్గంలో పార్టీ ఘన విజయం సాధించేలా అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. యువకులు పార్టీకి వెన్నెముక లాగా ఉంటారని, భవిష్యత్తు నాయకులుగా ఎదిగేందుకు తీవ్రంగా ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ 27 గ్రామపంచా యతీలకు చెందిన వారు ఎమ్మెల్యేతో సమావేశం అయ్యారని తెలిపారు. ప్రకాష్‌గౌడ్‌ను మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నీరటి దేవేందర్, కార్యదర్శులు నరేష్‌ముదిరాజ్, పి.రక్షిత్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మీడియా అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, యువ నాయకులు సాయిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎం.కుమార్ లక్ష్మణ్, శ్రీకాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌లతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకలు, తెలంగాణకు హరితహారం, ఆసరా ఫించన్, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీలకు లక్ష ఆర్థిక సహాయం, ఇతర ప్రభుత్వ పథకాలపై సీఎస్ జిల్లా కలెక్టర్‌లతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులతో సమీక్షించారు. ఆసరా పింఛన్‌దారులు మరణించిన పక్షంలో వారి భాగస్వామికి పింఛన్ మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. గొర్రెల పంపిణీ పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, బీసీ కువత్తులకు ఆర్థిక సాయం రూ. లక్ష రెండవ దశ అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ యాప్‌లో వివరాల నమోదు ప్రక్రియను రేపటి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెండవ విడత దళిత బంధు పథకం కింద వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వికారాబాద్ ఆర్డీఓ విజయ కుమారి, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జడ్పీ సీఈఓ సుభాషిని, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, కలెక్టర్ కార్యాలయ ఏఓ అమరేందర్, పశుసంవర్ధక శాఖ, వెనుకబడిన తరగతుల శాఖ సహాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా డబుల్ బెడ్రూం లాటరీ



- మొదటి విడతలో 4 నియోజకవర్గాలకు 2వేల ఇండ్లు పంపిణీ
- 93,899 మంది దరఖాస్తులకు 12,479 మంది ఎంపిక
- 30న విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో లాటరీ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నో రోజులుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. లాటరీ పద్ధతిలో లబ్దిదారులకు ఇండ్లు కేటాయించనున్నారు. ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా లాటరీ తీయనున్నారు. మొదటి విడతలో భాగంగా నాలుగు నియోజకవర్గాల్లో డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 93,899 దరఖాస్తులు రాగా ఇందులో మొదటి విడతలో భాగంగా 12,479 మం దిని ఎంపిక చేశారు. ఇందులో మొదటి విడతలో నియోజకవర్గానికి 500 చొప్పున నాలుగు నియోజకవర్గాలు రాజేంద్రనగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, శేర్లింగంపల్లిలకు సంబంధించి రెండు వేల మందికి డఇండ్లను లాటరీ పద్ధతి ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ నెల 30న రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో లాటరీ తీయనున్నట్టు జిల్లా కలెక్టర్ హరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 22వ వార్డు నవ భారత్ కాలనీలోనూతనంగా నిర్మించిన పోచమ్మ దేవత ఆలయంలో పోచమ్మ అమ్మవారి విగ్రహా ప్రతిష్టపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ కోశికే ఐలయ్య, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తుర్కయం జాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి కలిసి ఘనంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, కౌన్సిలర్ కాకుమాను సునీల్,కుంట ఉదయ శ్రీ, నక్క శివలింగం గౌడ్, బ్యాంకు డైరెక్టర్ సామ సంజీవరెడ్డి ఆలయ కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, విగ్రహ దాత భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.





మంత్రి పట్నంను కలిసిన తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-తాండూరు

రాష్ట్ర గనులశాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డిని సోమవారం తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పట్నం మహేందర్ రెడ్డికి నూతనంగా తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకోవడంతో తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోట్‌పల్లి



మండల పరిధిలోని బార్వాద్‌లో రూ.5 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్టు బార్వాద్ సర్పంచ్ వెంకటేష్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగిరెడ్డి, నరేందర్ రెడ్డి, అశ్విన్ రెడ్డి, మైనోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్, పాండురంగారెడ్డి, ముకుంద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-దోమ



మండల పరిధిలోని బొంపల్లికి చెందిన దూదేకుల జహంగీర్ తండ్రి పేరు అబ్దుల్లా (70) గత గురువారం వారి ఇంటి నుండి పరిగి వెళ్తానని అతని రెండో కుమారుడు మోయిన్‌కు చెప్పి ఇంట్లో నుండి వెళ్ళిపోయాడు. అతని కుమారుడు మోయిన్ 3 రోజుల నుండి వాళ్ల బంధువుల దగ్గర వెతికినా అతని ఆచూకీ లభ్యం కావడం లేదు. అతని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే ఈ నెంబర్లకు 9553966853, 9441222371 ఫోన్ చేయవలసిందిగా కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పట్లూర్‌లో ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షల ఆర్థిక సహకారం



నవతెలంగాణ-మర్పల్లి

మండలంలోని పట్లూరులో శ్రీ దుర్గా మాత ఆలయం పున్ణనిర్మాణం కోసం అభినందన వెంచర్ యాజమాన్యం కే శ్రీధర్ తమ వంతు ఆర్థిక సహకారం రూ.6 లక్షల నగదు సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్ చేతుల మీదుగా సోమవారం ఆలయ నిర్మాణ కమిటీకి అందించారు. అభినందన వెంచర్ వారికీ పట్లూరు గ్రామస్తుల తరపున సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన రాములు

నవతెలంగాణ-పరిగి



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో బీఆర్ఎస్ సయ్యద్‌పల్లి గ్రామాధ్యక్షుడు రాములు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. చొక్కంపేట ఆంజనేయులు, కౌకుంట్ల సురేందర్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యురాలికి మండల నాయకుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-మర్పల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలుగా నియమితులైన శుభ సందర్భంగా గడ్డం సీత రంజిత్‌రెడ్డికి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మధుకర్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సర్పంచులు, ఎం పీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి





- సమస్యలపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన ఆశలు

నవతెలంగాణ-పూడూర్

తెలంగాణ ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ..ప్రభుత్వం పనికి తగ్గ వేతనం చెల్లించడం లేదన్నారు. గర్భిణులు మొదలుకుని పుట్టే పిల్లల వరకు అన్ని బాగోగులనూ చూసుకుంటున్నామన్నారు. గ్రామంలో బీపీ షుగర్ చెకప్ నిర్వహించి మందులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్‌కు రూ.18 వేలు వేతనాన్ని డిమాండ్ చేశారు. చిన్న ఉద్యోగమని ప్రభుత్వం ఆశా వర్కర్లను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఉమాదేవి, అమత మానెమ్మ జయమ్మ అనసుజా తదితరులున్నారు

'ఇంటర్మీడియట్ ప్రవేశానికి రేపు చివరి రోజు'

నవతెలంగాణ-తాండూరు రూరల్



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం రేపు బుధవారం చివరి అవకాశమని సాంఘిక సంక్షేమ పాఠశాల. కళాశాల పెద్దదేముల్ ప్రధానోపాధ్యా యురాలు సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మం డలం ఎన్టీఆర్ కాలనీలో వెలసిన శ్రీకర ఉప కర కళాశాలలో కొనసాగుతున్న నాన్ సీఈవో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల. కళాశాలలో బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ దరఖాస్తుల స్వీకరిస్తారని తెలిపారు. తాండూర్ ఎన్టీఆర్ కాలనీ శ్రీకర ఉపకర భవనంలో కొనసాగుతున్నదని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య



నవతెలంగాణ-పరిగి

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ (ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య అన్నారు. విద్యుత్ చార్జిలు తగ్గించాలని విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని ఆరోజు చేసిన బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి అమరలైనారు సందర్భంగా సోమవారం పరిగి పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న అప్పటి చంద్రబాబు నాయుడు టీడీపీ హయాంలో పెంచిన విద్యుత్‌చార్జిలు తగ్గించాలని, విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించామన్నారు. అప్పటి ప్రభుత్వం నిరంకుశంగా సీపీఐ(ఎం) నాయకులపై లాఠీ చార్జీ, భాష్పవాయు విచక్షణా రహితంగా కాల్పులు జరపడం వల్ల ఆరోజు ముగ్గురు కామ్రేడ్స్ అమరులైనారు అని తెలిపారు. అనేకమంది సీపీఐ(ఎం) నాయకులు గాయాలపాలై ఆస్పత్రి పాలైనారు. ఆ రోజు నుండి 2014వరకు విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు భయపడ్డాయని, కానీ ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశంగా విద్యుత్ చార్జీలు పెంచడం గాని, మోడీ ప్రభుత్వం విద్యుత్‌ను ప్రయివేటీకరణ చేయడంలో ముందంజలో ఉన్నదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి పెద్ద ఎత్తున పోరాటాలు రూపకల్పన చేయాల్సిన అవసరం సీపీఐ(ఎం)పై ఉందన్నారు. భవిష్యత్తులో విద్యుత్‌చార్జీలు, విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని, నిత్యవసర ధరలు తగ్గించాలని, మతోన్మాదం నిరం కుశత్వానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తారని ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎండి. హబీబ్, సత్తయ్య, రఘురాం, శేఖర్ ప్రభు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాధర్నాను జయప్రదం చేయాలి



- నూతన జిల్లాలకు డీఈఓ మండలానికి ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షులు పాండురంగం
- మండలంలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-పెద్దేముల్.

నూతన జిల్లాలలో డీఈఓలను, మండలానికి ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీఎస్‌యుటీఎఫ్ మండలాధ్యక్షులు పాండురంగం సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని అడ్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాషాపూర్, ఎంపీపీఎస్ తట్టేపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తట్టేపల్లి, జిల్లా పరిషత్ పాఠశాల ఇందూరులో టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షులు పాండురంగం జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. జులై, ఆగస్టులో నెలలలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన 5571సిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని జీవో 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. బ్లాక్ చేసిన 13 జిల్లాల భార్యాభర్తలను బదిలీ చేయాలని, పర్యవేక్షణ అధికారుల ఖాళీలను పదోన్నతులు ద్వారా రెగ్యులర్ నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల సెప్టెంబర్ 1వ తేదీన ఉపదేశ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాలొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు సలీం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తే సహించేది లేదు

- రావులపల్లిలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం
- మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-కొడంగల్

ఎన్నికలలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలో ప్రచారం నిర్వహించుకోవాలని దౌర్జన్యం చేసి, కాంగ్రెస్‌పై, రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రావులపల్లిలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని ఒప్పందంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేశారన్నారు. ఈసారి మాట మార్చి ఒప్పందాన్ని తుంగలో తొక్కారన్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయన్నారు. డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని చెప్పి ఒకటి కూడా ఇవ్వలేదన్నారు. తన కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు కాంగ్రెస్‌లో చేరిన ట్లు తెలిపారు. గుర్నాథ్ రెడ్డి వల్ల గెలుపొందిన ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి, రేవంత్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు శిలా ఫలకాలు వేసుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రచారం చేసుకోవాలని, దౌర్జన్యం చేస్తే కొడంగల్ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి ఎండి. యూసుఫ్, కాంగ్రెస్ మండలా ధ్యక్షులు మందారం ప్రశాంత్, వార్ల విజయ్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నయీం, సర్పంచ్ బాల్‌రెడ్డి, దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు వెంకట్‌రావు, బోడి వెంకట్ రెడ్డి, వీరన్న, జయతీర్థ చారి, మురారి వశిష్ట, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడంలోనే సంతృప్తి





- మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్

నవతెలంగాణ-పరిగి

ప్రజలకు మంచి సేవలు అందిస్తే మనసుకు సంతృప్తినిస్తుందని మిషన్ భగీరథ కార్యదర్శి స్మిత సబర్వాల్ అన్నారు. సోమవారం రాఘవపూర్ నీటి శుద్ధి కేంద్రం ఆవరణలో నిర్మించిన శిక్షణా కేంద్ర భవనానికి భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ జి. కృపాకర్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మలతో కలిసి ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించిన భగీరథ సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందిన మిషన్ భగీరథ సహాయకులు చేయాల్సిన పనులు, శిక్షణలో పొందిన అనుభూతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టి కోటికి పైన కుటుంబాలకు రక్షిత తాగు నీరును అందిస్తుందన్నారు. భగీరథ నీటి ద్వారా కలిగే ప్రయోజనాలను శిక్షణ పొందిన సహాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా పైపుల లీకేజీలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ సర్వీసుల మేరకు అనుభవమున్న వీఆర్‌ఏలు భగీరథలో ఉద్యోగం పొందిన మీరు ఇంకా మెరుగైన సేవలందించవచ్చన్నారు. ప్రతిభ, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తులకు భగీరథలో మంచి స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. భగీరథ ద్వారా తాగు నీటిని ప్రజలకు అందించడంలో ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని అన్నారు.

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. తాగునీరు మంచిగా ఉంటే ప్రజల జీవన పరిణామాలు బాగుంటాయన్నారు. బతకడానికి నీరు ఎంతో అవసరమని అలాంటి మంచినీరు ప్రజలకు అందిస్తే ఎంతో మంచిదని తెలిపారు. గతంలో గ్రామ రెవెన్యూ సహాయకుల నుండి ప్రభుత్వం శాశ్వత ఉద్యోగస్తులుగా నియామకాలు ఇచ్చారని, బాధ్యతను గుర్తెరిగి పూర్తిస్థాయిలో పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాల్లో మిషన్ భగీరథ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు చెన్నారెడ్డి, జ్ఞాన్ కుమార్, రాంచందర్, లలిత, వినోబా దేవి, చంద్రమౌళి, మధుబాబు, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ బాబు శ్రీనివాస్, డీఆర్డీఓ కృష్ణన్, ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ దానయ్య, ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎంపీఓ దయానంద్, రాగవపూర్, జాఫర్‌పల్లి సర్పంచులు జగన్, అనిత తదితరులు పాల్గొన్నారు.



పరిగి బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు

- ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించడంతో అయోమయంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి వర్గీయులు
- ఎమ్మెల్యే బరిలో ఉండాలని ఒత్తిడి తెస్తున్న అనుచరులు

నవతెలంగాణ-పూడూర్

పరిగి బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలతో ఇద్దరు నాయకులు బీఆర్ఎస్ టికెట్ 'నాకు వస్తుందంటే నాకే వస్తుంది' అని కొంతకాలంగా పరిగి నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రజల్లోకి దూసుకుపోయిన నాయకులు. సీఎం కేసీఆర్ సిట్టింగ్లకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పిన మాట ప్రకారం ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి టికెట్ కేటాయించడంతో డీసీసీ అధ్యక్షులు బొయ్యోని మనోహర్ రెడ్డి ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిపోయిన ఆశించిన మేరకు టికెట్ రాలేదు. దీంతో ఆయనను నమ్ముకుని వచ్చిన కులకచర్ల, దోమ, పరిగి, పూడూర్ మండలాల్లో కొంత మంది నాయకులు అయినను నమ్ముకుని ఆయన వెంట అడిగేసారు. తీరా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అధినేత పెద్ద మొత్తంలో సిట్టింగ్లకే అవకాశం కల్పించడంతో పరిగి ఎమ్మెల్యే స్థానాన్ని సిట్టింగ్‌కే ప్రాధాన్యత ఇవ్వడంతో డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డిని నమ్ముకుని పోయిన నాయకుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఎదిరించి బయటికి వచ్చిన నాయకులు మళ్లీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి ఎలా మద్దతు ఇయాలని ఆలోచనలో పడ్డారు. మనోహర్ రెడ్డికి టికెట్ రాకపోవడంతో ఆయన వెంట ఉన్న కొంతమంది ఇప్పటికే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరి కొంతమంది ఎక్కడ పోవాలో తెలియక మనోహర్ రెడ్డి పరిగి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉండాల్సిందేనని రాబోయే రోజుల్లో భవిష్యత్తు వారికి ఉండాలంటే పోటీ చేసి తీరాల్సిందేనని ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. త్వరలో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిగిలో ముఖ్య కార్యకర్తలు సమావేశం ఉంటుందని ఆయన వర్గీయులు తెలిపారు. ఎన్నికలు మరో 3 నెలలు ఉండడంతో ఏం జరుగుతుందో తెలియాల్సి ఉంది

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను కర్నాటకలోనూ అమలు చేయాలి

- ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-కొడంగల్

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను కర్నాటకలో అమలు చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్లలో మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌లో ప్రవేశపెట్టిన దళిత బంధు రూ.12 లక్షలు, గిరిజన బంధు రూ.4 వేలు పింఛన్, ఉచిత కరెంటు చెపుతున్న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కర్నాటకలో పథకాలను ముందు అమలు చేయాలన్నారు. కొడంగల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు అక్కడ అమలు చేసిన తర్వాత మాట్లాడితేనే బాగుంటుందన్నారు. ఖర్గేకు దమ్ము ధైర్యం ఉంటే కర్నాటకలో అమలు చేసి తెలంగాణలో హామీలు ఇవ్వాలని హెచ్చరించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే పరిస్థితి ఏ విధంగా ఉందంటే 'సొంత తల్లికి అన్నం పెట్టని వాడు పిన్నికి బంగారు గాజులు చేపిస్తా' అన్న చందంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాదు కాబట్టి ఇష్టం వచ్చినట్టు హామీలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ 50 ఏండ్లు పాలించి ఇలాంటి పథకాలు ఎందుకు ప్రవేశపెట్ట లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ స్కాములు, కుంభకోణాల ప్రభుత్వం రాష్ట్రాలకు వచ్చిన సంపాదన దోచుక తినడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ నాయక త్వంలో సంపాదన పెంచి పేదలకు పంచుతున్నారన్నారు. కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ కృష్ణ, బొంరాస్‌పేట్ పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నరోత్తం రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల మిత్రలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి

- కనీస జీతభ్యతంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలి
- గోపాల్ మిత్రులకు వెటర్నరీ అసిస్టెంట్ పరీక్ష 50 శాతం మార్కులు వెయిటేజ్ కల్పించాలి
- రిటైర్డ్ పరిహారం అందించాలి

నవతెలంగాణ-దోమ

పాడి రైతులకు 24 గంటలు అందుబాటులో ఉండి పాడి పశువులకు సేవలు అందిస్తున్న గోపాల మిత్రలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి. పశుసంవర్ధక శాఖలో పశు గణాభివృద్ధి సంస్థలో 23 ఏండ్లుగా గోపాల మిత్రలుగా పని చేస్తూ రైతుల ఇంటిముందు నాటు జాతి పశువులకు కృత్రిమ గర్భాధారణ సేవలందిస్తూ పశువైద్యాధికారులు అందుబాటులో ఉన్నా లేకున్నా, తమ బాధ్యతగా 24 గంటలు సేవలందిస్తూ, రైతులకు మేలు జాతి, అధిక పాలు దిగబడినిచ్చే దూడలను పుట్టిస్తూ వాటిని యుక్త వయస్సు వచ్చేవరకు సంరక్షణ చేస్తూ చూడు కట్టించే వరకు కీలక పాత్ర పోషిస్తుంది కరోనా సమయంలో రైతు కాళ్లు కదపని సమయంలో తమ భార్య పిల్లలను వదిలి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రైతు ఇంటికి వెళ్లి పశువులకు సేవలు అందించారు. అదేవిధంగా కరోనా బారినపడి ప్రాణాలు కోల్పోయిన గోపాల మిత్ర కుటుంబంలో ఒకరికి ఆఫీసులో సబార్డినేట్ ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాని ప్రభుత్వం ఆదుకోవాలి. తెల్లజాతి పశువులకు వైరా సోకి చర్మవ్యాధి ముద్ద లాసిస్కిన్ అదుపులోకి తేవడానికి పశు సంవర్ధక సిబ్బందితో కలిసి పని చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ రూ.11050/- వేతనం అందిస్తుంది. కానీ పెరిగిన నిత్యవసర గ్యాస్, పెట్రోల్ అనుగుణంగా వారి కుటుంబం దిగభారమై ఇబ్బందులు ఎదుర్కొంటూ బతుకు బండి సాగిస్తున్నారు. 23 ఏండ్లుగా గోపాల మిత్రలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి నిత్యం ద్విచక్ర వాహనంపై తిరగడం కారణంగా వెన్నుముక లాంటి రోగాలు వచ్చి సంసార జీవితానికి పనికిరాకుండా పోతున్నారు. ఇకనైనా తమను గుర్తించి పాడి పశువులకు సేవలు చేస్తున్న 1530 గోపాల మిత్రలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



రాష్ట్ర ప్రభుత్వం గోపాల మిత్రల సేవలను గుర్తించాలి



పాడి రైతులకు 24 గంటలు అందుబాటులో ఉండి పాడి పశువులకు సేవలు చేస్తున్న గోపాల మిత్రలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి. ఆపత్కాలంలో కూడా పాడి రైతులకు అండగా ఉండి సేవలందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలి.

చెరుకు శీను, గోపాల మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు

రాత్రి వేళల్లో పాడి రైతులకు అండగా ఉంటున్నాం



పాడి పశువులకు ప్రథమ వైద్య చికిత్సకు రాత్రి వేళల్లో పాడి పశువుల రైతులకు అండగా ఉండి పశువులకు చికిత్సలు అందిస్తున్నాం. పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టే దూడలకు గోపాల్ మిత్ర రైతులకు సలహాలు సూచనలు ఇస్తుంది. గోపాల్ మిత్రులకు కనీస జీతభత్యంతోపాటు, ఉద్యోగ భద్రత అమలు చేస్తూ ప్రభుత్వంలో విలీనం చేయాలి.

కొండయపల్లి కేశవులు, గోపాల మిత్ర జిల్లా ఈసీ మెంబెర్

నందివనపర్తి పెద్దమ్మ గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-యాచారం

మండల పరిధిలోని నందివనపర్తిలో వెలసిన పెద్దమ్మ గంగాదేవి ఆలయంలో బోనాల ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి సర్పంచ్ కంబాళ్లపల్లి ఉదయశ్రీ ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బోనాల పండు గలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించు కోవాలన్నారు. రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలేమూర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

- సర్పంచ్ పాతులోత్ మంగ శ్రీనివాస్



నవతెలంగాణ-మంచాల

నేడు మండల పరిధిలోని బండలేమూర్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ పాతులోత్ మంగ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బండలేమూర్ గ్రామంలో ఆమె మాట్లాడుతూ నేడు బండలేమూర్ గ్రామంలో ఉదయం 11లకు మహిళలు, బాలబాలికల హక్కులపై అవగాహన కల్పించేందుకు రంగా రెడ్డి జిల్లా న్యాయ సేవాధి కారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సద్దస్సుకు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, చిల్డ్రన్ ఆఫీసర్, సీఐ మంచాల కాశీవిశ్వనాథ్, న్యాయవాదులు తదితరులు హాజరవుతునట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- పెంచిన వేతనాలు వెంటనే ఇవ్వాలి
- 9 నెలలు గడుస్తున్నా ఇవ్వని బిల్లులు
- విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- 4న కార్మికుల ఆందోళన కార్యక్రమాలు
- సీఐటీయూ మండల కన్వీనర్ పొచమోనీ కృష్ణ



నవతెలంగాణ-మంచాల

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐ టీయూ మండల కన్వీనర్ పోచమోనీ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 9 నెలల నుంచి బిల్లులు ఇవ్వడం లేదన్నారు. పెంచిన వేతనాలు మూడు నెలల నుంచి ఇవ్వలేదన్నారు. పెండింగ్ బిల్లుల ఇవ్వడం లేదనీ, పెంచిన వేతనాలు కూడా ఇవ్వకపోతే ఎక్కడి నుంచి డబ్బులు తెచ్చి వంట చేసి పెడతారని నిలదీశారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమ ర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో వంట చేయడం బందు చేసి, ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదం లేద న్నారు. ముఖ్యంగా సెప్టెంబర్ 4 మండల ఆఫీసుల ఎదుట ధర్నాలు చేపడు తామన్నారు. 13న చలో విద్యా కమిషనర్ కార్యక్రమాలు చేపట్టను న్నట్టు హెచ్చరించారు.



ఆగపల్లి గ్రామంలో ఘనంగా బోనాలు

- పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.శ్రీనివాస్‌రావుకు సన్మానం



నవతెలంగాణ-మంచాల

మండల పరిధిలోని ఆగపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల పడుగ సంద ర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కె. శ్రీనివాస రావు, మంచాల సీఐ కె. విశ్వనాథ్, ఎస్ఐ.రవి నాయక్, ఏఎస్ఐ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మినించిట్టు సర్పంచ్ గోసుల జంగయ్య తెలిపారు.

రెండో విడత గొర్రెల పంపిణీ త్వరగా చేయాలి

- గొర్రెమేకల పెంపక దారుల సంఘం జిల్లా అధ్యక్షులు గౌర శ్రీశైలం



నవతెలంగాణ-కందుకూరు

రెండో విడత గొర్రెల పంపిణీ త్వరగా చేయాలనీ గొర్రెల మేకల పెంపక దారుల సంఘం జిల్లా అధ్యక్షులు గౌర శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం కందుకూరు మండల కేంద్రంలో జీఎంపీఎస్ సంఘం అధ్యక్షులు ఎ. పాలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండవ విడత గొర్రెల, డీడీలు కట్టించి వెంటనే గొర్రెల పంపిణీ చేయా లన్నారు. అటవీ ప్రాంతమైన లేమూరు, అగర్మియా గూడెం గ్రామాల మధ్యన ఉన్న అడవిలోకి అటవీ అధికారులు గొర్రెలను రానివ్వడం లేదన్నారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు స్పందించి గొర్రెలను రానివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జె.పెంటయ్య, మండల కమిటీ సభ్యులు చిందం అంజయ్య, డి. శేఖర్, సి. బాలకృష్ణ, బి. సుభాన్, ప్రశాంత్, డి.ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి వైస్ ఎంపీపీ కురుమ రాములమ్మ సేవలు మరువలేం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



నవతెలంగాణ-శంకర్‌పల్లి

శంకర్‌పల్లి వైస్ ఎంపీపీ కురుమ రాములమ్మ సేవలు మరువలేనివని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండలంలోని మిర్జాగూడ ఎంపీటీసీ శంకర్‌పల్లి వైఎపీపీ కుర్మా రాములమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పి ంచారు. వైస్ ఎంపీపీగా ఉన్న కాలంలో ఆమె గ్రామంలో అభివృద్ధి సంక్షేమ పనులు చేపట్టినట్టు చెప్పారు. స్వర్గీయ కురుమ రాములమ్మ కుమారుడు శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుర్మ వెంకటేష్ ఆమె అడుగుజాడల్లో నడుస్తూ గ్రామ సర్పంచ్ రవీందర్‌గౌడ్ తో కలిసి గ్రామాన్ని అభివృద్ధి సంక్షే మ పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మిర్జాగూడ గ్రామ సర్పంచ్ రవీందర్ గౌడ్, ఉపసర్పంచ్ శాంతి కిషన్ సింగ్ మాజీ సర్పంచ్ మల్లేష్, సొసైటీ చైర్మన్ అరవింద్ రెడ్డి, మిర్జాగూడ వార్డు సభ్యులు వై ప్రవీణ్ కుమార్, నరసింహగౌడ్ కోటే రాజు, సొసైటీ డైరెక్టర్ ఒగ్గు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

- విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, భూగర్భ గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

నవతెలంగాణ-చేవెళ్ల

దేశంలోనే ఎక్కడాలేని విధంగా పరిశ్రమలను సీఎం కేసీఆర్, కేటీఆర్ చేవెళ్ల ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, భూగర్భ గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సోమ వారం చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి, మల్లారెడ్డి గూడ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. చేవెళ్ల మండలంలోని రావులపల్లి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, జాతిపిత మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను జడ్పీ చైర్‌పర్సన తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో వారు కలిసి ఆవిష్కరించారు. అనంతరం రావులపల్లి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ డ్రయినేజీ రూ.45 లక్షలు, సీసీరోడ్డు నిర్మాణ పనులు రూ12 లక్షల 60 వేల ఖర్చుతో శ్మశాన వాటికలు ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డిగూడ గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. మహనీ యులు అందించిన స్ఫూర్తి ఎంతో గొప్పదని, వారి విగ్రహాలు భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేస్తాయన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో స్వర్గీయ ఇంద్రారెడ్డి చెరగని ముద్ర వేసారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని షాబాద్, శంకర్‌పల్లి లలో ఏర్పా టు అవుతున్న కంపెనీలలో స్థానికులకు పెద్ద ఎత్తు న ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తా యన్నా రు. కాళేశ్వరం లాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి చేస్తారని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, తదితరులు

మరొక్కసారి యాదయ్యని ఆశీర్వదిం చాలని ప్రజ లకు మంత్రి పిలుపునిచ్చారు. అభయ హస్తం డబ్బు లు త్వరలో చెల్లిస్తామన్నారు. చేవెళ్లలో అభివృద్ధి కోసం, మెట్రో రైలు కోసం సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే యాదయ్య ప్రతిపాదనలు అందించడం అభినందనీ యమన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా పరి శ్రమలను సీఎం కేసీఆర్, కేటీఆర్ చేవెళ్ల ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్ని స్తున్నారు. తెలం గాణ రాష్ట్రం అభివృద్ధికి దేశంలోనే ఆదర్శంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, రావులపల్లి సర్పంచ్ కేసారం శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డిగూడ సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెంటారెడ్డి, ఉప సర్పంచ్ రాధిక వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

- ఏఈ ఎం. చక్రపాణి

నవతెలంగాణ-మహేశ్వరం

నేడు మహేశ్వరం మండల పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ మర మ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఎం. చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని మహేశ్వరం టౌన్, తుమ్మలూరు, సిరిపురం, ఎస్.డీ తండా, కె.బీ తండా, కే.సీ తండా, డీ.జీ తండా, గంగారం, మైలార్వాయి తండాలలో ఉద యం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయ నున్నట్టు తెలిపారు.ఆయా గ్రామాల్లోని ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరిం చాలని కోరారు.

బోనాల పండుగలో మేయర్



నవతెలంగాణ-కందుకూరు

కందుకూరు మండలంలోని నేదునూరు గ్రామ అనుబంధ మాన్యగూడ గ్రామంలో సోమవారం అధి మైసమ్మ బోనాల సందర్భంగా వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ అఫ్జల్ బెగ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న బడంగి పేట మేయర్ చిగురింత పరిజాత నర్సిమరెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సభావాత్ కృష్ణా నాయక్, వరికుప్పాల బాబు, ఎగిరిసెట్టి శంకర్, శ్రీశైలం, సయ్యద్ అజీజ్, ప్రశాంత్, వెంకటేష్ గౌడ్, ఢిల్లీ శ్రీదర్, పాండురంగారెడ్డి, గణేష్, సల్మాన్, నేదు నూర్, మాన్యగూడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

- చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్



నవతెలంగాణ-శంకర్‌పల్లి

ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకో వాల్సిన బాధ్యత ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందిపై ఉందని చేవెళ్ల డిప్యూటీ డీఎంహె చ్‌వో దామోదర్ తెలిపారు. సోమవారం శంకర్‌పల్లి మండలంలోనిశంకర్‌పల్లి, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే సేవలు, ప్రసవాలు, గర్భిణులకు వైద్యం అందించి, వారిని ఎప్పటికప్పుడూ పరీక్షించాలని డాక్టర్లకు సూచించారు. పసిపిల్లలకు టీకాలు, కేసీఆర్ కిట్టు నిర్వహణ, ఎన్‌సీడీ నిర్వహణ, కుష్టువ్యాధి సర్వే నిర్వహణ, గర్భిణుల వైద్య పరీక్షల నమూనాల సేకరణ చేసి, వారు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బంది సల హాలు, సూచనలు ఇవ్వాలన్నారు. క్షయ వ్యాధి నివారణ చర్యలు సబ్ సెంటర్లలో ఓపి నిర్వహణ, ఏఎంసీ నిర్వహణ టీకాల నిర్వహణ ఇచ్చిన విష యాన్ని సమీక్షించినట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో శంకర్‌పల్లి వైద్యాధికారి రేవతిరెడ్డి, హెచ్ పీలు డాక్టర్ ప్రియాసింగ్, డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ అనూష, డాక్టర్ శోభ, రఘు సిహెచ్ సంతోష, సూపర్‌వైజర్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- డీసీసీ మాజీ అధ్యక్షులు వెంకటస్వామి



నవతెలంగాణ-చేవెళ్ల

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ మాజీ అధ్యక్షులు పడాల వెంకటస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని పామేన గ్రామంలో పామెన గ్రామ మాజీ సర్పంచ్ దవల్గారి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం ఆధ్వర్యంలో జెండావిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేవెళ్ల మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ళ సర్పంచ్ శైలజఆగిరెడ్డి, పీఎసీఎస్ చైర్మెన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పామేన గ్రామంలో కాంగ్రెస్ జెండావిష్కరించారు.అనంతరం కాంగ్రెస్ గ్రామ కమిటీలను నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవర సమత, ప్రధాన కార్యదర్శి గొనె సరితా, పామేన గ్రామ మహిళా అధ్యక్షురాలు కాముని లక్ష్మీ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జుకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి పడాల రాములు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల శ్రీను, పీఎసీఎస్ డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల గ్రామ ఉప సర్పంచ్ గంగి యాదయ్య, వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి, నాయకులు బండారి వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, వినోద్‌గౌడ్, పాండు యాదవ్, పామేన గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, కరుణాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, శామ్ రెడ్డి, సత్తయ్య, బక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి : ఎంపీడీవో

- మాల్ లో రికార్డుల తనిఖీ



నవతెలంగాణ-యాచారం

గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామపంచాయతీలో రికా ర్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యదర్శులు పంచా యతీల నిర్వహణకు సరియైన చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డు నిర్వ హణలో తప్పులు జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రయినేజీ సాఫీగా సాగేం దుకు చర్యలు తీసుకునేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో రూ.3 కోట్ల 36 లక్షలు పంట రుణమాఫీ

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు దేవరశెట్టి చంద్రశేఖర్



నవతెలంగాణ-కందుకూరు

కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ సందర్భంగా రూ.3 కోట్ల 36 లక్షలు పంట రుణమాఫీ చేసినట్టు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. కందుకూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 1015 మంది రైతులకు రుణమాఫీ వర్తి స్తుందన్నారు. రుణమాఫీ పొందిన రైతులు ఆధార్‌కార్డు, భూమి పాసు బుక్కు, జిరాక్స్ కాపీలు, పహని, నాలుగు పాస్‌ఫోటోలు ఇవ్వాలని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం కోరిందనీ, కేవైసీని నమోదు చేయించు కోవాలని సూచించారు. 105 మంది రైతులు దీర్ఘకాలిక అప్పులు దరఖాస్తు చేసుకు న్నారనీ రూ. 6 కోట్లు దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. పంట అప్పుల కోసం 120 మంది దరఖాస్తు చేసుకున్నారనీ, ఆ రైతులకు రుణాలు ఇవ్వడానికి కోటి రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. దీర్ఘకాలిక, పంట అప్పుల కోసం దరఖాస్తు పెట్టుకున్న రైతులందరికీ త్వరలోనే రుణాలు అందజేస్తామని తెలిపారు.



బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలభివృద్ధి

- రాష్ట్ర భూగర్భ, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి
- సింగప్పగూడలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-చేవెళ్ల

బీఆర్ఎస్ హయంలోని గ్రామాలు అభివృద్ధి చెందాయని రాష్ట్ర గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని సింగప్ప గూడ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్వహించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాలు అభివృద్ధి చెందాలని లక్ష్యంతో చిన్నచిన్న గ్రామాలను కూడా గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అందులో భాగంగానే సింగప్పగూడ గ్రామం కూడా నూతన గ్రామపంచాయతీగా ఆవిర్భ వించిందన్నారు. సింగప్పగూడ గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తా మన్నారు. తక్షణంగా గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయి స్తామన్నారు. అదేవిధంగా గ్రామానికి మంజూరైన బ్రిడ్జి పేరు తప్పుగా రావడంతో పనులు ప్రారంభం కావడంలో ఆలస్యమైందన్నారు. త్వరలోనే బ్రిడ్జి పనులు కూడా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రహీమా బేగం, బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయ కులు ఎండి.అలీ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, యువ నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకటేష్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఓ భూటకం

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్



నవతెలంగాణ-మంచాల

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఒక భూటకమని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 60 నుంచి 65 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, అప్పుడు చేయ ని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎస్సీ,ఎస్టీలను మరోసారి మోసం చేయడానికి తప్పా, వారిపై ఏమాత్రం ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ ఒక రాష్టానికి మాత్రమే సపరేటుగా హామీలు ప్రకటిం చడం ప్రజలను మోసం చేయడం తప్పా, మరొకటి లేదన్నారు. నిజానికి కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్నీ రోజులు ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.70 వేల నుంచి రూ.లక్షా వరకు మాత్రమే అమలు చేశారని వెల్లడించారు. కానీ బీఆర్ఎస్ హాయంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇండ్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం పేరుతో రూ.3 లక్షలు అమలు చేస్తుం దన్నారు. కాంగ్రెస్‌కు ఎస్సీ,ఎస్టీలపై ప్రేమ ఉంటే గత 65 ఏండ్ల కాలంలో డిక్లరేషన్ గుర్తుకు రాలేదా అని నిలదీశారు. కేవలం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలువడానికే ఈ డిక్లరేషన్ అని ఎద్దేవా చేశారు. దశాబ్దాలుగా గిరిజన తండాల్లో గిరిజనుల రాజ్యం రావాలని, గిరిజనుల తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని గిరిజన సోదరులు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేండ్లలోనే 3 వేల పై చిలుకు గిరిజన తండా లను గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కు తోందన్నారు. ప్రజలు కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దనీ, ఇది ముమ్మాటికీ ఎన్నికల డిక్లరేషన్ మాత్రమేనని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ భూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

దాతలు ముందుకొచ్చి నా కొడుకును బతికించండి

- రెక్కాడితే కానీ డొక్కాడని దీనస్థితిలో ఉన్నాం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు



నవతెలంగాణ-మొయినాబాద్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పట్టణంలోని లంగర్ హౌస్‌లోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు షా విశాల్ కుమార్ (21) ను బతికించుకోవడానికి తల్లిదండ్రులు అచ్చాలాల్ షా, చంద్రాదేవి ఆపన్న హస్తం కోసం ఎదురు చూసు న్నారు. ఇటీవల రాందేవ్‌గూడ మీదుగా ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళు తుండగా, అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై (బ్లెడ్ క్లాట్ అయింది) ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని బాధిత తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం 'నగరంలోని అమీర్‌పేటలోని వెల్ నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం రూ. 9 లక్షల వరకూ ఖర్చవుతోంది. ప్రస్తుతం మా కుమారుడిని బతికిం చుకోవడానికి దిక్కుతోచని దీనస్థితిలో ఉన్నామని' తల్లిదండ్రులు వెల్లడించారు. మనసున్న మారాజులు కరుణించి మా కొడుకు ప్రాణాలు దక్కించుకోవడానికి ఆర్థిక సహాయం చేస్తారని చేతులెత్తి మొక్కుతున్నాం. దాతలు కరుణించి గూగుల్ పే, లేదా ఫోన్ పే ద్వారా ఈ ఫోన్ 7702320642 కు సహాయం చేయాలని బాధితుడి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

- సర్పంచ్ పూజితాశ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-షాబాద్

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియో గించుకోవాలని అప్పారెడ్డిగూడ సర్పంచ్ పూజితా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ యునానీ వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ వహజుద్దీన్ ఖాన్ 53 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజన్‌వాధ్యుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పార్మసిస్టు అవివేలమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

గండిపేట్ తహసీల్దార్‌కు సన్మానం
కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పీఎస్ కుమార్



నవతెలంగాణ-గండిపేట్

గండిపేట్ తహసీల్దార్ గోవర్దన్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. గండిపేట్ నూతనంగా వచ్చిన తహసీల్దార్‌ను బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పిఎస్ కుమార్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండిపేటకు నూతన తహసీల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన గోవర్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిగామ నరసింహులు ఎమ్మార్వో ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం
నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఆర్టీసీ సమస్యలను విన్నవించేందుకు ఈ నెల 29న డయల్ యువర్ డీఎం కార్యక్రమనాన్ని నిర్వహిస్తున్నట్టు డీఎం అశోక్‌రాజు తెలిపారు. సాయంత్రం 3 గంటల నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ప్రయాణికులు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తమ సూచనలు చేసే వారు 9959226141నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



నీటీ సమస్య రాకుండా చూడాలి
- మేయర్ మహేందర్ గౌడ్
- జలమండలి అధికారులతో పర్యటన

నవతెలంగాణ-గండిపేట్

నీటి సమస్యను రాకుండా చర్యలు చేపట్టాలని మేహర్ మహేందర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ వార్డులో జలమండలి జీఎం రవీందర్ రెడ్డి కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న వార్డుల్లో కొత్త లైన్ వేయాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా చూసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు నీటి సమస్య ఉన్న కాలనీలో వార్డుల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ ముక్రం ఆలీ తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప శిక్షణ శిబిరం
నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయ సంకల్ప శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భట్టు కిషన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, మల్లెపల్లి జగన్, జవాహర్ లాల్ నాయక్, కేతావత్ హీరాసింగ్ నాయక్, కాన్గుల దశరథం, పవన్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఆమనగల్ కడ్తాల్ తలకొండపల్లి మండలాల అధ్యక్షులు మండ్లి రాములు, బిచ్యా నాయక్, దోకూరి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోతీలాల్ నాయక్, యూత్ కాంగ్రెస్, ఎస్ఎస్ యూఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి
- ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఇటికాల రమణారెడ్డి
- జర్నలిస్ట్ ఏలే నిరంజన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ బోటిక్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆమనగల్

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆమనగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఇటికాల రమణారెడ్డి అన్నారు. ఆమనగల్ పోలీస్ స్టేషన్ సమీపంలో పట్టణానికి చెందిన ఏలే వేదశ్రీ నిరంజన్ ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ కంప్యూటర్ బోటిక్ సెంటర్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్యాంసుందర్ తో కలిసి రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ స్వయం ఉపాధి మార్గాలతో ఆర్థిక స్వేచ్ఛ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు కోట కృష్ణయ్య, మామిడిశెట్టి రవి, పాత్రికేయులు మస్న ఆనంద్ కుమార్, మహమ్మద్ మాసూమ్, ఎం.డి.యూనుస్, శేఖర్, కోట్ల వెంకటేష్, జంతుక యాదయ్య, నాయకులు రూపం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత స్వయం ఉపాధితో ఎదగాలి
కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

నవతెలంగాణ-తలకొండపల్లి

మండల కేంద్రంలో నేటి యువత స్వయం ఉపాధితో ఎదగాలని కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలో లారీల ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి లారీల ఓనర్స్ కార్యాలయం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అందరూ కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం, లోడింగ్, అన్ లోడింగ్ లాభ నష్టాలు గురించి చర్చించుకోవడానికి, ఐక్యమత్యంగా ఉండి కంపెనీ యజమానులతో సామరస్యంగా తమ సమస్యలను, డిమాండ్లను న్యాయబద్ధంగా పరిష్కరించుకోవడానికి మీకంటూ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అదేవిదంగా మీకు ఏటువంటి సహాయ సహకారాలు కావాలన్న నా వంతుగా తప్పనిసరిగా సహకారం అందిస్తానని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ వెల్ఫర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గోవిందు, సైదులు, ఉపాధ్యక్షులు ఆయిల్ తిర్పతయ్య, కోశాధికారి లట్టుపల్లి రాందేవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ యూనుస్, కార్యదర్శి సుమన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజు, జంగయ్య గౌడ్, నిరంజన్, ఎండీ బాబా, ఐలేష్, శేఖర్, రమేష్, శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉద్యమ బాట

- ఎమ్మెల్సీ ఎన్నికల ముందు చేసిన వాగ్దానం మరిచిన ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా తరలిరానున్న ఉద్యోగులు
- ధర్నాలో సీఆర్‌పీలు, కేజీబీవీ, ఇతర ఉద్యోగుల కార్యాచరణ
- ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- టైం స్కేల్ ప్రకటించాలి, హెల్త్ కార్డులు జారీ చేయాలి
- మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలువులు ఇవ్వాలి

నేడు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

జిల్లా విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. ఏండ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారం కాకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానం లేకుండా ప్రతి ఒక్కరినీ రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్‌పీలు, అటు కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, పీటీఐలు, మెసెంజర్లు తదితర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారంపై సర్కారు దృష్టి సారించకపోవడంతో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. వీరు సమగ్ర శిక్ష అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గత జూన్ 14న ఎస్‌పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇదే తరహాలో జిల్లాలో సైతం ఆందోళనలు కొనసాగాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతులు అందజేశారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లభించలేదు. దాంతో వారు ఆందోళనలు పూనుకుంటున్నారు. అందులో భాగంగానే మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

నవతెలంగాణ-రంగారెడ్డిప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 700 మంది..

జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సుమారు 700 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత, రెగ్యూలరైజ్, ఆరోగ్య కార్డులు, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులతో పాటూ, ఇతర అంశాలపై సంవత్సరాలుగా ప్రభుత్వాలను వేడుకుంటూనే ఉన్నారు. జిల్లాలో 20 కేజీబీవీల్లో పని చేస్తున్న ఎస్‌ఓలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, మండల విద్యాధికారి కింద పని చేస్తే సీఆర్‌పీలు, విద్యాశాఖలో పని చేసే పీటీఐలు, కాంప్లేక్స్, మండల, జిల్లా స్థయిలో పని చేసే సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ ఉద్యమ బాటలో ఉన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ పాఠశాలలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు అనుసంధానంగా పని చేసేందుకు వీలుగా సీఆర్‌పీలను ప్రభుత్వం నియమించింది. పదేళ్ల క్రితం రాత పరీక్షల ద్వారా ప్రతీ మండలానికి కనీసం ఒక్కరు చొప్పున ఎంపిక చేసి ఎమ్మార్సీ కార్యాలయ పనులు, పాఠశాలల పర్యవేక్షణ పనులు అప్పగించారు. ఉపాధ్యాయులు కార్యాలయాల్లో పని చేసే విద్యార్థులు నష్టపోతారనే ఉద్దేశంతో 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను అత్యవసర పరిస్థితులు, ఎన్నికల విధులు, జనభా లెక్కల విధులకు మాత్రమే వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో 2011లో నూతన విధానం తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా టీటీసీ, బీఈడీ విద్యార్హతతో 2012లో రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి సమగ్ర శిక్ష కార్యక్రమం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో ముగ్గురు చొప్పున సీఆర్‌పీలను నియమించాల్సి ఉన్నప్పటికీ దాదాపుగా ఒక్కరినే నియమించారు. ప్రస్తుతం సీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సహాయంగా ఉంటూనే బడిబయట పిల్లల గుర్తింపు, 18నుంచి 25పాఠశాలల పర్యవేక్షణ, ఎస్‌ఎంసీ సమావేశాల నిర్వహణ, కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు, మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలన, సమగ్ర శిక్ష కార్య క్రమాల నిర్వహణ, ఎమ్మార్సీ కార్యాలయం, పాఠశాలల మధ్య అనుసంధానకర్త, విద్యార్థుల ఆధార్ నమోదు, ఎన్నికల విధులు, యూడైస్, చైల్డ్ ఇన్‌ఫోలో వివరాల నమోదు తదితర పనులు చేస్తున్నారు.



(ఫైల్)



(ఫైల్)

ఆందోళన బాటలో కేజీబీవీ ఉద్యోగులు...

కేజీబీవీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి టీచింగ్, నాన్ టీచింగ్ విభాగంలో పని చేస్తున్నప్పటికీ వీరికి ఉద్యోగ భద్రతలేదు. ఎప్పుడు ఏ అధికారికి, రాజకీయ నాయకుడికి కోపం వచ్చిన వీరి పదవి ఊడిపోవాల్సిందే. ప్రతి ఏడాది వీరి సర్వీస్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సిందే. ఉన్నతాధికారికి నచ్చకపోయినా వీరి రెన్యూవల్ బ్రేక్ పడినట్టే. ఇక అయా సందర్భాల్లో విధి నిర్వాహణపై వీరిపై చర్యలు తీసుకున్నా.. తరువాత విధుల్లోకి తీసుకుంటారన్న నమ్మకం లేదు.

భద్రత లేని ఉద్యోగాలు...

చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. టైంస్కేల్, రెగ్యూలర్, ఆరోగ్యభద్రత వీరి డిమాండ్లతో ప్రధానంగా ఉన్నాయి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు. హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం వీరికి కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భాగ సామ్యంతో వేతనాలు చెల్లిస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

సంవత్సరాల తరబడి విద్యాశాఖలో పని చేస్తున్న తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మరణించిన వారి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతున్నారు. డిమాండ్‌ల సాధనకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు పిలుపునిచ్చారు.

నెరవేరని సీఎం కేసీఆర్ హామీ..

ఉపాధ్యాయ ఎన్నికల సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన మేరకు న్యాయం జరుగుతుందని అందరూ ఎదురు చూశారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. 2021 జూన్ నుంచి పెంచిన వేతనాలు అమలు చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం మాత్రం వారికి అందడం లేదన్న నిరుత్సాహానికి గురవుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం నూతన విద్యావిధానాలు అమలు చేస్తోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీటవేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న, వీరి సమస్యలను పట్టించుకోవడం లేదు. ఏండ్ల తరబడి విధుల్లో ఉన్నా, ఉద్యోగ భద్రత లేకపోవడం వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన



జిల్లాలోని సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలి. ఇతర డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలి. పదేళ్లుగా సమస్యల మధ్య విధులు నిర్వర్తిస్తూ పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

అబ్దుల్ అజీజ్ సీఆర్‌పీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగం రెగ్యులర్ చేయాలి



పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అర్హతలు ఉన్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. వెంటనే సమగ్ర శిక్ష విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. తమ న్యాయమైన డిమాండ్‌లన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలి.

సంపత్, కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షులు

తెలుగు ప్రజల ఖ్యాతి ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీఆర్‌దే



- తెలుగుదేశం పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు
- ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల పట్ల హర్షం

నవతెలంగాణ-షాద్‌నగర్

తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీ రామారావు దేనని, ఆయన చరిత్రను భవిష్యత్ తరాలు తెలుసుకోవడం ఎంతైనా అవసరమని తెలుగుదేశం పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు అన్నారు. నందమూరి తారక రామారావు వంద రూపాయల నాణాన్ని కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని బి.వి.రావ్ నగర్ పౌల్ట్రీ వద్ద పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ ఒక తెలుగువాడిగా గొప్ప ఖ్యాతిని అందుకోవడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా వంద రూపాయల నాణాన్ని ఆయన పేరిట విడుదల చేసి జాతి యావత్తు గర్వపడేలా చేశారని కొనియాడారు. తెలంగాణ రాయలసీమ ఆంధ్ర మూడు ప్రాంతాల ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఏకైక వ్యక్తిగా స్వర్గీయ ఎన్టీఆర్‌కు పేరు ఉందని అన్నారు. తెలుగుజాతి గర్వపడేలా ఆయన అందుకున్న శిఖరాలను భావితరాలు ఎల్లకాలం గుర్తుపెట్టుకుంటారని అన్నారు. జాతి యావత్తు గర్వపడేలా వంద రూపాయల నాణాన్ని రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుజాతి వున్నంత వరకు ఎన్టీఆర్ చిరస్మరణీయుడిగా వుంటారని తెలిపారు. దేశంలో సంక్షేమ పథకాల అమలుకు ఆద్యులు ఎన్టీఆర్ అని అన్నారు. 1985లో ఆయన తిరుపతిలో నిత్య అన్నదానం సత్రాన్ని ప్రారంభించడం విశేషం అన్నారు. వికలాంగుల కోసం బర్డ్ సంస్థలు ఏర్పాటు చేయడం అదేవిధంగా జాతీయస్థాయిలో ఎన్టీఆర్ పేరిట సేవా ట్రస్టులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. పటేల్ పట్వారి వ్యవస్థను రూపుమాపి తెలంగాణలో ప్రజల జీవనానికి స్వేచ్ఛ కల్పించిన మహానుభావుడని అన్నారు. వృద్ధాప్య పింఛన్, పేదలకు పక్కాగృహాలు తదితర సంక్షేమ పథకాలను దేశంలోనే తొలిసారి ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పినపాక ప్రభాకర్ రావు, శ్రీను, కర్రేకోట రమేష్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
నవతెలంగాణ-ఆమనగల్



కడ్తాల్ మండల కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతనంగా తాలూకా గౌడ యువజన సంక్షేమ సంఘం కార్యదర్శిగా ఎన్నికైన కందికంటి రాజేందర్ గౌడ్‌ను గౌడ సంఘం నాయకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మాలె మల్లేష్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, యువజన మండల అధ్యక్షులు మాదారం మహేష్ గౌడ్, కేశవులు, జగదీష్, శ్రీరాములు, రమేష్, శ్రీను, శ్రీకాంత్, వెంకటయ్య, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రహదారులను శుభ్రపరచాలి
- శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ
- బండ్లగూడ కమిషనర్ శరత్ చంద్ర

నవతెలంగాణ-గండిపేట్



టిప్ కాన్ బ్రిడ్జి నుంచి పోలీస్ అకాడమీ (అప్ప జంక్షన్) వరకు ప్రధాన రహదారులను శుభ్రపరచాలని కమిషనర్ శరత్ చంద్ర మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ సానిటేషన్ తడి, పొడి చెత్త సేకరణలో భాగంగా రహదారుల పైన చెత్త చెదారాన్ని తొలగింపుపై అరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చెత్తచెదారం తొలగించి పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తను మున్సిపల్ వాహనంలోనే తరలించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటేషన్, సూపర్వైజర్, జవాన్లు రామాంజనేయులు ,లక్ష్మీనారాయణ ,రాజేష్, వెంకటేష్, మల్లేష్ ,రాము, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



రూపం వెంకట్ రెడ్డిని ఘనంగా సన్మానించిన గోలి, జడ్పీటీసీ
నవతెలంగాణ-ఆమనగల్



మండల రైతు విభాగం అధ్యక్షులు రూపం వెంకట్ రెడ్డి ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్డి సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆమనగల్ పట్టణంలో స్థానిక నాయకులతో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు నేనావత్ అనురాధ పత్య నాయక్ వేరు వేరుగా రూపం వెంకట్ రెడ్డిని పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో రాంనుంతల సర్పంచ్ సోనా శ్రీను నాయక్, ఎంపీటీసీ సభ్యులు సరిత పంతు నాయక్, ఆమనగల్ మార్కెట్ డైరెక్టర్ సురమళ్ల సుభాష్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, నాయకులు వడ్డెమోని శివకుమార్, చలిచీమల సతీష్, సుమన్ నాయక్, బన్నె శేఖర్, పవన్ నాయక్, తిరుపతి, వినోద్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఒకప్పుడు కేవలం పురుషులకే పరిమితమైన అనేక రంగాల్లో దూసుకెళుతున్నారు. ఇటీవలె చంద్రయాన్ 3లో శక్తిమేర శ్రమించి ఆ విజయంలో భాగస్వాములయ్యారు. ఎదురవుతున్న అడ్డంకులు దాటుకుంటూ తమ సత్తా చాటుకుంటున్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఆసరా చేసుకుని తామేంటో నిరూపించుకుంటున్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అలాగే క్రీడల్లోనూ నిలదొక్కుకుంటున్నారు. ఈ రోజు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా రంగంలో రాణిస్తున్న మన తెలంగాణ అమ్మాయిల గురించి తెలుసుకుందాం...



క్రీడల్లో రాణులు మన బిడ్డలు

జరీన్ నిఖత్... 1996 జూన్ 14న తెలంగాణలోని నిజామాబాద్‌లో ఎండి జమీల్ అహ్మద్, పర్వీన్ సుల్తానా దంపతులకు జన్మించింది. 13 ఏండ్ల వయసులో బాక్సింగ్ ప్రారంభించింది. ఈమెకు తండ్రి పూర్తి సహకారం అందించారు. మేరీకోమ్‌ను స్ఫూర్తి ప్రదాతగా భావించేది. హైదరాబాద్‌లోని ఏవీ డిగ్రీ కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో జలంధర్‌లో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో ఆమె బెస్ట్ బాక్సర్ ఛాంపియన్ షిప్ సాధించింది. 2009లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐవీ రావు ఆధ్వర్యంలో వైజాగ్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందేందుకు ఈమెకు అవకాశం లభించింది. 2010లో ఈరోడ్‌లో జరిగిన నేషనల్స్‌లో 'గోల్డెన్ బెస్ట్ బాక్సర్‌గా' గుర్తింపు తెచ్చుకుంది.

2010లో నేషనల్ సబ్ జూనియర్ మీట్‌లో జరీన్ తొలి బంగారు పతకాన్ని గెలుచుకుంది. 2011 టర్కీలో జరిగిన మహిళల జూనియర్, యూత్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో, ఫ్లై వెయిట్ విభాగంలో తొలి అంతర్జాతీయ బంగారు పతకాన్ని సాధిం చింది. టర్కిష్ బాక్సర్ ఉల్కు డెమిర్‌తో పోరాడి మూడు రౌండ్ల తరువాత 27:16 తేడాతో ఆమెపై గెలిచింది. 2014లో సెర్బియా లోని నోవి సాడ్‌లో జరిగిన మూడవ నేషన్స్ కప్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించింది. 51 కిలోల విభాగంలో రష్యాకు చెందిన పాల్ట్సేవా ఎకాటెరినాను ఓడించింది. అలాగే 2015లో అస్సాంలో జరిగిన 16వ సీనియర్ ఉమెన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధిచింది. కొన్నేండ్ల విరామం తర్వాత 2019లో బ్యాంకాక్లో జరిగిన థాయిలాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో రజతం సాధించి మరో అంతర్జాతీయ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.



శ్రీజ ఆకుల... మన రాష్ట్రానికి చెందిన ప్రఖ్యాత టేబుల్ టెన్నిస్ క్రీడా కారిణి. ఈమె 2022 ఏప్రిల్‌లో జరిగిన 83వ సీనియర్ జాతీ య, అంత ర్రాష్ట్రీయ టేబుల్ టెన్నిస్ పోటీల లో మహిళల సింగిల్స్, మహిళల డబుల్స్‌లో విజేతగా నిలిచింది. అదే ఏడాదిలో జరి గిన కామన్వెల్త్ క్రీడలలో ఆచంట శరత్ కమల్తో మిక్స్ డ్ డబుల్స్‌లో స్వర్ణాన్ని సాధించింది. హైదరాబాద్ క్రీడాకారులు టేబుల్ టెన్నిస్‌లో జాతీయ ఛాంపియన్‌గా అవతరించి ఆరు దశాబ్దాలు అవుతుంది. మీర్ ఖాసింఅలీ 1964లో మొదటి సారిగా జాతీయ టైటిల్‌ను గెలుచుకున్నాడు. అప్పటి నుండి అతను ఒక్కడే. 58 ఏండ్ల తర్వాత మరో హైదరాబాదీ జాతీయ ఛాంపియన్‌గా అవతరించింది. 23 ఏండ్ల ఆకుల శ్రీజ మౌమా దాస్‌ను ఓడించి మహిళల టైటిల్‌ను గెలుచుకుంది. తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాల నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక మహిళగా చరిత్రలో ఆమె పేరు నిలిచిపోయింది. కోచ్ సోమనాథ్ ఘోష్‌తో కలిసి పదేండ్లపాటు కష్టపడి పనిచేసిన శ్రీజ తన విజయాన్ని తన కోచ్‌లకు అంకితం చేసింది.



గొంగడి త్రిష... భద్రాచలం ప్రాంతానికి చెందిన ఈ 17 ఏళ్ల అమ్మాయి అండర్ -19 టీ20 వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. బ్యాటింగ్‌తో పాటు అవసరమైన సందర్భాల్లో బౌలింగ్‌లోనూ రాణించి టీమిండియా వరల్డ్‌కప్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 24 పరుగులు చేసి టాప్‌స్కోరర్‌గా నిలిచింది. లక్ష్యం తేలికే అయినా ఓపెనర్లు త్వరగా ఔట్ కావడం, దీనికి తోడు విపరీతమైన ఒత్తిడి మధ్య పిచ్‌ను అర్థం చేసుకుని, పరిస్థితులకు తగినట్లుగా నిలకడగా ఆడి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ పోటీలో తుదికంటా క్రీజులో ఉండి జట్టును విజయతీరాలకు చేర్చింది. అంతకుముందు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన ఇంగ్లండ్ కెప్టెన్‌ను చురుకైన క్యాచ్‌తో ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఈ టోర్నీలో మొత్తం 7 మ్యాచ్‌ల్లో 116 పరుగులు చేసింది త్రిష. అందులో స్కాట్లాండ్‌పై మెరుపు అర్ధశతకమూ ఉంది. కాగా టీమిండియా ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంలో కీ రోల్ పోషించిన త్రిషపై అందరి నుండి ప్రశంసలు అందుకుంది. రోజూ తండ్రితో కలిసి జిమ్‌కు వెళ్లేది త్రిష. అక్కడే క్రికెట్ ప్రాక్టీస్ చేసేదట. గొంగడి రామిరెడ్డి స్వతహాగా హాకీ క్రీడాకారుడు. అయితే కొన్ని కారణాలతో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న ఆయన కల సాకారం కాలేదు. అందుకే కూతురు రూపంలో తన కలను నెరవేర్చుకోవాలనుకున్నాడు. కూతురుకు మెరుగైన క్రికెట్ శిక్షణను అందించాలని కుటుంబ సభ్యులతో కలిసి సికింద్రాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాడు. ఇందుకోసం భద్రాచలంలో తన పేరిట ఉన్న జిమ్‌ను సగం ధరకు అమ్మేశాడు. ఇక ట్రైనింగ్ ఖర్చులకోసం భూమిని కూడా అమ్ముకున్నాడు. తన కోసం హైదరాబాద్‌కు వచ్చిన తల్లిదండ్రుల త్యాగాన్ని త్రిష వృథా చేయకూడదనుకుంది. తన వంతు కష్టపడింది.



గూగులోత్ మమత... నిజామాబాద్‌కు చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి. కోచ్ డాక్టర్ కృష్ణ ప్రత్యేక శిక్షణలో 23 సెప్టెంబర్ నుండి 08 అక్టోబర్ 2023 వరకు చైనాలో జరగనున్న ఏషియన్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపి యన్షిప్ పోటీ లకు ఎంపి కయ్యింది. 2016 నుండి సాఫ్ట్‌బాల్ జాతీయ క్రీడలో పాల్గొంటుంది. ఇప్పటి వరకు 20 సార్లు జాతీయ పోటీలలో పాల్గొని పలుమార్లు ఉత్తమ క్యాచర్‌గా ప్రత్యేక బహు మతిని అందుకొని జట్టు విజ యానికి కృషి చేసింది. నిజామాబాద్ జిల్లా సుద్ద పల్లిలోని సాంఘిక సంక్షేమ స్పోర్ట్స్ అకాడమీలో నీరజ రెడ్డి ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ క్రీడలో స్పెషల్ ట్రైనింగ్ తీసుకుంది. మమత గత 8 ఏండ్లుగా జాతీయస్థాయిలో క్రీడా కారిణిగా రాణిస్తోంది. వివిధ కేటగిరీల్లో ఇప్పటి వరకు మొత్తం 18 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సొంతం చేసుకుంది. అదే విధంగా ఉత్తమ క్యాచర్‌గా అవార్డులను దక్కించుకుంది. 2022 గుజరాత్‌లో జరిగిన 36వ నేషనల్ గేమ్స్‌లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచింది. చైనాలో జరిగిన జూనియర్ ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో భారత జట్టు తరపున పాల్గొంది. ప్రస్తుతం భువనగిరి సాంఘిక సంక్షేమ ఆర్మీ ఫోర్స్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలలో బి.ఏ చదువుతుంది.



బుద్ధా అరుణా రెడ్డి... ప్రముఖ జిమ్నాస్టర్ క్రీడాకారిణి. 2018 మెల్బోర్న్లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీలో భారతదేశం తరపున మొదటి సారిగా కాంస్య పతకం గెలుచు కొని చరిత్ర సృష్టించింది. ఈమె 1995, డిసెంబర్ 25న సుభద్ర, నారాయణ రెడ్డి దంపతులకు హైద్రాబాద్లో జన్మించారు. తండ్రి వృత్తి రీత్యా అకౌంటెంట్. తల్లి గృహిణి. తన ఇంటర్ విద్యని 2013లో బషీర్‌బాగ్‌లోని సెయిట్ మేరీస్ జూనియర్ కాలేజీలో పూర్తి చేసింది. ఇదే కాలేజ్‌లో తన డిగ్రీ విద్యను కూడా పూర్తీ చేసింది. తండ్రి అరుణను ఐదేండ్ల వయసులోనే కరాటేలో చేర్పించాడు. అందులో ప్రతిభ చాటిన తను రెండేండ్ల లోపే బ్లాక్‌బెల్ట్ సాధించింది. అయితే అరుణ శరీరం జిమ్నాస్టిక్స్‌కు సరిపో తుందన్న సలహా మేరకు తర్వాత అందులో చేర్చాడు తండ్రి. నిజానికి మొదట్లో జిమ్నాస్టిక్స్ అంటే అంత ఆసక్తి లేకున్నా తండ్రి మాట ప్రకారం అందులోనే సాధన చేసింది. వయసు పెరిగే కొద్దీ ఆటపై ఆసక్తి పెరిగి పదేండ్ల వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా కనబరిచి 12 ఏండ్ల వయసులోనే 2007 జాతీయ క్రీడల్లో వాల్ట్ విభాగంలో పతకం గెలిచుకొని తన సత్తాను నిరూపించుకుంది.2013, 2014, 2017లో ప్రపంచ జిమ్నాస్టిక్ పోటీలో పాల్గొంది. అయితే ఈ పోటీలో అరుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2018లో నిర్వహించిన ప్రపంచ జిమ్నాస్టిక్ పోటీలో భారతదేశం తరపున పాల్గొని కాంస్య పతకం సాధించి ఈ పోటీలో గెలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది.



అగసర నందిని... నందిని నాలుగేండ్ల క్రితమే అథ్లెటిక్స్‌లో శిక్షణ ప్రారంభించింది. ఏప్రిల్ 2018లో గచ్చిబౌలి స్టేడియంలో ప్రాక్టీస్ కోసం వెళ్లినప్పుడు అసిస్టెంట్ కోచ్‌లలో ఒకరు ఆమె ప్రదర్శనకు ముగ్ధులయ్యారు. అతను ఆమెను ప్రధాన కోచ్ నాగపురి రమేష్ వద్దకు తీసుకెళ్లాడు. అతను వెంటనే ఆమెను తన అకాడమీలో చేరమని అడిగాడు. అథ్లెటిక్స్- హర్డిల్స్, లాంగ్ జంప్‌లలో ఆమె ప్రయాణం ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి ఏటా 10-12 పతకాలు సాధిస్తూనే ఉంది. అకాడమీలో చేరిన మూడు నెలల్లోనే తొలి జాతీయ పతకం సాధించింది నందిని. ఆమె ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికవ్వ డమే కాకుండా 75శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది.

సాంఘిక సంక్షేమ పాఠశాలలో చేరక ముందు నందిని కేంద్రీయ విద్యాలయంలో చదువుకునేది. ఆమె తండ్రి టీ దుకాణం నడిపేవాడు. తల్లి గృహిణి. ఆ రోజుల్లో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. సాంఘిక సంక్షేమ పాఠశాలకు మారిన తర్వాత ఆమెకు మంచి ప్రోత్సాహం లభించింది. "నా తల్లిదండ్రులు పెద్దగా చదువుకోలేదు. అందుకే మొదట్లో నా ప్రపంచ ఛాంపియన్‌షిప్ గురించి వారు అర్థం చేసుకోలేకపోయారు. తర్వాత దీని గురించి నా అన్నలు వారికి వివరించి, సంతోషించారు" అని నందిని చెప్పింది. జూనియర్ వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నందినికి ఇది రెండోసారి.



ఇషా సింగ్... హైదరాబాద్‌కు చెందిన షూటర్. సచిన్ ర్యాలీ డ్రైవర్. షూటింగ్ కన్నా ముందు ఇషాకు గో కార్టింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్, స్కేటింగ్‌లో క్రీడల్లో కూడా ప్రవేశం ఉంది. గచ్చిబౌలీ స్టేడియంలోని షూటింగ్ రేంజ్‌ను చూసిన తర్వాత షూటింగ్ పట్ల ఎక్కడ లేని ఆసక్తిని ప్రదర్శించిన ఆమె దాన్నే కెరియర్‌గా ఎంచుకుంది. స్టేడియంకి వెళ్లాలంటే గంటల కొద్దీ ప్రయాణం చెయ్యాలి. మరో దారి లేకపోవడంతో రైల్లో వెళ్ళేది. అయితే ఇంటి వద్ద ప్రాక్టీస్ కోసం ఆమె తండ్రి పేపర్ టార్గెట్ రేంజ్‌ను సిద్ధం చేశాడు. ఆ తర్వాత ఆమె మహారాష్ట్రలోని పూణెలో ఒలింపిక్ మాజీ విజేత గగన్ నారంగ్ నిర్వహిస్తున్న గ్లోరీ అకాడమీకి శిక్షణ కోసం వెళ్ళింది. బిడ్డ వెన్నంటి ఉంటూ ప్రోత్సహిస్తున్న ఆమె తండ్రి మోటార్ స్పోర్ట్స్ దుకాణాన్ని నడుపుతున్నాడు. తండ్రి, కూతుళ్లు ఇద్దరూ పోటీల కోసం వెళ్లినప్పుడు క్రీడా సామాగ్రి దుకాణాన్ని తల్లి శ్రీలత చూసుకుంటుంది. దేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే 18 ఏండ్లలోపు పిల్లలకు ఇచ్చే అత్యుత్తమ పుర స్కారం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను కూడా ఇషా అందుకుంది. 2014లో షూటింగ్ కెరియర్‌ను ప్రారంభిం చిన ఇషా కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌గా నిలి చింది. అయితే జాతీయ స్థాయిలో మాత్రం రాణిం చేందుకు మరో మూడేండ్లు పట్టింది. కేరళలోని తిరువ నంతపురంలో జరిగిన 62వ జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కామన్ వెల్త్ గేమ్స్, యూత్ ఒలంపిక్స్‌లో స్వర్ణ పతక విజేత మను భకర్, షూటర్ హీనా సిద్ధు కన్నా మెరుగైన ప్రదర్శన చేసి స్వర్ణపతకం సాధించింది. అలా 13 ఏండ్ల వయసులోనే సీనియర్ విభాగంలో ఛాంపియన్‌గా నిలిచింది. అటు జూనియర్ ఇటు సీనియర్ విభాగంలో మొత్తం ఐదు పతకాలు పొందింది. ఆ ప్రదర్శనతో మరింత కష్టబడితే దేశానికి పతకాలు సాధించగలనన్న విశ్వాసం ఆమెలో ఏర్పడింది.

రాష్ట్రపతి చేతుల మీదుగా ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల

(మొదటిపేజి తరువాయి)

వ్యక్తం చేశారని ఆమె పేర్కొన్నారు. 'మనుషులంతా ఒక్కటే' అంటే మనుషులంతా సమానమే అనే సినిమాతో సామాజిక న్యాయం, సమానత్వమనే సందేశాన్ని వినిపించారు. ప్రజాసేవకుడిగా, నాయకుడిగా ఎన్టీఆర్‌కు ఉన్న ఆదరణ అంతే స్థాయిలో ఉందని రాష్ట్రపతి అన్నారు. ఆయన తన అసాధారణ వ్యక్తిత్వం, కృషితో దేశ రాజకీయాల్లో అద్వితీయమైన అధ్యాయాన్ని సృష్టించారు. ఆయన ప్రారంభించిన అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం తీసుకొచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖను రాష్ట్రపతి అభినందించారు. ఆయన అద్వితీయమైన వ్యక్తిత్వం ప్రజల హృదయాల్లో, ముఖ్యంగా తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పుడూ ముద్రితమై ఉంటుందని ఆమె అన్నారు. ఎన్టీఆర్ తెలుగు సినిమాలతో భారతీయ సినిమా, సంస్కృతిని సుసంపన్నం చేశారన్నారు. ఆయన తన నటనతో రామాయణం, మహాభారతాలలోని ప్రముఖ పాత్రలకు ప్రాణం పోశారు. ఆయన పోషించిన రాముడు, కృష్ణుడు పాత్రలు ఎంత సజీవంగా మారాయంటే జనాలు ఎన్టీఆర్‌ను ఆరాధించడం మొదలుపెట్టారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపీలు రఘురామ కృష్ణరాజు, కనకమేడల రవీంద్ర కుమార్, గల్లా జయదేవ్, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు హాజరయ్యారు. యువగళం పాదయాత్రలో ఉన్నందున లోకేష్, అలాగే ఇతర కారణాలతో ఆయన భార్యా బ్రహ్మణి, సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ తదితరులు గైర్హాజరు అయ్యారు.

ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నాణెం

స్వర్గీయ ఎన్‌టి రామారావు స్మారక నాణెం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ విఎన్ఆర్ నాయుడు ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేసిన ఎన్టీఆర్ స్మారక నాణెం హైదరాబాదులోని మింట్ కార్యాలయంలో కూడా దొరుకుతుందన్నారు. ఎన్టీఆర్ స్మారక నాణేం 12 వేల కాయిన్స్ ఇప్పటి వరకు ముద్రణ వేశామని చెప్పారు. రూ.100 నాణేంలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారుచేసినట్టు వెల్లడించారు. రూ.100 తయారు చేసేందుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందన్నారు. హైదరాబాద్ మింట్‌లో మొదటిసారిగా ఎన్టీఆర్ స్మారక నాణాన్ని తయారు చేసినట్టు విఎన్ఆర్ నాయుడు తెలిపారు.

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణ

- దరఖాస్తుల స్వీకరణకు విస్తృత ప్రచారం నిర్వహించాలి
- కారుణ్య నియామకాలను చేపట్టాలి: కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన మేరకు జీఓనెంబర్ 84ను విడుదల చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన విచారించి క్రమబద్ధీకరణ చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆమె ఆదేశించారు. జీఓ నెంబర్ 59 కింద ఇప్పటికే నోటీసులు అందుకున్న వారి నుంచి రెగ్యులరైజేషన్‌కు నిర్ణయించిన మొత్తాన్ని జమ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చేనెల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాల పురోగతిని సీఎస్ సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలు, తెలంగాణకు హరితహారం, దశాబ్ది సంపద వనాలు, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళిత బంధు, భూ పట్టాల పంపిణీ, సామాజిక భద్రతా పెన్షన్లు, కారుణ్య నియామకాలు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై కలెక్టర్లతో ఆమె సమీక్షించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఇటీవల చేపట్టిన కోటి మొక్కల నాటే కార్యక్రమంలో లక్ష్యానికి మించి మొక్కలను నాటామని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులపైనా వివక్షే

- వారి త్యాగాలు ప్రజలకు తెలియాలి
- కార్పొరేట్ మీడియా వాస్తవాలు దాచేస్తోంది
- 'ఆఖరి యోధులు' పుస్తకావిష్కరణలో పాలగుమ్మి సాయినాథ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులపైనా చరిత్ర వివక్షనే ప్రదర్శించిందని మెగసెసే అవార్డు గ్రహీత, ప్రముఖ జర్నలిస్ట్ పాలగుమ్మి సాయినాథ్ అభిప్రాయపడ్డారు. గ్రామ, తండా, పట్టణ స్థాయిల్లో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా స్థానిక పోరాటాలు చేసిన యోధుల జీవిత చరిత్రల్ని ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవన్నారు. పాలగుమ్మి సాయినాథ్ ఆంగ్లంలో 'లాస్ట్ హీరోస్' శీర్షికతో రాసిన పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ 'ఆఖరి యోధులు' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని సోమవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆవిష్కరించి, తొలి ప్రతిని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మికి అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండేండ్ల క్రితం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో రూ.110 కోట్లను కేటాయించిందని తెలిపారు. అదే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిందనీ, దానిలో స్వాతంత్ర్య పోరాట యోధుల కథలు, ఫోటోలు, ఫీచర్లు వంటివి ఏవీ లేవన్నారు. కేవలం ఆ వెబ్‌సైట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ విభిన్న వేషాల్లో ఉన్న ఫోటోలు మాత్రమే ఉన్నాయని ఆక్షేపించారు. ప్రస్తుతం బ్రతికున్న స్వాతంత్ర్య పోరాట యోధుల ఫోటోలు సైతం ఆ వెబ్‌సైట్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. మరో ఐదేండ్లు దాటితే ఆనాటి యోధులు ఎవరూ బ్రతికుండే అవకాశం కూడా లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటం అనగానే గాంధీ, నెహ్రూ, పటేల్, భగత్‌సింగ్ వంటి కొందరి పేర్లు మాత్రమే ప్రముఖంగా వినిపిస్తున్నాయనీ, ఇప్పుడు ఆ చరిత్రల్ని కూడా మరుగున పడేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యపోరాటం అసలు దేనికోసం జరిగిందనే మౌలిక ప్రశ్నతో కూడిన త్యాగాల వివరాలేవీ పాఠ్యాంశాల్లో లేవని విశ్లేషించారు. బ్రిటీష్ పాలనను ప్రజలు ఎందుకు వ్యతిరేకించారో భవిష్యత్ తరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విషయాల్ని ప్రజా బాహుళ్యంలో ప్రచారం చేయాల్సిన మీడియా కార్పొరేట్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందనీ, అదానీ, అంబానీలు వాటిని స్వాధీనం చేసుకుని, 'విశ్వగురు' ఏది చెప్తే అదే నిజమని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కెప్టెన్ భావ్, మల్లు స్వరాజ్యం, ఎస్ శంకరయ్య వంటి అనేకమంది సమరయోధులు క్షేత్రస్థాయిలో రైతులు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పోరాటాలు చేస్తూ, నాయకుల్ని తయారు చేశారని చెప్పారు.

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు అందర్నీ ఒకేరకంగా గుర్తించట్లేదని అన్నారు. ప్రజా సమరయోధుల్ని ప్రజలే గుర్తుంచుకొని, కాపాడుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఆవిర్భవించిన చిన్న ఉద్యమాలే ఆ తర్వాత మహోద్యమాలుగా నిర్మాణమయ్యాయని ఉదహరించారు. భిన్న రూపాల్లో పోరాటాలు జరిగినా బ్రిటీష్ వలసవాద పాలన వారందర్నీ ఏకం చేసిందని విశ్లేషించారు. ఇప్పుడూ ప్రతి గ్రామంలోనూ కులవివక్ష, ఆత్మగౌరవం, గృహహింస, దురహంకారానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు కనిపిస్తాయనీ, వాటన్నింటినీ సమ్మిళితం చేస్తూ మహోద్యమాల నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని పాలకులు, ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు జాతీయోద్యమాన్ని వక్రీకరిస్తున్నాయనీ, గాంధీ, నెహ్రూల పాత్రే లేదని వాదించేవారు ఇక సామాన్య ప్రజల పాత్రను ఎలా అంగీకరించే పరిస్థితులు లేవనీ, పైగా సావర్కార్ వంటి లొంగుబాటుదారుడి పాత్రను గొప్పగా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చరిత్రను తిరగరాయడం సాధ్యం కాక, అసలు చరిత్రనే చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ ప్రజాపోరాటాల చరిత్రల్ని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉన్నదని అన్నారు. అనువాదకులు ఎస్ వినయకుమార్ 'ఆఖరి యోధులు' పుస్తక పరిచయం చేశారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కే ఆనందాచారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆర్ వాసు ఆహూతుల్ని ఆహ్వానించారు. మేనేజర్ డీ కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు.

ఇండియా కుటమిలోకి మరికొన్ని పార్టీలు..!

(మొదటిపేజి తరువాయి)

సైతం పలు రాజకీయ పార్టీలతో చర్చలు సాగిస్తున్నట్టు తెలుస్తున్నది. కొత్త భాగస్వాములను చేర్చుకోవడంపై రాహుల్ గాంధీతో ప్రాథమిక చర్చలు జరిగినట్టు సమాచారం.

ముంబయి ఎజెండా..

ఇండియా కూటమి ముంబయి సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్టు చెబుతున్నారు. ఈ సమావేశంలో చిహ్నం (లోగో), రాష్ట్రాల వారీగా ఎన్నికల సర్దుబాట్లు, పొత్తులు, అవగాహనలు సహా పలు వ్యూహాత్మక, కీలక అంశాల మీద అవగాహనకు రానున్నాయి. కూటమికి సమన్వయ కమిటీ నియామకం, కన్వీనర్ ఎన్నిక కూడా జరగనుంది. ఆయా పార్టీలకు చెందిన అగ్రనేతలు దేశంలోని వివిధ ప్రధాన ప్రాంతాల్లో సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించడంపై కూడా సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. 11 మంది సభ్యులతో కమిటీగా ఏర్పడి, గాంధీ జయంతి (అక్టోబర్ 2) తరువాత దేశవ్యాప్తంగా సంయుక్త ప్రతిపక్ష పార్టీల ర్యాలీలను గణనీయంగా నిర్వహించనున్నారు.

కన్వీనర్ ఎవరు?

ముంబాయి సమావేశంలో 'ఇండియా' కూటమి కన్వీనర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశంపై కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కన్వీనర్ బాధ్యత జేడీయూ చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు అప్పగించే అవకాశాలున్నాయని బలంగా వినిపిస్తుండగా, తాను ఏ పదవి కోరుకోవడం లేదని నితీష్ సోమవారం ప్రకటించారు. వేరే నేతకు ఆ బాధ్యత అప్పగించాలని కూడా సూచించారు. 'ఇండియా' కూటమి భవిష్యత్ వ్యూహంపై చర్చించేందుకే తామంతా ముంబయిలో సమావేశమవుతున్నట్టు చెప్పారు. ముంబాయి సమావేశంలో మరికొన్ని పార్టీలు కూడా చేరే అవకాశం ఉందని ఇప్పటికే నితీష్ వెల్లడించారు.

అయితే ఆ పార్టీల పేర్లు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. కాగా, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ 1977లో తీసుకువచ్చిన రివల్యూషన్ తరువాతే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని బీహార్ బీజేపీ చీఫ్ సమ్రాట్ చౌదరి చేసిన వ్యాఖ్యలపై నితీష్ స్పందిస్తూ, భారతదేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో ప్రతి ఒక్కరికీ తెలుసునని, స్వాతంత్ర్యం వచ్చిన రోజు తెలియకపోవడం చట్టవిరుద్ధమని అన్నారు. బీజేపీ నేతలు ఏమి మాట్లాడారనే విషయాన్ని తాను పట్టించుకోనని అన్నారు.

ప్రమాదాన్ని తప్పించుకున్న 'ప్రజ్ఞాన్'

(మొదటిపేజి తరువాయి)

రెండో ఫొటోలో రోవర్ పయనించిన కొత్త మార్గం కన్పిస్తోంది. ఇదిలావుండగా సూర్యునిపై ప్రయోగాల కోసం సెప్టెంబర్ 2వ తేదీన 'ఆదిత్య ఎల్1'ను ప్రయోగించేందుకు ఇస్రో అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 11.50 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఈ ప్రయోగం జరుగుతుంది.

కాశ్మీర్ అధ్యాపకుడిని ఎందుకు సస్పెండ్ చేశారు?

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వాదనలు విన్పించిన ఓ అధ్యాపకుడిని జమ్మూకాశ్మీర్ విద్యా శాఖ సస్పెండ్ చేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆయనను ఎందుకు సస్పెండ్ చేయాల్సి వచ్చిందో చెప్పాలని కేంద్రాన్ని నిలదీసింది. జమ్మూకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి హోదాను రద్దు చేస్తూ దాఖలైన పిటిషన్లకు సంబంధించి రాజకీయ శాస్త్ర సీనియర్ లెక్చరర్ అయిన జహూర్ అహ్మద్ భట్ స్వయంగా సుప్రీంకోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. ఇది జరిగిన నాలుగు రోజులకే భట్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలలో భట్‌ను 'అపరాధి అయిన అధికారి'గా విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి అలోక్ కుమార్ అభివర్ణించారు. భట్ సర్వీసు నిబంధనలను ఉల్లంఘించారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుపై దాఖలైన పిటిషన్లపై విచారణను ప్రారంభించిన సందర్భంగా సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్‌లు భట్ సస్పెన్షన్ ఉత్తర్వులను కోర్టు దృష్టికి తెచ్చారు. సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు భట్ రెండు రోజులు సెలవు తీసుకున్నారని, ఆయన తిరిగి రాగానే సస్పెండ్ చేశారని సిబల్ తెలిపారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ భట్ సస్పెన్షన్‌కు వేరే కారణాలు కూడా ఉన్నాయని, ఆయన ఇతర కోర్టులకు కూడా వివిధ అంశాలపై హాజరయ్యారని, ఆ వివరాలు కోర్టు ముందు ఉంచుతామని చెప్పారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా వాదనలు వినిపిస్తే తప్పేంటని, అసలు ఏం జరుగుతోందని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణిని, తుషార్ మెహతాను ప్రశ్నించారు.

మణిపూర్‌లో ఆగని హింస

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ చల్లారడం లేదు. రాజధాని ఇంఫాల్‌లో ఆదివారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో మూడు ఇళ్లకు దుండగులు నిప్పు పెట్టారు. సెక్యూరిటీ సిబ్బంది నుండి ఆయుధాలు అపహరించారు. ఆ ఇళ్లలో ప్రస్తుతం ఎవరూ నివసించకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇళ్లు తగలబడి పోతున్న దృశ్యాలు చూసి స్థానికులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆ ప్రాంతంలో వెంటనే రాష్ట్ర, కేంద్ర దళాలను మోహరించాలని డిమాండ్ చేశారు. ప్రజలను చెదరగొట్టేందుకు భద్రతా దళాలు భాష్పవాయు గోళాలను ప్రయోగించాయి.



మరో ఘటనలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ కె.రాజో ఇంటికి కాపలా కాస్తున్న భద్రతా సిబ్బంది నుండి గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఆయుధాలు అపహరించారు. ఇంఫాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సగోల్‌బంద్ బిజోయ్ గోవింద ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ ఆయుధాలలో రెండు ఏకే సిరీస్ తుపాకులు, ఒక కార్బైన్ ఉన్నాయి. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని అధికారులు తెలిపారు. నిందితులను పట్టుకొని, ఆయుధాలను స్వాధీనం చేసుకొనేందుకు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు. తాజా ఘటనలపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మేఘచంద్ర స్పందిస్తూ ఘర్షణలు ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకూ హింసాకాండ చల్లారలేదని చెప్పారు.

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి రెండు రోజుల ముందు రాజధాని ఇంఫాల్‌లో ఈ ఘటనలు జరిగాయని గుర్తు చేస్తూ ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఈ సంఘటనలు నిరూపించాయని ఆయన అన్నారు.

ఒకే ఒక్కడు

నీరజ్ చోప్రా మైదానంలోకి అడుగుపెట్టాడు. నీరజ్ చోప్రా ఈటను విసిరాడు. నీరజ్ చోప్రా విజేతగా నిలిచాడు. చరిత్ర పునరావృతం. ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా.. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్స్ చాంపియన్‌గా అవతరించాడు. 2022 వరల్డ్ అథ్లెటిక్స్‌లో రజతం సాధించిన నీరజ్.. ఈసారి బుడాపెస్ట్‌లో బంగారు పతకం అందుకున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించిన భారత తొలి అథ్లెట్‌గా నీరజ్ చోప్రా చరిత్ర నెలకొల్పాడు.

- ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా
- జావెలిన్ త్రోలో పసిడి పతకం సొంతం
- చరిత్ర సృష్టించిన భారత సూపర్‌స్టార్



నవతెలంగాణ-బుడాపెస్ట్

మన నీరజ్ చోప్రా సాధించాడు. నాలుగు దశాబ్దాలుగా భారత్‌కు అందని ద్రాక్షగా మిగిలిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ బంగారు పతకాన్ని బల్లెం వీరుడు నీరజ్ చోప్రా అద్భుత ప్రదర్శనతో అందించాడు. అజర్‌బైజాన్‌లోని బుడాపెస్ట్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా.. 88.17 మీటర్లతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ఇది మూడో మెడల్ కాగా.. నీరజ్ చోప్రాకు ఇది రెండోది కావటం విశేషం. నీరజ్ చోప్రాతో పాటు ఫైనల్లో పోటీపడిన మరో ఇద్దరు భారత జావెలియన్ త్రో అథ్లెట్లు కిశోర్ జెనె, డిపి మనులు వరుసగా 5, 6 స్థానాల్లో నిలిచారు. టోక్యో ఒలింపిక్స్‌లో చారిత్రక పసిడి సాధించి ఒలింపిక్ చాంపియన్‌గా చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా.. ఇప్పుడు బుడాపెస్ట్‌లో బంగారు పతకం నెగ్గి ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. ఇక ఆదివారం జరిగిన మరో రెండు ఈవెంట్లలో సైతం భారత అథ్లెట్లు ఆకట్టుకున్నారు. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో పారుల్ చౌదరి 9:15.31 సెకండ్లలో రేసు ముగించి 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. మెన్స్ 4 (400) రిలే రేసులో అనాస్, అమోజ్, రాజేశ్, రమేశ్‌లు 2:59.92 సెకండ్లలో రేసు పూర్తి చేసి ఐదో స్థానంలో నిలిచారు. అమెరికా పసిడి నెగ్గగా.. ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్ రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నాయి.

రెండో ప్రయత్నంలోనే..

అర్హత రౌండ్‌లో ఏకైక త్రోతోనే ఫైనల్స్‌కు అర్హతతో పాటు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ బుక్ చేసుకున్న నీరజ్ చోప్రా.. పతక వేటలో రెండో ప్రయత్నంలో పసిడి ఖాయం చేసుకున్నాడు. క్వాలిఫయింగ్‌లో 88.77 మీటర్లతో సీజన్ ఉత్తమ ప్రదర్శన చేసినా.. పతక పోరులో కాస్త జోరు తగ్గాడు. కానీ ఇతర జావెలియన్ త్రోయర్లు ఎవరూ నీరజ్‌కు దరిదాపుల్లోనూ లేరు. తొలి ప్రయత్నంలో సాంకేతికంగా ఫౌల్‌గా నిలిచిన నీరజ్ చోప్రా.. ఒత్తిడిలో కనిపించాడు. కానీ రెండో ప్రయత్నంలో ఏకంగా 88.17 మీటర్ల దూరం విసిరి విజయ సంబురాలు చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్ తరహాలోనే బల్లెం గాల్లో ఉండగానే నీరజ్ చోప్రా పసిడి ఖాయమైనట్టు గర్జించాడు. అత్యుత్తమ త్రో అదేనని అర్థమైందని నీరజ్ వెల్లడించాడు. ఆ తర్వాతి ప్రయత్నాల్లో వరుసగా 86.32 మీటర్లు, 84.64 మీటర్లు, 87.73 మీటర్లు, 83.98 మీటర్ల దూరం విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ 87.82 మీటర్లతో సిల్వర్ మెడల్ సాధించగా.. చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్ 86.67 మీటర్లతో కాంస్య పతకం దక్కించుకున్నాడు. జర్మనీ స్టార్, మెడల్ ఫేవరేట్ జులియన్ వెబర్ (నాల్గో స్థానం) 85.79 మీటర్లతో పతకానికి అడుగు దూరంలో నిలిచాడు.

నవ చరిత్ర

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు పెద్దగా చెప్పుకునే చరిత్ర లేదు. అమెరికా, రష్యా, యూరోపియన్ దేశాలు ప్రధానంగా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయిస్తాయి. మనోళ్లు అప్పుడప్పుడు మెరిసినా.. పతకాలు సాధించిన దాఖలాలు పెద్దగా లేవు (గతంలో అంజు బాబి జార్జ్, నీరజ్ చోప్రా మాత్రమే మెడల్స్ నెగ్గారు) అటువంటిది, ఓ ఈవెంట్ పతక పోరులో ఏకంగా ముగ్గురు భారత అథ్లెట్లు నిలువటం సరికొత్త చరిత్రే. ఇక ఫైనల్స్ అనంతరం టాప్-6లో ముగ్గురు భారతీయులు నిలువటం సైతం గొప్ప విషయమే. నీరజ్ చోప్రాతో పాటు జావెలిన్ త్రో ఫైనల్లో పోటీపడిన కిశోర్ జెనా, డిపి మనులు వరుసగా 5, 6 స్థానాల్లో నిలిచారు. కిశోర్ జెనా 84.77 మీటర్లతో కెరీర్ వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. డిపి మను 84.14 మీటర్లతో ఆకట్టుకున్నాడు.

ఇబ్బంది పడుతూనే..!

ఆదివారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్స్‌లో నీరజ్ చోప్రా కాస్త ఇబ్బంది పడుతూనే పోటీ పడ్డాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్‌కు గాయానికి సంబంధించిన ఒత్తిడే కారణమని నీరజ్ వెల్లడించాడు. 'తొలి త్రోతోనే బాగా దూరం విసరాలని ఆలోచించాను. కానీ తొలి ప్రయత్నంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. నేను నా గాయం గురించి ఆలోచించసాగాను. పరుగులో వేగం తగ్గింది, జాగ్రత్తపడుతూ వెళ్లాను, స్పీడ్ 100 శాతం లేదు, ఎక్కడో కాస్త తడబడ్డాను. నేను ఇప్పుడు మెరుగు పడాల్సింది అక్కడే. 100 శాతం ఫిట్‌నెస్‌తో బల్లెంను మరింత దూరం విసిరేందుకు కష్టపడతాను' అని నీరోజ్ చోప్రా అన్నాడు. ఇక కెరీర్‌లో అన్ని విజయాలు అందుకున్నప్పటికీ.. మరింత మెరుగ్గా, అవే విజయాలు సాధించాలనే లక్ష్యమనే ప్రేరణ అని నీరజ్ చోప్రా అన్నాడు. 'త్రోయర్స్‌కు ముగింపు గీత ఉండదు అని అంటారు. ఎన్ని మెడల్స్ సాధించింది లెక్క కాదు, ప్రతిసారి మెరుగైన ప్రదర్శన చేయాలనే స్ఫూర్తి ఎప్పుడూ ఉంటుంది. పతకం సాధించటం అంటే అన్ని నెగ్గినట్టు కాదు. ఎంతో మంది అథ్లెట్లు ఒకే మెడల్‌ను ఎన్నోసార్లు సాధించారు. ఈ పతకాలు మళ్లీ మళ్లీ నెగ్గేందుకు ప్రయత్నం చేస్తానని' నీరజ్ తెలిపాడు.

ఆల్ టైమ్ గ్రేట్!

పాతికేళ్ల వయసులోనే జావెలిన్ త్రోలో పతకాలన్నీ సొంతం చేసుకున్నాడు నీరజ్ చోప్రా. 2016 ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌గా నిలిచిన నీరజ్ చోప్రా.. అదే ఏడాది దక్షిణ ఆసియా క్రీడల్లోనూ విజేతగా నిలిచి తొలిసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. 2017 ఆసియా చాంపియన్స్, 2018 ఆసియా గేమ్స్, 2018 కామన్‌వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకాలు కొల్లగొట్టాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ చరిత్ర లిఖించిన నీరజ్ చోప్రా..భారత అథ్లెటిక్స్ చరిత్రలో తొలిసారి ఒలింపిక్ పసిడి పతకం సాధించాడు. 2022 డైమండ్ లీగ్ చాంపియన్‌గా నిలిచిన నీరజ్ చోప్రా.. 2022 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. రజతంతో సంతృప్తి చెందని నీరజ్ చోప్రా.. ఈ ఏడాది బుడాపెస్ట్‌లో బల్లెంను బంగారు పతకంపై ఎక్కు పెట్టాడు. ఓ అథ్లెట్ జీవిత కాలంలో సాధించలేని అసమాన విజయాలు 25 ఏండ్లలోనే అందుకున్న నీరజ్ చోప్రా.. భారత అథ్లెటిక్స్‌లోనే కాదు, ప్రపంచ జావెలిన్ త్రో 'ఆల్ టైమ్ గ్రేట్'గా నిలిచేందుకు అన్ని అర్హతలు సాధించాడు.

'ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో నీరజ్ చోప్రా విజయ ప్రదర్శన చూడటం గొప్ప గర్వంగా ఉంది. నీరజ్ అంకితభావం, కష్టపడే తత్వం అందరికీ ఆదర్శం. నీరజ్ చోప్రాకు అభినందనలు. నీ వంటి స్టార్స్‌తో భారత్ వెలిగిపోతుంది.
- అభినవ్ బింద్రా

'ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు తొలి పసిడి. భారత క్రీడలకు ఇదో చారిత్రక మైలురాయి. ప్రతి టోర్నీలోనూ నీ హార్డ్‌వర్క్ నీరజ్ చోప్రాను విజేతగా నిలపాలి.
- సచిన్ టెండూల్కర్

'నీరజ్ చోప్రాకు శుభాకాంక్షలు. ఎంతటి అద్భుతమైన ఘనత. నీ విజయం పట్ల ఎంతో గర్వపడుతున్నాం'
- మీరాబాయి చాను

'ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రాకు అభినందనలు. చరిత్ర లిఖిస్తూ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పసిడి సాధించిన నీ చారిత్రక విజయం పట్ల యావత్ దేశం గర్వపడుతోంది'
- రాణి రాంపాల్

'ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించిన నీరజ్ చోప్రాకు అభినందనలు. బంగారు జైత్రయాత్రను కొనసాగిస్తూ.. భారత్‌కు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను'
- పి.టి ఉష



'నా కోసం అర్ధరాత్రి వరకు మేల్కొని ఉన్న భారతీయులు అందరికీ ధన్యవాదాలు. ఈ పసిడి పతకం యావత్ భారత దేశానికి అంకితం. నేను ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచా, ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌గా అవతరించాను. భారతీయులం ఏదైనా సాధించగలమని ఈ విజయాలు సూచిస్తున్నాయి. మీ అందరూ మీ రంగాల్లో కష్టపడండి, దేశం గర్వపడేలా చేయండి'
- నీరజ్ చోప్రా

ఆల్ ది బెస్ట్ భారత్!

రోహిత్‌సేనకు మద్దతుగా భారత్ ఆర్మీ

హైదరాబాద్: ఆగస్టు 30న ఆరంభం కానున్న ఆసియా కప్‌లో భారత క్రికెట్ జట్టు అంచనాలకు తగ్గట్టు రాణించాలని ఆకాంక్షిస్తూ భారత్ ఆర్మీ, ఆరెంజ్ ఆర్మీ క్రికెట్ అభిమాన సంఘాలు శుభాకాంక్షలు తెలిపాయి. జూబ్లీహిల్స్‌లోని బీ-డబ్స్‌లో సమావేశమైన ఈ రెండు అభిమాన సంఘాలు.. ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో టీమ్ ఇండియాకు మెగా ఈవెంట్ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించాయి. బ్యాండ్‌తో మార్చ్‌ఫాస్ట్ చేస్తూ.. ఆల్ ద బెస్ట్ టీమ్ ఇండియా అంటూ అభిమానులు నినదించారు. దాదాపు 10 లక్షల సభ్యులు గత భారత్ ఆర్మీ 1990 నుంచి టీమ్ ఇండియాకు అభిమాన సంఘంగా కొనసాగుతుండగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన ఆరెంజ్ ఆర్మీ 2015 నుంచి భారత జట్టుకు మద్దతుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ క్లబ్ ఫౌండర్ ధర్మ రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



నేడు చలో మైదాన్

రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా యువ సమ్మేళనాలు

హైదరాబాద్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) నేడు 'చలో మైదాన్' కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు 33 జిల్లాల కేంద్రాల్లో క్రీడా, శాట్స్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజు (ఆగస్టు 29) భారత్ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటుండగా.. విద్యార్థులు, యువతలో క్రీడలు, స్పోర్ట్స్ ఫిట్‌నెస్, ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కెరీర్ పట్ల అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా యువ సమ్మేళనాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ప్రధాన కార్యక్రమ ఏర్పాట్లను శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడా పథకాలు, ప్రోత్సాహకాల గురించి చలో మైదాన్‌లో క్రీడాకారులకు వివరించనున్నారు. చలో మైదాన్ కార్యక్రమంలో మంత్రులు, స్టార్ అథ్లెట్లు పాల్గొంటారు.



నవచిత్రం

టైగర్ లవ్ సారా..



నూపుర్ సనన్

ఇటీవల గ్లింప్స్ విడుదలైన తర్వాత అటు రవితేజ అభిమానులు, ఇటు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. రవితేజ నటిస్తున్న తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇది. వంశీ దర్శకుడు.

పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ 'ది కాశ్మీర్ ఫైల్స్', 'కార్తికేయ 2' చిత్రాలను రూపొందించిన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సినిమాలో రవితేజ సరసన బాలీవుడ్ నటి కృతి సనన్ చెల్లెలు నూపుర్ సనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా సోమవారం మేకర్స్ 'టైగర్ లవ్' సారాగా నూపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ట్రైన్ విండో సీట్లో కూర్చున్న నూపూర్ తన లవర్‌ని కలుసుకోవడానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు ఫస్ట్‌లుక్‌లో కనిపిస్తోంది. ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్ మరో హీరోయిన్. రవితేజ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న చిత్రమిది. కథకు యూనివర్సల్ అప్పీల్ ఉన్నందున మేకర్స్ దీన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని అక్టోబర్ 20న విడుదల చేస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.



సుభాస్కరన్, జాసన్ సంజయ్ విజయ్

దర్శకుడిగా విజయ్ తనయుడు

డిఫరెంట్ సినిమాలను అందించాల నుకునే యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయటంలో లైకా ప్రొడక్షన్ సుభాస్కరన్ ఎప్పుడూ ముందుం టారు. ఈ క్రమంలో కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ విజయ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ కొత్త సినిమాను చేయబోతున్నట్లు అధికారి కంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సరికొత్త ఆలోచనలతో ఉన్న యంగ్ టాలెంటెడ్ పర్సన్స్ ఎప్పుడూ గేమ్ చేంజర్స్‌గా ఉంటారని లైకా ప్రొడక్షన్స్ నమ్ముతుంటుంది. జాసన్ సంజయ్ విజయ్ చెప్పిన యూనిక్ పాయింట్ నచ్చింది. తనతో కలిసి వర్క్ చేయటం ఓ వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియెన్స్ అవుతుందని భావిస్తున్నాం. ఇందులో ప్రముఖ నటీనటులు, సాంతికేతిక నిపుణులు పని చేయబోతున్నారు' అని అన్నారు.

'అగ్ర నిర్మాణ సంస్థ లైకాలో తొలి సినిమా చేయబోతుండటాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నాకెంతో సపోర్ట్ అందించిన తమిళ్ కుమరన్‌కి ప్రత్యేకమైన ధన్యవాదాలు' అని డైరెక్టర్ జాసన్ సంజయ్ విజయ్ చెప్పారు.

ఫ్యామిలీ ధమాకాతో ఓటీటీ ఎంట్రీ

వినోదానికి కేరాఫ్‌గా నిలిచిన ఆహా మాధ్యమం నుంచి మరో రియాలిటీ షో 'ఫ్యామిలీ ధమాకా' ప్రేక్షకులను అలరించటానికి సిద్ధంగా ఉంది. సెప్టెంబర్ 8 నుంచి ఆహాలో ఈ షో స్ట్రీమింగ్ కానుంది. ఈ షోతో యువ కథానాయకుడు విశ్వక్‌సేన్ హోస్ట్‌గా మారుతుండటం విశేషం.

ఆయన తనదైన హోస్టింగ్ నవ్వుల ప్రయాణంలో ప్రేక్షకులను కూడా భాగం చేయబోతున్నారు. ఈ షోను ఫ్రీమాంటిల్ ఇండియా నిర్మిస్తోంది.

తొలిసారి ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్న హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'ఈ షోతో నేను హోస్ట్‌గా మారటం మరచి పోలేని అనుభూతి. ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ షో ద్వారా ఎన్నో కుటుంబాలను కలిశాను. చాలా ఆనందంగా ఉంది. తిరుగులేని ఎంటర్‌టైన్‌మెంట్‌ను ప్రేక్షకులకు అందించటానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఇప్పటివరకు భిన్న సినిమాలతో అలరించాను. ఇకపై ఇలాంటి ఆసక్తికరమైన షోలతో ఓటీటీ ప్రేక్షకుల్ని సైతం అలరించేందుకు సిద్ధంగా ఉంటాను' అని అన్నారు.

'ప్రేక్షకులకు ఊహించని కొత్తదనంతో కూడిన ఎంటర్‌టైన్మెంట్‌ను అందించటంలో ఆహా ఎప్పుడూ ముందుంటుంది. అలాంటి వాటిలో ఈ షో ఒకటి' అని సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నాన్ సబ్ స్క్రిప్షన్ రెవెన్యూ బిజినెస్, కంటెంట్ హెడ్ వాసుదేవ్ కొప్పినేని చెప్పారు. ఫ్రీమాంటల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆరాధన బోలా మాట్లాడుతూ,' 'ఆహాతో మా జర్నీ ఎప్పటి నుంచో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇండియన్ ఐడల్ రెండు సీజన్స్‌లో మేం కలిసి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశాం. ఇప్పుడు ఈ షోతో మీ ముందుకు రాబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఫ్యామిలీ ఫ్యూడ్‌ను ఆధారంగా చేసుకుని ఈ షోని రూపొందించాం. హాస్యం, భావోద్వేగాలు వీటన్నింటినీ కలగలిపి ప్రశ్నలుగా చేసి విశ్వక్ సేన్ ప్రేక్షకులను అడుగుతారు. అది కూడా ఎంటర్‌టైన్‌మెంట్ పంథాలో. ఇది ప్రతీ ఒకరికీ నచ్చుతుంది' అని తెలిపారు.



విశ్వక్‌సేన్

ప్రతినిధి 2 షూటింగ్ షురూ..



నారా రోహిత్

హీరో నారా రోహిత్ పొలిటికల్ థ్రిల్లర్ 'ప్రతినిధి 2'తో గ్రాండ్‌గా కమ్ బ్యాక్ ఇస్తున్నారు. వానర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. సక్సెస్‌ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ 'ప్రతినిధి' సిరీస్ నుండి రెండవ ఫ్రాంచైజీగా వస్తున్న ఈ చిత్రానికి 'ఒన్ మ్యాన్ స్టాండ్స్ ఎగైన్, ఎగనెస్ట్ ఆల్ ఆడ్స్' అనేది క్యాప్షన్. సోమవారం నుంచి ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో హీరో నారా రోహిత్ పై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా కోసం బిగ్ స్పాన్ ఉన్నే కథను ఆయన ఎంచుకోవడం, అలాగే ఈ చిత్ర ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచింది. కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, కొండకళ్ల రాజేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 25న రిపబ్లిక్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, ఎడిటర్: రవితేజ గిరిజాల, డీవోపీ: నాని చమిడిశెట్టి, ఆర్ట్: కిరణ్ కుమార్ మన్నె, స్టంట్స్: శివరాజు.

సరికొత్త అనుభూతినిచ్చే కథ

తన్విక అండ్ మొక్షిక క్రియేషన్స్ పతాకంపై నూతన తారలు రవితేజ నున్న హీరోగా, నేహ జురెల్ హీరోయిన్‌గా రూపొందుతున్న చిత్రం 'రాజు గారి అమ్మాయి - నాయుడు గారి అబ్బాయి'. సత్య రాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి నిర్మాతలు రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు. తాజాగా ఈ చిత్రం నుండి 'ఐ లవ్ యు' అంటూ సాగే లిరికల్ సాంగ్ విడుదలైంది. 'మధురమైన సంగీతం, చక్కని సాహిత్యంతో ఈ పాట సంగీత ప్రియుల హృదయాలను అలరిస్తోంది. రెహమాన్ రచించిన ఈ గీతాన్ని యాజిన్ నిజర్, నూతన్ మోహన్ పాడారు. సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాటతో పాటు చిత్ర కథాంశం ఈ తరం సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. త్వరలోనే ట్రైలర్‌తోపాటు సినిమాని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



రవితేజ నున్న, నేహ జురెల్

పక్కా మాస్ మసాలా సినిమా

రాజ్ తరుణ్ హీరోగా, ఎఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈచిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఏఎస్ రవికుమార్ చౌదరి 'పిల్లా నువ్వు లేని జీవితం' లాంటి హిట్ చిత్రాలను అందించిన దర్శకుడు. అలాగే రాజ్ తరుణ్ 'ఉయ్యాలా జంపాల, సినిమా చూపిస్తా మావా' వంటి ఎన్నో సూపర్ హిట్లు ఇచ్చారు. రాజ్ తరుణ్ ఎక్స్‌ట్రార్డినరీ ఆర్టిస్ట్. ఈ టీజర్ చూస్తుంటే అండర్ ప్లే పాత్ర చేసి ఫైనల్‌గా తిరగబడరసామీ అని క్లైమాక్స్‌లో ఇరగదీసినట్లు అర్థమౌతుంది. ఎంటర్‌టైమెంట్ సినిమా అనుకున్నాను. టీజర్ చూస్తుంటే ఫుల్ మాస్ సినిమాలా ఉంది. రాజ్ తరుణ్, రవి కుమార్‌కి ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అని తెలిపారు.

'దర్శకుడు రవికుమార్ చౌదరి ఈ సినిమాతో నాలో కొత్త కోణం చూపించారు. నేను చిన్నచిన్నగా తప్పితే యాక్షన్ పెద్దగా ఎపుడూ చేయలేదు. క్లైమాక్స్ షూట్ చేసినప్పుడు కూడా అడిగాను. ఇంతసేపు సైలెంట్‌గా ఉన్నావ్ కాబట్టి ఎప్పుడో ఒకసారి పేలాల్సిందే అని చెప్పారు(నవ్వుతూ). సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే విడుదల చేస్తాం. మీ అందరికీ నచ్చుతుంది' అని హీరో రాజ్ తరుణ్ అన్నారు. దర్శకుడు ఏఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ,'కొన్ని సంవత్సరాల గ్యాప్ తర్వాత నాకు మళ్ళీ రీబర్త్ ఇస్తున్న నిర్మాత శివకుమార్‌కి ధన్యవాదాలు. ఈ సినిమా తర్వాత రాజ్‌తరుణ్ ఇండస్ట్రీలో మరో యాక్షన్ హీరో అవుతారు. ఇందులో సందేహం లేదు. తను డైరెక్టర్ ఆర్టిస్ట్. అలాగే మాల్వి మల్హోత్రా, మన్నారా చోప్రా మంచి పాత్రలు చేశారు. జెబీ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. డీవోపీ జవహర్ రెడ్డి ప్రాణం పెట్టి ఈ సినిమా తీశారు' అని తెలిపారు. 'దర్శకుడు రవి కుమార్ చౌదరి ఈ కథని ఎంత చక్కగా చెప్పారో దానికి వంద రెట్లు అద్భుతంగా సినిమాని తీశారు. ఈ సినిమాతో ఆయనకి రీలైఫ్ స్టార్ట్ అవుతుందని భావిస్తున్నాను' అని నిర్మాత చెప్పారు.



రాజ్ తరుణ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815

జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజాసేవలో 'ఎల్ఐసి'

ఈ మధ్య పార్లమెంట్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానంపై దేశ ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఎల్ఐసి తమ హయాంలో శక్తి వంతమైందని, సంస్థ పురోగతిపై జరిగిన దుష్ప్రచారాలు పటాపంచలు అయ్యాయని చెప్పుకొచ్చారు. ఎట్టకేలకు ఎల్ఐసి గురించి ప్రధాని సానుకూలంగా మాట్లాడడం ఆహ్వానించదగిన విషయం. ప్రభుత్వాల సహకారం కన్నా, పాలసీదారుల అచంచెల విశ్వాసం వల్లనే, ఎల్ఐసి ఇంత అద్భుతమైన పురోగతి సాధించిందనేది తిరుగులేని చారిత్రక వాస్తవం. ఎల్ఐసి ఆవిర్భావంలో, ప్రస్థానంలో జాతీయోద్యమ లక్ష్యాలు దాగి ఉన్నాయి. మన మువ్వన్నెల జెండా దేశ స్వాతంత్ర్యానికి, దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక. మన దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వావలంబనపైన ఆధారపడి ఉంటుంది. 200 సంవత్సరాలు వలస పాలనలో ఆర్థికంగా దోచుకోబడింది కనుక, దేశం ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు నెలకొల్పారు. 76ఏండ్ల స్వతంత్రంలో దేశం ఆర్థిక స్వావలంబన సాధించడంలో ప్రభుత్వ ఆర్థిక సంస్థలైన బీమా సంస్థల, బ్యాంకుల పాత్ర మహోత్తరమైనది.



పి. సతీష్
9441797900

స్వాతంత్రోద్యమ పోరాట సమయంలోనే స్వతంత్ర భారతం ఎలా నిర్మించాలనే అంశంపై విస్తృత మేధో మథనం జరిగింది. 'దోపిడీని అంత మొందించాలంటే, రాజకీయ స్వేచ్ఛతో బాటు, ఆర్థిక వెనుకబాటు ఉన్న లక్షలాది మందికి నిజమైన ఆర్థిక స్వాతం త్రం కల్పించాలని 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సదస్సు తీర్మానించింది. 1934లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్ట్ గ్రూప్ సమావేశంలో 'ప్రజల పొదుపును జాతీయం చేయాల్సిన అవసరం ఉందనీ, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వానికి గట్టి నియం త్రణ ఉండాలని కాంగ్రెస్ గట్టిగా నమ్ముతుందని పేర్కొన్నారు. భారత దేశం స్వాతంత్రం సిద్ధించే నాటికి అప్పుడున్న పెట్టుబడి దారులకు తగినంత నిధులు లేవు గనుక దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పే ఉద్దేశ్యంతోనే వారు బొంబాయి ప్లాన్‌ను రూపొందించారు. (ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలు-టాటాలు, బిర్లాలు, దాల్మియాలు, సింఘానియాలు తదితరులు) దేశంలో మౌలిక వనరులు నెలకొల్పే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని, పారిశ్రామీకరణ కూడా ప్రభుత్వమే నిర్వహించాలని వారు పట్టుబట్టారు. దేశంలో ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు నమూనా పద్ధతిలో నిర్మించాలనేది సోషలిజం కాదు. సోషలిజం నమూనాలో ఆర్థిక వ్యవస్థను నిర్మించటం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించడమే. ఎటొచ్చి దీనిలో దిగువ, మధ్యతరగతి వర్గాలకు కొన్ని రాయితీలు కల్పిస్తారు. అందువల్లే 1955లో ఇంపీరియల్ బ్యాంక్‌ను జాతీయకరణ చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలకొల్పారు.

జీవిత బీమా అనేది దీర్ఘకాల పెట్టుబడి కనుక జీవిత బీమా వ్యాపారం కేవలం నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. యూరోపియన్ దేశాల్లో ప్రయివేట్ గుత్త సంస్థలు చేసిన ఆర్థిక అరాచకం గుర్తించిన ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బీమా రంగం ప్రభుత్వ అజమాయిషీలోనే ఉండాలని తన స్టేట్స్ అండ్ మైనారిటీస్ గ్రంథంలో పేర్కొన్నారు. 'బీమా వ్యాపార నిర్వహణ, యాజమాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వానికి బదిలీ చేసే చట్టాన్ని అమలుచేయడానికి వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని ఈ సభ అభిప్రాయపడుతుంది' అని రాజ్యాంగ అసెంబ్లీ 12జనవరి 1948 నాడు తీర్మానించింది. ఆనాడు మనదేశ బీమా రంగంలో ఘోరమైన పరిస్థితులు నెలకొన్న నేపధ్యంలో జీవిత బీమా రంగంలో పట్టదారుల సొమ్ముకు భద్రత ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో లభించిందని నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం, జనవరి 19, 1956న జీవిత బీమా రంగాన్ని జాతీయాకరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకువచ్చింది. బీమా జాతీయకరణ ఆర్డినెన్స్‌ను అత్యంత గోప్యంగా ఇచ్చి ఉండకపోతే, ప్రయివేటు బీమా సంస్థలు మరింతగా ప్రజల సొమ్మును దిగమింగేవని ఆనాటి ఆర్థికమంత్రి సి.డి దేశముఖ్ తన ఆత్మకథలో రాసుకున్నారు. ఎల్ఐసి ఆవిర్భావాన్ని మన రాజ్యాంగం ఆత్మగా భావింపబడే ఆదేశిక సూత్రాల అధికరణలు 38, 39లో పొందుపరచబడిన విధంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సౌధంగా చూడవచ్చు. ఈరోజు ఏడాదికి రూ.3.5లక్షల కోట్ల నుండి రూ.4లక్షల కోట్లు దేశాభి వృద్ధికి పెట్టుబడులు అందించగల స్థితిలో ఎల్ఐసి ఉందంటే, దానికి జాతీయోద్యమ నాయకుల దార్శనికతే ప్రధాన కారణం. 1956 నుండి ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.40లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి, 40 కోట్ల పాలసీదారులకు ఎల్ఐసి విశేష సేవలందిస్తున్నది.

అప్రతిహతంగా ఎల్ఐసి పురోగతి

1956లో కేవలం రూ.5కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసి, నేడు రూ.46లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుంది. 2022-23 మొదటి క్వార్టర్‌తో పోల్చినప్పుడు, 2023-24 మొదటి క్వార్టర్‌లో 1300శాతం లాభం (రూ.9544 కోట్లు) ఎల్ఐసి ఆర్జించడం విశేషం. దేశీయ బీమా రంగంలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 23 ఏండ్లు అయినా, ఎల్ఐసి నేటికీ ప్రీమియమ్ ఆదాయంలో 63శాతం మార్కెట్ వాటా, పాలసీలలో 72శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగు తోంది. దేశీయ బీమా రంగంలో ఎల్ఐసి తర్వాత 2వ స్థానంలో ప్రయివేటు బీమా కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ కంపెనీ!! ఎల్ఐసి మార్కెట్ వాటా 63శాతం ఉంటే, ఎస్‌బీఐ లైఫ్ మార్కెట్ వాటా 8శాతం లోపే !! దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మూచువల్ ఫండ్ల ఆస్తుల కన్నా ఎల్ఐసి ఆస్తులు 1.2 రెట్లు ఎక్కువ క్లైయిమ్‌ల సెటిల్‌మెంట్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ సమర్థత వంటివాటిని పరిశీలిస్తే, క్లైయిమ్ సెటిల్‌మెంట్‌లో ఎల్ఐసి ప్రపంచ రికార్డును కలిగి ఉంది. క్లైయిమ్ సెటిల్‌మెంట్, నిర్వహణ సామర్థ్యాలు, ఉత్పాదకత పరంగా ప్రపంచంలోని మరే ఇతర కంపెనీ కూడా ఎల్ఐసి లాంటి రికార్డును పొందలేదు. ప్రపంచంలో 99శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో ఎల్ఐసి ఉంది. దేశంలో రక్షణ, రైల్వేల తర్వాత ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ పేరెన్నికకంది. ఫార్చ్యూన్ గ్లోబల్ సూచీ-



2023లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియం ఆదాయంలో ప్రపంచంలో పదవ అతి పెద్ద సంస్థగా ఎల్ఐసి నిలిచింది.

"ప్రజల పొదుపు ప్రజల శ్రేయస్సు కోసమే" అనే నినాదంతో 1956 నుండి ఇప్పటివరకి దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 40లక్షల కోట్ల రూపాయలు పైబడి పెట్టుబడులుగా పెట్టింది. 31 మార్చి 2022 నాటికి ఎల్ఐసి రూ.40, 84,826 కోట్ల పెట్టుబడులను మన దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ.28,85,569 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. సుమారు ఒక లక్షల ఉద్యోగులను మాత్రమే కలిగిన ఎల్ఐసి సంస్థ దాదాపు 30కోట్ల వ్యక్తిగత పాలసీలకు సేవలు అందిస్తోంది. ఎల్ఐసి సంస్థ కోసం పని చేసే 13.43లక్షల ఏజెంట్‌లలో 48శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నారు. నేడు దేశీయ బీమా రంగంలో ఉన్న 26 ప్రయివేటు బీమా కంపెనీలు అన్నీ కలిపి దేశంలో ఉన్న 79శాతం జిల్లాల్లో ఆఫీసు లు కలిగి ఉంటే,ఒక్క ఎల్ఐసి సంస్థనే దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉంది. ప్రయివేటు బీమా రంగంలో ఉన్న మొత్తం పాలసీల సంఖ్య దాదాపు 6 నుండి 6.5కోట్ల వరకు ఉంది. అయితే దాదాపు 2.45లక్షల మంది ఉద్యోగులు ప్రయివేటు బీమా రంగంలో పనిచేస్తున్నారు. ఎల్ఐసీ ఉద్యోగుల ఉత్పాదకత ప్రయివేటురంగ ఉద్యోగుల కంటే చాలా ఎక్కువ. మొత్తం ఖర్చులు, జీతానికి సంబంధించిన ఖర్చులు వంటి వాటిని పోల్చినప్పుడు ప్రతి అంశంలో ఎల్ఐసి, ప్రయివేటు బీమా కంపెనీలతో పోలిస్తే మెరుగ్గా ఉంది.

ప్రభుత్వ బీమా రంగం ముందున్న సవాళ్లు!

నేడు ప్రభుత్వ బీమా రంగం ముందు అనేక సవాళ్ల ఉన్నాయి. ప్రభుత్వ బీమా రంగ ప్రయోజనాలకు ప్రతికూలంగా ఉండే కొన్ని విధాన నిర్ణయాలను తీసుకురావడానికి బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డిఏఐ) ప్రయత్నాలు చేస్తోంది!ఈ మధ్య ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని ప్రచారం జరిగినా, ప్రభుత్వం వెనక్కు తగ్గింది. బీమా చట్ట సవరణల ద్వారా, కనీస మూలధన అవసరాన్ని మార్చాలని, కమిషన్ చెల్లింపులో మార్పులను, మిశ్రమ లైసెన్సుల జారీని అనుమతించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సవరణలు అమలైతే, ప్రజల పొదుపుకు హాని కలిగించే మోసపూరిత అవకాశాలు ఉన్న1956కి ముందు ఉన్న కాలానికి బీమా రంగం వెళ్లినట్లవుతుంది. ఐఆర్‌డిఏఐ కూడా లైఫ్, నాన్-లైఫ్ వ్యాపారంలో దాదాపు ఇరవై కంపెనీలకు లైసెన్స్‌లు జారీ చేసే అవకాశం ఉందని ప్రకటించడం ద్వారా బీమా మార్కెట్‌లో ఎక్కువ కంపెనీలను అనుమతించాలని యోచిస్తోంది. ప్రతి భారతీయుడు 2047 నాటికి బీమా పాలసీని కలిగి ఉండాలని, దాని కోసం బీమా వ్యాప్తిని పెంచాలని ప్రభుత్వం, ఐఆర్‌డిఏఐ వాదిస్తూ వచ్చాయి. కానీ తామర తంపరాలుగా ప్రయివేటు బీమా కంపెనీలను అనుమతించడం ద్వారా, బీమా వ్యాప్తిని పెంచలేమని గమనించాలి.

జీఎస్టీ అన్యాయం

బీమా వ్యాప్తి ప్రజల మిగులు ఆదాయంపై ఆధారపడి ఉంటుంది, బాధాకరమైన విషయం ఏమిటంటే మన దేశంలో ఇది చాలా తక్కువగా ఉంది. తలసరి ఆదా యంలో ప్రపంచ దేశాల్లో మన స్థానం 138వది. భారతదేశంలో జీవిత బీమా సాంద్రత, జీవిత బీమా వ్యాప్తి కెనడా కంటే చాలా ఎక్కువ, ఇది యునైటెడ్ స్టేట్స్‌తో సమానం. మన దేశంలో ఆర్థిక వాతా వరణం అంత ఆశాజన కంగా లేకున్నా ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బీమాసంస్థలు అద్భుతమైన ప్రదర్శన నమోదు చేసాయి. ఇంత అద్భుతమైన పనితీరున్నప్పటికీ, ప్రభుత్వ బీమా రంగ ప్రయోజనాలను దెబ్బ తీసే చర్యలు తీసుకువ స్తుండటం ఏ మాత్రం సమంజసం కాదు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ విధించడం అన్యాయం మాత్రమే కాదు, అనైతికం కూడా.భారత రాజ్యాంగం గౌరవ ప్రదంగా జీవించే హక్కును కల్పించిన సందర్భంలో ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా చూడాలి. అలాంటి బీమా పొదుపుపై రాయితీ ఇవ్వలేదు సరికదా, ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం నుండి అధిక ప్రీమియం పాలసీలపై తాజాగా పన్ను విధించింది. కచ్చితంగా, ఇది పరిశ్రమపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. కాబట్టి ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ప్రయోజనాల కోసం, దేశ ప్రజల ప్రయోజనాల దష్ట్యా ఈ అంశాలను ప్రభు త్వం పునః పరిశీలించాలి. కస్టమర్ సేవలలో మరింత మెరు గుదలలు తీసుకురావడానికి, దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపశ మనం కలిగించడం కోసం ఎల్ఐసిలో తరగతి 3, 4 ఉద్యో గుల ఉద్యోగుల నియామకాలు తక్షణం చేపట్టవలసిన అవసరం ఉంది. స్టాక్ మార్కెట్‌లో నమోదైన మార్కెట్ కాపిటలైజేషన్ కన్నా ఎల్ఐసి నిజవిలువ కొన్ని రెట్లు ఉంటుం దనే వాస్తవాన్ని ప్రజలకు, పాలసీదారులకు తెలియ చెప్ప డానికి జన సభలు, వీధి సమావేశాలు దేశవ్యాప్తంగా నిర్వ హించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇప్పటికే పిలుపునిచ్చింది. పార్లమెంటు సాక్షిగా ఎల్ఐసిని కీర్తించిన ప్రధాని ప్రభుత్వ బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. 76ఏండ్ల దేశ స్వాతంత్ర్య ప్రస్థానంలో దేశ ఆర్థిక పరిపుష్టికి, స్వావలంబనకు విశేష కృషిచేస్తున్న ఎల్ఐసి ని బలోపేతం చేయడమే నిజమైన దేశభక్తికి తార్కాణం. ■

ఒక 'విధ్వంసపు' రచన!

ఒకావిడ తన ఇంట్లో కొండ చిలువను పెంచుకుంది. ప్రతిరోజూ ఆహారం పెట్టేది. దానితో ఆటలాడేది. ఎంతో చనువుగా ఉండేది. ఎక్కువసేపు ముచ్చటించేది. కొద్ది రోజుల్లోనే ఆ పాముతో ఆమెకు విడదీయరాని బంధం ఏర్పడింది. ఇంట్లో కుటుంబ సభ్యునిలాగే దాన్ని కూడా చూసుకునేది. అయితే ఉన్నట్టుండి ఒకరోజు సడెన్‌గా అది ఆహారం తినడం మానేసింది. ఎక్కువసేపు ఆమెను అల్లుకునే ఉండేది. ఇలా వారం గడిచింది. అది బక్కచిక్కు తోందని గ్రహించి దాన్ని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లింది. పామును గమనించిన అతను దాన్నుంచి ఏదో పసిగట్టాడు. 'అది ఆహారం తినకుండా ఎందుకుంటుందో తెలుసా? అని అడిగాడు. ఆమెకు అర్థం కాలేదు. 'ఏదో ఓరోజు నిన్నే తిని ఆకలి తీర్చుకుందామని ఇన్ని రోజులు ఉపవాసంగా ఉంటోంది' అని చెప్పాడు. 'నీతో అల్లుకోని ఎందుకు పడుకుంటుందో తెలుసా?' అన్నాడు. 'నీ ఎముకలు విరగ్గొట్టే శక్తి తనకుందా లేదా అని పరీక్షిం చుకుంటుంది'. అన్నాడు. ప్రేమతో ముద్దాడేది ఎందుకో తెలుసా? 'నిన్ను అమాంతం మింగితే కడుపులో పడతావా లేదా?' అని అన్నాడు...



ఎన్. అజయ్‌కుమార్

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే దేశంలో బీజేపీ-ఆరెస్సెస్ చేపట్టిన విధ్వంసపు రచన నేను చెప్పిన కథకు అద్దం పట్టేలా ఉంది. భావజాల రంగంలో విస్తరిస్తున్నకొద్దీ దాని అసలు రంగు బయట పడుతోంది.



ముందుగా ప్రజలంటే ప్రేమగా నటిస్తూనే అంతర్గతంగా ఆరెస్సెస్ భావజాలాన్ని విస్తరింపజేస్తోంది. దీనికి ఎన్నికలకు ముందే తన హిందూత్వ ప్లాన్ అమలుకు కొన్ని ఈశాన్య రాష్ట్రాలను ప్రయోగ శాలలుగా ఎంపిక చేసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి దేశంలోకి విద్వేషపు మంటల్ని రెచ్చగొడుతోంది. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళలపై జరిగిన లైంగికదాడి, హత్యదేశాన్నే కాదు యావత్ ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. మూడునెలలుగా మారణకాండ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంది.ముందు మనకు ఇది కుకీ, మైతేయి వర్గాల రిజర్వేషన్ వివాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. కానీ ఇది మతశక్తుల దుష్ట పన్నాగం! ఇందులో మరో కుట్రకోణం దాగుంది! మైతేయిలకు ఎస్టీ హోదా ద్వారా కొండ ప్రాంతాల్లో భూమిని కార్పొ రేట్లకు ధారాదత్తం చేయడం. ప్రస్తుతానికి కుకీలకే ఆ భూములపై హక్కుంది గనుక ఆధిపత్యం ఉన్న మైతేయిలకు ఎస్టీ హోదా కల్పిస్తే వారు ఆ భూముల్లోని వనరులు, ఖనిజ సంపదకు వారసుల్ని చేయాలనేది వారి ప్రణాళికలో అంతర్భాగంగా కనిపిస్తోంది. ఆ వర్గానికి చెందిన అక్కడి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పావులు కదిపారు. ముందు జాతుల మధ్య ఘర్షణగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వారు ఖనిజ సంపదను కొల్లగొట్టాలంటే కుకీలు కొండ ప్రాంతాల్ని ఖాళీ చేయాలి. అందుకు ముందు వారిని మయన్మార్ నుంచి వచ్చిన వలసదారులుగా చిత్రీకరించి వారిపై దాడులకు మైతేయిల్ని తెగబడేలా చేశారు. ఇండ్లు ధ్వంసం చేశారు, చర్చిలు తగలబెట్టారు .ఇలా కుకీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతినేలా చేద్దామనుకున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు కాని ఈ అరాచకాలను అదుపు చేయలేదు. ఎందుకంటే అధి కారులు, పోలీసుల్లో చాలామంది మైతేయి వర్గానికి చెందినవారే. అందుకే ఎంతో మంది కుకీలు హత్యకు గురవుతున్నా వారు మాట్లాడటం లేదు. ఇండ్లు, చర్చిలు దగ్ధమవుతున్నా ఆపడం లేదు.

అయినా కాషాయ పరివారం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఆ భూముల కోసం మరో పథకం వేశాడు విశ్వగురు. ఎందుకంటే రాజకీయ విద్యలో ఆరితేరిన సుప్రసిద్ధుడనే పేరు సార్థకం చేసుకున్నాడు కదా! సులభంగా ఆటవీ భూముల రక్షణ చట్టానికి సవరణ చేశాడు. పార్లమెంట్‌లో మందబలంతో ఆమెదించుకున్నాడు. చట్టం ఇప్పుడు మణిపూర్ చుట్టు పక్కల వంద కిలో మీటర్ల ఆడవులన్నీ కేంద్రం ఎవరికైనా కట్టబెట్టుకునే వీలును కల్పించింది. అయితే వారి ప్రయోగశాలల్లో చేసిన కుట్రలతో వారిలో ఒక ఆశాభావం ఏర్పడింది. మతం మంటల్లో చలికాచుకునే పరిస్థితి దేశంలో ఉందని! విద్వేషపు రాజకీయాలతో ప్రజల్ని విడదీసే స్వేచ్ఛ ఉందని! అందుకే ఆస్తులు ధ్వంసమైనా, ప్రాణాలు పోయినా, ఆదుకోవాలని చేసిన ఆర్తనాదాలు మౌనమునికి వినపడలేదు. కనపడలేదు. అది ఆరుతుందనుకునే సమయంలోనే హర్యానాలో హిందూ,ముస్లింల ఘర్షణకు మరో బీజం పడింది. కానీ ఇంతవరకు ఘర్షణలు జరిగిన రెండు రాష్ట్రాల్లో ప్రజల్ని పాలిస్తున్నవి, విభజిస్తున్నవి డబులింజన్ సర్కార్లే అన్న సంగతి మరవకూడదు. గోద్రా అల్లర్లు మానవత్వాన్ని మంటకలిపాయి. కాశ్మీరీపండిట్లు, ముస్లింల మధ్య ఘర్షణ జమ్మూకాశ్మీర్‌ను విభజించాయి. తాజాగా మణిపూర్ మండుతూనే ఉండగానే హర్యానాలో మత చిచ్చు రగిలింది. ఇదంతా పథకం ప్రకారమే జరుగుతున్నట్టు కనిపిస్తోంది. దేశాన్ని హిందూత్వగా మార్చాడానికి బీజేపీ-ఆరెస్సెస్ చేపట్టిన అరచాకాలే ఇవన్నీ! రేపు ఏ రాష్ట్రం, ఏరూపంలో మండుతుందో చెప్పలేం! కానీ దేశంలో రాజకీయ పరిస్థితులు తారు మారవుతున్న కొద్దీ విధ్వంసపు కుట్ర శరవేగంగా అమలు చేసే ప్రయత్నం జరుగుతున్నది!

ఈశాన్య భారతంలో కాషాయ దండును తయారుచేసి, హిందూత్వ ఉద్యమంగా రూపు దిద్దడానికి ఆరెస్సెస్ పక్కాప్లాన్‌నే హిందూత్వ శక్తులు నేడు అమలు చేస్తున్నట్టు సమాచారం. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన తరువాత హిందూత్వ సంస్థలు తమ కార్యకలాపాలను మరింత ఉధృతం చేశాయి. 2015లో మణిపూర్ అసెంబ్లీలో రెండు సీట్లు గెలుచుకున్న బీజేపీ 2017లో ఏకంగా అధికారాన్నే చేజిక్కించుకుంది. మెయితీలను హిందూ జాతీయ వాదులుగా మార్చేందుకు వైష్ణవాన్ని ప్రోత్సహించింది. తమిళనాడులో హిందీని రుద్దాలని చూసింది. ఇలా అన్నిచోట్ల ఏదో రకంగా పాగావేయాలని చేసే ప్రయత్నాలన్నీ బెడిసికొడుతున్నాయి. మతపాలనను అన్నిరాష్ట్రాల్లో ప్రజలు స్వీకరించే స్థితిలో లేరు. దేశంలో కాషాయ పార్టీకి ఉన్న బలం ముప్పై ఎనిమిది శాతం ఓటింగ్ మాత్రమే. వారు స్వతహాగా గెలుచుకున్న రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, గుజరాత్, మణిపూర్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర. కొన్ని రాష్ట్రాలను కూటములతో, మరికొన్నింటిని ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచినవాటిని పడగొట్టి పాలిస్తున్నవి. మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలున్నాయి. అయితే హిందూత్వ నినాదం ఎత్తుకున్న పెద్దలకు ఇది ఏమాత్రం మింగుడు పడటం లేదు. అంతెం దుకు దేశ రాజధాని ఢిల్లీని వారి చేతుల్లోకి తీసుకోవడానికి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు ఎవరికీ తెలియనివి కావు. పాలనాధికారాలను వారి చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి ఆర్డినెన్స్‌లు, కొత్త జీవోలతో అక్కడి ప్రభు త్వాన్ని ముప్పుతిప్పలు పెడుతోంది. దేశమంతా మత, విభజన రాజకీయాలతో పాలన సాగించాలని చూస్తోంది. రెండో సారి జవాన్లపై పుల్వామా దాడిని బూచిగా చూపి, పాకిస్తాన్ నుంచి దేశానికి ప్రమాదం ఉందని చెప్పి ప్రజల్ని ఏమార్చి గెలిచింది. ఇప్పు డూ తమ హిందూత్వ ప్రయోగశాలల ద్వారా అల్లర్లు, విధ్వంసాలు సృష్టించి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోంది! ఇప్పటికే హక్కులు హననమయ్యాయి. భరిస్తూ వస్తున్నాం.విలువలు బుగ్గ య్యాయి పోరాడుతూనే ఉన్నాం. కానీ మనం పీల్చుకునే ఊపిరిలో మతగాలులు వీస్తున్నాయి. పీల్చితే విద్వేషపు మంటల్లో చిక్కుకుని చచ్చిపోతాం. పీల్చకుంటే బతకలేమో అనే పరిస్థితిని సంఘ్‌పరివార్ సృష్టిస్తోంది. ఇది ప్రజలు గమనించకుంటే పైన పాము మహిళను ఎలా బలిగొనాలని ఆలోచిస్తుందో...వారు అనుకున్నది సాధించ డానికి దేశాన్నే కాషాయపు రంగులో ముంచే ప్రమాదం పొంచి ఉంది. అందుకే దేశానికి ఇప్పుడు అప్రమత్తత అవసరం. ■

అతి తక్కువ కాలం అమలులో వున్న చార్టర్ చట్టం?

దీపిక



డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

1. క్యాబినేట్ మిషన్‌లోని సభ్యులను గుర్తించండి.
ఎ. ఎ.వి. అలెగ్జాండర్ బి. క్లెమెంట్ అట్లీ
సి. సర్ స్టాపర్డ్ క్రిప్స్ డి. లార్డ్‌పెథిక్ లారెన్స్
1. ఎ,బి 2. ఎ,బి,డి
3. ఎ,సి,డి 4. ఎ,బి,సి,డి

2. భారత ప్రభుత్వ చట్టం 1935 గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం వంటిది అని విమర్శించినది ఎవరు?
1. సుభాష్ చంద్రబోస్ 2. అంబేద్కర్
3. జిన్నా 4. నెహ్రూ

3. క్రిప్స్ ప్రతిపాదనలను ఒక దివాల తీసే బ్యాంకు ముందు తారీఖు వేసి అందించే చెక్కుల లాంటివి అని పేర్కొన్నవారు ఎవరు?
1. అంబేద్కర్ 2. జిన్నా
3. గాంధీ 4. సర్దార్ వల్లభాయ్‌పటేల్

4. క్రింది వాటిలో సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
ఎ. మౌంట్ బాటన్ విభజన ప్రణాళిక 3 జూన్ 1947.
బి. భారత స్వాతంత్ర్య బిల్లు 1947 బ్రిటిషు పార్లమెంటు ఆమోదం 4 జులై 1947.
1. బి మాత్రమే 2. ఎ,బి
3. ఎ మాత్రమే 4. ఏది కాదు.

5. 1774సం.లో కలకత్తాలోని పోర్టు విలియం లో మేయర్ కోర్టు స్థానంలో తొలిసారిగా సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. కాగా మేయరు కోర్టు ఏ సం.లో స్థాపించారు?
1. 1729 2. 1886
3. 1726 4. 1774

6.క్రింది ఏ చట్టం ప్రకారం భారతదేశంలో తొలిసారిగా ఇస్టిండియా కంపెనీ పాలనలో ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని ప్రవేశపెట్టారు?
1.రెగ్యులేటింగ్ చట్టం 1773 2. 1813 చార్టర్ చట్టం
3. 1784 పిట్స్ ఇండియా చట్టం 4. 1833 చార్టర్ చట్టం

7. క్రింది వాక్యాలలో సరికాని వాక్యం / వాక్యాలు గుర్తించండి.
ఎ. బెంగాల్ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను 4 నుండి 3 కి తగ్గించారు - 1813 చార్టర్ చట్టం.
బి. పరిపాలన అంశాలను 2 రకాలుగా విభజించిన చట్టం 1784 పిట్స్ ఇండియా చట్టం.
1. ఎ మాత్రమే 2. ఎ,బి
3. బి మాత్రమే 4. ఏది కాదు.

8. జతపరుచుము.
ఎ. మున్సిపాలిటీలకు చట్టబద్ధత 1. 1813 చార్టర్ చట్టం
బి. అతి తక్కువ కాలం అమలులో ఉన్న చార్టర్ చట్టం 2. 1853 చార్టర్ చట్టం
సి. లా కమీషన్ ఏర్పాటు 3. 1793 చార్టర్ చట్టం
డి. స్థానిక సంస్థలకు పన్ను విధించే 4. 1833 చార్టర్ చట్టం
1. ఎ1,బి3,సి2,డి4 2. ఎ1,బి2,సి3,డి4
3. ఎ3,బి2,సి4,డి1 4. ఎ3,బి4,సి2,డి1

9. క్రింది ఏ చట్టమును అనుసరించి భారతదేశంలో తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నిక విధానమును ప్రవేశపెట్టారు?
1. 1919 భారత ప్రభుత్వ చట్టం
2. 1909 భారత కౌన్సిల్ చట్టం
3. 1892 భారత కౌన్సిల్ చట్టం
4. 1861 భారత కౌన్సిల్ చట్టం

10.క్రింది వాటిలో 1861 భారత కౌన్సిల్ చట్టం గురించి సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
1. ఐఎన్‌సి ఏర్పాటు తర్వాత ఏర్పడిన తొలి చట్టం
2. తొలిసారిగా రాష్ట్రాలలో శాసన మండలాల ఏర్పాటు.
3. దేశంలో తొలిసారిగా పోర్ట్ పోలియో విధానం ప్రవేశపెట్టారు.
4. 2 మరియు 3

11. క్రింది ఏ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు అవకాశము కల్పించారు?
1. 1909 భారత కౌన్సిల్ చట్టం
2. 1892 భారత కౌన్సిల్ చట్టం
3. 1861 భారత కౌన్సిల్ చట్టం 4. పై ఏది కాదు.

12. క్రింది ఏ చట్టం ను అనుసరించి కేంద్రములో తొలిసారిగా ద్విసభ విధానమును ప్రవేశపెట్టారు?
1. 1909 భారత కౌన్సిల్ చట్టం



2. 1935 భారత ప్రభుత్వ చట్టం
3. 1919 భారత ప్రభుత్వ చట్టం
4. 1947 భారత ప్రభుత్వ చట్టం

13.క్రింది వాటిలో 1919 భారత ప్రభుత్వ చట్టం గురించి సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
1. దేశంలో తొలిసారిగా ద్వంద్వ ప్రభుత్వ విధానం ప్రవేశపెట్టారు.
2. మింటో మార్లే సంస్కరణలు అని అంటారు.
3. గవర్నర్ జనరల్ శాసన మండలి సభ్యుల సంఖ్య 16 నుండి 60 కి పెంచారు.
4. పైవన్నీ

14. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పటి నుండి ఎప్పటి వరకు జరిగింది?
1. 7 సెప్టెంబరు 1930 - 7 డిసెంబరు 1930
2. 12 నవంబరు 1930 - 19 జనవరి 1931
3. 17 నవంబరు 1932 - 24 డిసెంబరు 1932
4. 7 సెప్టెంబరు 1930 - 7 డిసెంబరు 1931

15. సైమన్ కమీషన్ ఏ సం.లో తన నివేదికను బ్రిటిషు ప్రభుత్వానికి సమర్పించింది?
1. 1927 2. 1928 3. 1930 4. 1932

16. క్రింది ఏ చట్టాన్ని అనుసరించి భారతదేశంలో తొలిసారిగా రాజ్యాంగ చట్ట నిర్మాణంలో భారతీయులకు అనధికార సభ్యులుగా తొలిసారిగా అవకాశాన్ని కల్పించారు?
1. 1892 భారత కౌన్సిల్ చట్టం
2. 1861 భారత కౌన్సిల్ చట్టం
3. 1909 భారత కౌన్సిల్ చట్టం
4. ఏది కాదు.

17. 2వ రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పటి నుండి ఎప్పటి వరకు జరిగింది?
1. 7 సెప్టెంబరు 1931 - 7 డిసెంబరు 1931
2. 13 నవంబరు 1931 - 19 జనవరి 1932
3. 17 నవంబరు 1932 - 24 డిసెంబరు 1932
4. 7 సెప్టెంబరు 1931 - 1 డిసెంబరు 1931

18. గాంధీ - ఇర్విన్ ఒప్పందం ఎప్పుడు జరిగింది?
1.13 నవంబర్ 1931 2. 5 మార్చి 1931
3. 17 మార్చి 1931 4. 7 డిసెంబరు 1931

19. క్రింది ఏ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన చేశారు?
1. 1858 భారత ప్రభుత్వ చట్టం
2. 1919 భారత ప్రభుత్వ చట్టం
3. 1935 భారత ప్రభుత్వ చట్టం
4. 1947 భారత ప్రభుత్వ చట్టం

20. క్రింది వాటిలో సైమన్ కమీషన్ యొక్క సిఫార్సులు ఏవి?
ఎ.భారత్ లో సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటు
బి. మత నియజక వర్గాల కొనసాగింపు
సి. కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేయడం
డి. రాష్ట్ర శాసన మండలాల్లో సభ్యుల సంఖ్య పెంచడం.
1. ఎ,బి,సి 2. సి మాత్రమే
3. ఎ,బి,డి 4. ఎ,బి,సి,డి

21. 1773 రెగ్యులేటింగ్ చట్టం గురించి క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.
1. తొలి సుప్రీంకోర్టు ఏర్పాటు. 2. ప్రప్రథమ రాజ్యాంగ చట్టం
3. కంపెనీకి 20 సం.ల పాటు వ్యాపారం చేసుకొనే అనుమతి లభించింది.
4. పైవన్నీ

22. క్రింది ఏ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై 'వీటో' అధికారం కల్పించారు?
1. 1813 చార్టర్ చట్టం 2. 1833 చార్టర్ చట్టం
3. 1793 చార్టర్ చట్టం 4. 1853 చార్టర్ చట్టం

23. క్రింది ఏ చట్టం ప్రకారం దేశంలో ద్వంద్వ పాలన రద్దు అయ్యింది.
1. 1892 కౌన్సిల్‌చట్టం 2. 1858 భారత చట్టం
3. 1909 కౌన్సిల్ చట్టం 4. 1935 భారత చట్టం

24. అక్వర్త్ కమిటీ సిఫార్సు మేరకు సాధారణ బడ్జెటు నుండి రైల్వే బడ్జెటును 1921లో వేరు చేశారు కాగా ఇది ఎప్పటి నుండి అమల్లోకి వచ్చింది.
1. 1921 2. 1928 3. 1932 4. 1924

25. జతపరుచుము.
ఎ. 1858 భారతప్రభుత్వ చట్టం 1. కేంద్ర శాసన మండలికి బడ్జెట్‌పై చర్చించే వీలు.
బి. 1892 భారత కౌన్సిల్ చట్టం 2. భారత రాజ్య కార్యదర్శి
సి.1861 భారత కౌన్సిల్ చట్టం 3. ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం.
డి. 1909 భారత కౌన్సిల్ చట్టం 4. బడ్జెటు తో సహా అన్ని అంశాలపై ప్రశ్నించే ధికారం.
1.ఎ2,బి3,సి4,డి1 2.ఎ3,బి4,సి1,డి2
3.ఎ1,బి2,సి3,డి4 4.ఎ2,బి1,సి3,డి4

సమాధానాలు

1.3	2.4	3.3	4.3	5.3
6.3	7.1	8.3	9.2	10.4
11.1	12.3	13.1	14.2	15.3
16.2	17.4	18.2	19.3	20.3
21.4	22.3	23.2	24.4	25.4

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

పాకిస్తాన్ తాత్కాలిక ప్రధాని అన్వరుల్ హక్ కాకర్ : పాకిస్తాన్ 8వ తాత్కాలిక ప్రధానమంత్రిగా అన్వరుల్ హక్ కాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రెసిడెంట్ హౌస్‌లో కాకర్ చేత ప్రమాణం చేయించారు. రాబోయే సాధారణ ఎన్నికలను పర్యవేక్షించడం మరియు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక అడ్డంకులను పరిష్కరించడం వంటి బాధ్యతలను అప్పగించడం జరిగింది. ఈయన బలూచిస్తాన్ అవామీ పార్టీ (బి.ఎ.పి.) కి చెందినవారు. పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం జాతీయ అసెంబ్లీ పదవీకాలం పూర్తయితే 60 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. కానీ జాతీయ అసెంబ్లీ కాలం ముగియక ముందే రద్దు చేస్తే 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించవచ్చు.



ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా వియన్నా : ఎకనామిస్ట్ ఇంటలిజెన్స్ యూనిట్ యొక్క వార్షిక గ్లోబల్ లైవబిలిటీ ఇండెక్స్ ప్రకారం, వియన్నా వరుసగా 4వ సారి ప్రపంచంలోనే అత్యంత నివాస యోగ్యమైన నగరంగా పేరు పొందింది. రాజకీయ స్థిరత్వం, నేరాల రేటు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక సమర్పణలతో సహా వివిధ అంశాలతో ప్రపంచ వ్యాప్తంగా 173 నగరాలను ఈ నివేదిక ర్యాంకు చేసింది. వియన్నా 2021 లో మహమ్మారి సమయంలో ర్యాంకింగ్స్‌లో పడిపోయినప్పటికీ తిరిగి పుంజుకుని 2022 లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. 2023 లోనూ ఆ స్థానాన్ని కొనసాగించింది. ఈ జాబితాలో డెన్మార్క్‌కు చెందిన కొపెన్ హగన్ 2 వ స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ వరుసగా 3,4 స్థానాల్లో నిలిచాయి. కెనడాకు చెందిన వాంకోవర్ 5వ స్థానాన్ని దక్కించుకుంది. మొదటి 10 స్థానాల్లో కెనడా నుండి 3 నగరాలు, స్విట్జర్లాండ్ నుంచి 2, ఆసియా నుండి 2 నగరాలు చోటు దక్కించుకున్నాయి. సిరియాలోని డమాస్కస్, లిబియాలోని ట్రిపోలి ర్యాంకింగ్‌లో అట్టడుగున నిలిచాయి. ఇండియా నుండి న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు 45 నుండి 50 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.



రష్యన్ లూనా - 25 విఫలం : చంద్రునిపై పరిశోధన కోసం చేపట్టిన ప్రతిష్టాత్మక లూనా - 25 ప్రయోగం విఫలం అయింది. సాంకేతిక సమస్య కారణంగా చంద్రునిపై క్రాష్ లాండింగ్ అయినట్లు రష్యన్ అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్ కాస్మోస్ వెల్లడించింది. చంద్రుడిపై పరిశోధన నిమిత్తం ఆగస్టు 10న వోస్తోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి రష్యా ప్రయోగించిన లూనా - 25 ఆగస్టు 19న సాంకేతిక సమస్య తలెత్తడంతో చంద్రునిపై కూలిపోయింది. ఈ నెల 21 న ఇది చంద్రునిపై దిగాల్సి వుంది. కేవలం 11 రోజుల్లోనే చంద్రుడిపై దిగేందుకు ఈ ప్రయోగం రష్యా చేసింది. కానీ దురదృష్ట వశాత్తు ఈ ప్రయోగం విఫలమైంది.



జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ఆగస్టు 23 : చంద్రయాన్ 3 చంద్రుడి పై దిగిన ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్రమోడి ఆగస్టు 26న ప్రకటించారు. చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రదేశాన్ని 'శివశక్తి' అని, చంద్రయాన్ 2 తాకిన ప్రదేశాన్ని 'తిరంగా పాయింట్' గా పిలవనున్నట్లు ఆయన ప్రకటించారు. కొన్ని సంవత్సరాలలో భారత అంతరిక్ష పరిశ్రమ 8 బిలియన్ డాలర్ల నుండి 16 బిలియన్ డాలర్లుగా మారుతుందని నిపుణులు సూచించారని నరేంద్రమోడి ప్రకటించారు.



ఆంధ్రప్రదేశ్ కు ప్రతిష్టాత్మక జైవిక్ అవార్డు : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. ఇంటర్నేషనల్ కాంపిటిషన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసిసిఒఎ) సంస్థ 2023 కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జైవిక్ ఇండియా అవార్డు ప్రకటించింది. జాతీయ స్థాయిలో 10 విభాగాల్లో 51 అవార్డులను వెల్లడించగా ఇందులో రాష్ట్రానికి 3 అవార్డులు దక్కడం విశేషం. ప్రకృతి వ్యవసాయం ఉద్యమం 700 గ్రామాల్లో 40 వేల మంది రైతులతో ప్రారంభమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు పొందింది. ఫలితంగా ఇప్పుడు ప్రకృతి సాగు 3,730 పంచాయితీలకు విస్తరించింది. 9.40 లక్షల ఎకరాలకు పైగా 8.5 లక్షల మంది రైతులు భాగస్వామ్యంతో గణనీయమైన అభివృద్ధి సాధించింది.



ఇన్ఫోసిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఇగా స్వియాటక్ : మహిళల టెన్నిస్ వరల్డ్ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్‌ను ఇన్ఫోసిస్ కు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. డిజిటల్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం, ప్రపంచ వ్యాప్తంగా మహిళలను ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశం. టెన్నిస్ దిగ్గజం రాపెల్ నాదెల్ కూడా ఈ గౌరవానికి సంతకం చేశారు.